తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

సచిత్రమాసపత్రిక

ఏప్రిల్ 2021 ..... వెల రూ. 5/-



## ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాలు

2021 ఏప్రిల్ 21 నుండి 29 వరకు

తిరుమల తిరుపతి దేవస్థానములు

# ఒంటిమిట్ట
# శ్రీ కోదండరామస్వామివారి
# బ్రహ్మోత్సవాలు

2021 ఏప్రిల్ 21 నుండి 29 వరకు



**21-04-2021 బుధవారం**
పగలు: ధ్వజారోహణం
రాత్రి: శేషవాహనం

**22-04-2021 గురువారం**
పగలు: వేణుగానాలంకారం
రాత్రి: హంసవాహనం

**23-04-2021 శుక్రవారం**
పగలు: వటపత్రశాయి అలంకారం
రాత్రి: సింహవాహనం

**24-04-2021 శనివారం**
పగలు: నవనీత కృష్ణాలంకారం
రాత్రి: హనుమత్సేవ


**25-04-2021 ఆదివారం**
పగలు: మోహినీసేవ
రాత్రి: గరుడసేవ

**26-04-2021 సోమవారం**
పగలు: శివధనుర్భాణాలంకారం
రాత్రి: ఎదుర్కోలు, కల్యాణోత్సవం, గజవాహనం

**27-04-2021 మంగళవారం**
పగలు: రథోత్సవం

**28-04-2021 బుధవారం**
పగలు: కాళీయమర్దనాలంకారం
రాత్రి: అశ్వవాహనం

**29-04-2021 గురువారం**
పగలు: చక్రస్నానం
రాత్రి: ధ్వజావరోహణం



# గీతాశ్లోకార్థసారం

**శ్లో :** సేనయో రుభయో ర్మధ్యే రథం స్థాపయ మేఽ చ్యుత ॥

యావదేతా న్నిరీక్షేఽ హం యోద్ధుకామా నవస్థితాన్ ।
కైర్మయా సహ యోద్ధవ్య మస్మిన్ రణసముద్యమే ॥

(శ్రీమద్భగవద్గీత 01వ అధ్యాయం- 21వ శ్లోకంలో అర్ధశ్లోకం, 22)

**ప్రతిపదార్థం:** అచ్యుత= ఓ కృష్ణా!; అస్మిన్= ఈ యొక్క; రణసముద్యమే=యుద్ధారంభమునందు; మయా= నాచేత; కైఃసహ= ఎవరితో; యోద్ధవ్యమ్= యుద్ధము చేయవలసియున్నదో; యోద్ధు కామాన్= యుద్ధము చేయగోరినవారలై; అవస్థితాన్= (ఇచట) నిలబడియున్న; ఏతాన్= (అట్టి) వీరిని; యావత్= ఎంతలో; అహమ్= నేను; నిరీక్షే= చూడగలనో; (తావత్=అంతలో); ఉభయోః సేనయోః= రెండుసేనలయొక్క; మధ్యే= నడుమ; మే= నాయొక్క; రథమ్= రథమును; స్థాపయ= నిలబెట్టుము.

**భావం:** అర్జునుడు చెప్పెను– ఓ కృష్ణా! ఈ యుద్ధారంభమునందు నేను ఎవరితో పోరుసల్పవలయునో, అట్టి ఈ యుద్ధాభిలాషులను ఎచటినుండి నేను చక్కగ జూడగల్గుదునో రెండుసేనలమధ్య అచ్చోట నా రథమును నిలబెట్టుడు.

---

## రామానుజులు యిహపరదైవము

గతులన్ని ఖిలమైనకలియుగమందును
గతి యీతఁడే చూపె ఘనగురుదైవము.

యీతని కరుణనేకా యిల వైష్ణవులమైతి
మీతనివల్లనే కంటి మీ తిరుమణి
యీతఁడే కా వుపదేశ మిచ్చె నష్టాక్షరమంత్ర
మీతఁడే రామానుజులు యిహపరదైవము.

వెలయించె నీతఁడేకా వేదపురహస్యములు
చలిమి నీతఁడే చూపె శరణాగతి
నిలిపినాఁ డీతఁడేకా నిజముద్రాధారణము
మలసి రామానుజులే మాటలాడేదైవము.

నియమము లీతఁడేకా నిలిపెఁ బ్రపన్నులకు
దయతో మోక్షము చూపెఁ దగ నీతఁడే
నయమై శ్రీవేంకటేశు నగమెక్కేవాకిటను
దయఁజూచీ మమ్ము నిట్టే తల్లితండ్రిదైవము.

(సంపుటం- 2, సంకీర్తన - 372)



కలియుగంలో గొప్ప గొప్ప దారులన్నీ మూతబడిపోయాయి. మరి కొన్ని మార్గాలు శిథిలావస్థకు చేరుకుంటున్న సంకటపరిస్థితుల్లో శ్రీరామానుజులవారు గొప్ప గురువుగా, దైవంగా అవతరించి సంసార చేతనులైన జీవులు సద్గతికి చేరుకొనే మార్గాన్ని ఉపదేశించారు.

"ఈ గురువు కరుణ చేతనే కదా మేము ఈ లోకంలో వైష్ణవుల మయ్యాము. ఈయన వల్లనే కదా మేము 'తిరుమణి' ధరించ గలిగాము. ఈ మహానుభావుడే కదా మాకు అందరికీ **'ఓం నమో నారాయణాయ'** అనే అష్టాక్షరీ మంత్రాన్ని ఉపదేశించిన వారు వీరే! ఈ శ్రీరామానుజుడే మాకు ఇహానికీ, పరానికీ మిగిలి ఉన్న దేవుడు!".



"ఈయనే కదా వేదాలరహస్యాలన్నీ వెలయించినవారు. స్నేహమాధుర్యంతో ఈయనే కదా మనకు 'శరణాగతి'ని నేర్పించిన మహిత మానవతామూర్తి. చిన్నవయసులోనే తప్తముద్రా చక్రాంకనాలు స్వీకరించి శ్రీవైష్ణవమతాన్ని లోకంలో నిలిపినవారు ఈయనే కదా! మనకు తోడునీడై మాటలాడే దైవమంటే శ్రీరామానుజులే కదా!"

"ప్రపత్తి చేసిన ప్రపన్నులకు పరమాచారాలు ఈయనే కదా ఏర్పాటు చేసినది! ముముక్షువులకు మోక్షమార్గాన్ని చూపిన ఆచార్య పురుషుడితడే కదా! శ్రీ వేంకటాచలంపై నడిచివెళ్లే దారిలో **'త్రోవ భాష్యకారులు'** గా వెలసినవారు శ్రీరామానుజులే కదా! అటువంటి తల్లీ, తండ్రీ, దేవుడూ అయిన శ్రీరామానుజుల వారు మమ్మల్ని యిలాగే ఎప్పుడూ దయతో చూచి కాపాడాలి".





# శ్రీవేంకటేశ్వర సర్వశ్రేయస్సు ట్రస్టు

**"మానవసేవయే మాధవసేవ"- అనే లక్ష్యంతో తి.తి.దేవస్థానములవారు వివిధ సామాజిక సంక్షేమకార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అనాథ బాలబాలికలకు చేయూతనివ్వాలనే సంకల్పంతో 1943వ సం॥లో శ్రీవేంకటేశ్వర బాలమందిర్(తిరుపతి) ట్రస్టును స్థాపించారు. ఈ శ్రీవేంకటేశ్వర బాలమందిరంట్రస్టు ప్రస్తుతం శ్రీవేంకటేశ్వర జలనిధిపథకం, కల్యాణమస్తుట్రస్టు, శ్రీవేంకటేశ్వర సమాచార సాంకేతికట్రస్టులను కలుపుకుని 'శ్రీవేంకటేశ్వర సర్వశ్రేయస్సు ట్రస్టు'గా రూపొందించడమైనది.**

## శ్రీవేంకటేశ్వర సర్వశ్రేయస్సు ట్రస్టు లక్ష్యాలు



01) అనాథలైన బాలబాలికలు, వృద్ధులు, నిరాశ్రయులు, అభాగ్యులు, నిరుపేద బలహీనవర్గాలవారిఅభివృద్ధి, సంరక్షణ, సంక్షేమాలకోసం ధర్మశాలలు, వసతిగృహాల ఏర్పాటు.

అనాథలకు, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థినీవిద్యార్థులకు ఆర్థికంగా చేయూతనివ్వడం;

02) దివ్యాంగులకు, మానసికరోగులకు తగు వైద్యసదుపాయాలు కల్పించి, వారిజీవితప్రమాణాలను మెరుగుపరచడం. ఈ లక్ష్యంలో కుల, మత, జాతి, వర్గ, వర్ణ భేదాలను పాటించక అందరినీ సమానంగా స్వీకరించడం.

03) వరదలు, కరవువంటి ప్రకృతివిపత్తులసమయాల్లో అగ్నిప్రమాదాలవంటి అవాంఛనీయసంఘటనలు జరిగినపుడు సత్వరసహాయచర్యలు గావించడం.

04) వినికిడిలోపం, మాటలురానిశిశువులకు, ఈ లోపాలతో ఎదిగిన పిల్లలకు పునరావాసకేంద్రాల్ని ఏర్పాటుచేయడం.

05) గ్రామాలలో పై లోపాలతో ఉన్న బాలబాలికలకు అవసరమైన పరికరాలను అందజేయడంతోపాటు- వారిని విద్యావంతుల్ని చేయడం.

06) సమాజంలో కనీస అవసరమైన త్రాగునీటిని నిత్యం అందుబాటులో ఉంచడం. తిరుమల పంచాయతి, తిరుపతి కార్పొరేషన్‌కు అవసరమైన నీటివనరులఏర్పాటుకై ఆనకట్టలు, తొట్లెలు ఏర్పాటుచేయడం. నీటిపొదుపుకై అవసరమైన చర్యలు తీసుకోవడం.

07) శ్రేయస్కరమైన వివాహకార్యక్రమాలద్వారా వధూవరులు గౌరవాభిమానాలతో, ఉన్నతకుటుంబజీవితంతో ప్రశాంతంగా ఉండేందుకై కల్యాణమస్తు కార్యక్రమం.

08) పుస్తకాలతోపాటు, ఇంటర్‌నెట్‌వంటి ఆధునికసాంకేతిక సదుపాయాలతో మనదేశ చారిత్రక, సాంస్కృతికవారసత్వ సంపదను భవిష్యత్తరాలకు అందజేయడం.

09) సామాజిక క్రమశిక్షణ, నైతికవిలువల్ని పెంపొందిస్తూ యువతరంలో ఆత్మవిశ్వాసం కలిగించటం.

10) పైన పేర్కొన్న ఆశయాలసాధనకు కృషిచేస్తున్న వ్యక్తులకు, సంస్థలకు సహకారమందించడం.

## శ్రీవేంకటేశ్వర సర్వశ్రేయస్సు ట్రస్టుకు విరాళాలు ఇలా....

**01) ఈ పథకంకోసం కనీస విరాళం రూ.1000/- గా నిర్ణయించబడింది.**

**02) రూ.1000/- కంటే తక్కువవిరాళం శ్రీవారి హుండీఖాతాలో జమ చేయబడుతుంది. ఈ విరాళాలన్నీ కూడా ఒకే జాతీయబ్యాంకులో డిపాజిట్ చేయబడతాయి, వాటిమీదవచ్చే వడ్డీ ఈ పథకంకోసం వినియోగింపబడుతుంది. దాతలు తమ విరాళాలను 'ది ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, శ్రీవేంకటేశ్వర సర్వశ్రేయస్సు ట్రస్టు, తి.తి.దే.,తిరుపతి' వారి పేరిట ఏదైనా షెడ్యూల్‌బ్యాంకుమీద తీసిన చెక్కు/ డిమాండ్‌డ్రాఫ్ట్‌ద్వారా 'చీఫ్ అకౌంట్స్ ఆఫీసరు, తి.తి.దే., తిరుపతి-517501' వారికి పంపవచ్చు.**

**ఇతర వివరాలకు 0877-2264258ను సంప్రదించగలరు.**

50 వసంతాల
1970-2020
తిరుమల తిరుపతి దేవస్థానముల సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 51 ఏప్రిల్, 2021 సంచిక : 11



వేంకటాద్రి సమం స్థానం
బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశ సమో దేవో
న భూతో న భవిష్యతి ॥

**గౌరవ సంపాదకులు**
డా॥ కే.ఎస్.జవహర్ రెడ్డి, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు.

**ప్రచురణకర్త-ప్రధాన సంపాదకులు**
ఆచార్య కె.రాజగోపాలన్, పిహెచ్.డి.,

**సంపాదకులు**
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

**ఉపసంపాదకులు**
డా॥ కంపల్లె రవిచంద్రన్,
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,

**ముద్రాపకులు**
శ్రీ పి.రామరాజు, ఎం.ఏ.,
ప్రత్యేకాధికారి (ప్రచురణలు & ముద్రణాలయం),
తి.తి.దే., తిరుపతి.

**ఫోటోలు**
శ్రీ పి.ఎన్.శేఖర్, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, సహాయఫోటోగ్రాఫర్, తి.తి.దే.,

సప్తగిరి మాస పత్రిక
ఇతర వివరాలకు
ఫోన్ నెంబర్లు
0877-2264543
0877-2264359
0877-2264360

విడి ప్రతి : రూ. 5/-
సం॥ చందా : రూ. 60/-
జీవిత చందా : రూ. 500/-
విదేశాలకు సం॥చందా : రూ. 850/-

## ఈ నెలలో....

| | | |
|---|---|---|
| ఒక వీడ్కోలు - మరొక 'మేలిరాక' | బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ | 07 |
| శ్రీరామనవమి | డా॥ పమిడికాల్వ చెంచుసుబ్బయ్య | 08 |
| శ్రీమద్భగవద్గీత | విద్వాన్, డా॥ ఈ.జి.హేమంత కుమార్ | 10 |
| కాలగమనంలో తొలిఉషస్సు | డా॥ సుబ్బలక్ష్మి మర్ల | 12 |
| ఇలవైకుంఠపురి ఒంటిమిట్ట ఏకశిలాపురి | విద్వాన్ కట్టా నరసింహులు | 14 |
| మత్స్యమూర్తిం భజే! | శ్రీమతి యడవల్లి మృదుల లక్ష్మి | 17 |
| తిరుమల సమయాచారములు | డా॥ ఎన్.సి.వి.నరసింహాచార్యులు, శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు | 19 |
| నేటివన్నీ.. నాటి భారతంలోనే.. | డా॥ నిష్ఠల సుబ్రహ్మణ్యశాస్త్రి | 21 |
| అన్నమయ్య ఆర్థికసూత్రాలు | డా॥ గూడూరు యానాది రాజు | 24 |
| జీవితం స్థిరంగా ఉండాలంటే.. | డా॥ మేడికుర్తి ఓబులేశు | 26 |
| భాగ్యమన్న అయోధ్యా వాసులదే! | బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు శర్మ | 31 |
| ధర్మరాజా! ఈ మాటలు వినవయ్యా! | డా॥ సాకం నాగరాజ | 35 |
| శ్రీమద్భగవద్గీత | శ్రీ కుప్పా విశ్వనాథశాస్త్రి | 37 |
| 'సొరకాయ'తో ఆరోగ్యభాగ్యం | డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ | 38 |
| భద్రగిరి రామయ్య | శ్రీమతి డి.వరలక్ష్మి | 39 |
| భారతీయ హృదయనాదం | శ్రీ కె.జానకిరామావధాని | 43 |
| ఆరు రుచుల్లో అద్భుత విజ్ఞానం | డా॥ కప్పగంతు రామకృష్ణ | 46 |
| సంస్కృతం నేర్చుకుందాం..!! | రచన- మహామహోపాధ్యాయ కె.కృష్ణాచార్య, నిర్వహణ- మహామహోపాధ్యాయ ఎస్.లక్ష్మణయ్య | 49 |
| వైకుంఠపాళి | శ్రీ కోగంటి వేంకటఅప్పలాచార్యులు | 50 |
| మనం పనిచేస్తూనే ఉండాలి! | డా॥ గరికిపాటి నరసింహారావు | 51 |
| అందరికీ మోక్షం (చిత్రకథ) | కథ : శ్రీ డి.శ్రీనివాసదీక్షితులు, చిత్రాలు : శ్రీ ద్వారకానాథ్ | 52 |

ముఖచిత్రం : శ్రీసీతాసమేత శ్రీకోదండరామస్వామివారు (ఒంటిమిట్ట)
వెనుక చిత్రం : శ్రీసీతాలక్ష్మణసమేత శ్రీకోదండరామస్వామివారు (తిరుపతి)

ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.

24 గంటలూ పనిచేసే
తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్ నెం.
0877 2277777 / 2233333



వెబ్‌సైట్- www.tirumala.org;
'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు-
sapthagiri_helpdesk@tirumala.org; ద్వారా తెలియజేయవచ్చు.

# ఆనంద పరవశాల 'ఆమని'

శ్రీమన్నారాయణుని ఆజ్ఞతో కాలం ప్రవర్తిస్తూంది. స్వామి చేతిలోని చక్రాయుధం కాలచక్రమే! "సృష్టిస్థితి లయ కారణమైన కాలస్వరూపుణ్ణి నేనే"నని గీతలో స్వామి పేర్కొన్నాడు. రూపం లేనిదీ, శాశ్వతమైందీ, సర్వ వ్యాపకమైందీ, సర్వశక్తిమంతమైందీ కాలం. మహావిష్ణువూ ఇదే గుణరాశితో ప్రకాశిస్తూ, ఆ కాలాన్ని నియమిస్తూంటాడు. మనవ్యవహారంకోసం అనంతమైన ఈ కాలాన్ని నామరూపాత్మకంగా విభాగించు కొన్నాం. మన ప్రాచీనులు ఈ ఏర్పాటు చేశారు. ఆంధ్రులు చాంద్రమానాన్ని పాటిస్తారు. చంద్రుడు పూర్ణిమ నాడు ఉండే నక్షత్రాన్నిబట్టి ఆ మాసాన్ని ఆ నక్షత్రం పేరుతో గణిస్తారు. చాంద్రమానంరీత్యా సంవత్స రాత్మకమైన కాలం వసంతఋతువుతో ప్రారంభమౌతుంది. "ఋతువుల్లో వసంతఋతువు నేనే" నన్నాడు గీతాచార్య పరబ్రహ్మ. 'ఉగాది'తో వసంతఋతువు ప్రారంభమౌతుంది. చెట్లన్నీ పూలతో, కాయల్తో, పండ్లతో శోభిస్తూ 'మా జీవితమంతా మానవ, మాధవ సేవకే' అంటూ ఆహ్వానిస్తూంటాయి. కనుకనే వసంత ఋతువును కుసుమాకరమనీ, మధుమాసమనీ, మాధవమనీ పెద్దలు పేర్కొన్నారు. మధురానందనిలయమైన మాధవఋతువు ఉగాదిపర్వదినంగా రూపొంది, అందరికీ వారిఆరాధ్యదైవమైన తిరుమల శ్రీవారిఆస్థానంతో ఆనందనిలయుడనే పేరును సార్థకం చేస్తుంది.

కాలాన్ని భగవద్రూపంగా భావిస్తే ప్రతిరోజూ, ప్రతినిమిషమూ పండుగే! ఆనందమే! ఇట్టి పవిత్ర విశాలభావన లేకుండా ఆచరించేపండుగలు దండుగలే అవుతాయి. పిండివంటలూ, మధురపదార్థాలూ తిని, రజస్తమోగుణాలు నింపుకోవడం తప్ప సాత్త్వికప్రవృత్తి లభించదు. కనుకనే మనపూర్వులు ప్రతిపండుగకూ ఒకఅధిష్ఠానదైవం, పూజ, నియమాలూ, ఆహారవిశేషాలూ ఏర్పాటుచేశారు. పవిత్రభావంతో చేసే ప్రతికార్యమూ ఇహపరానందదాయకమే అవుతుంది.

'ఉగాది' ప్రత్యేకించి ఇతరవ్రతాలూ, పండుగలవలే ఏదో ఒకదేవతను ఉద్దేశించి చేసేదికాదు. అనంతమైన కాలాన్ని మనసౌలభ్యగణనంకోసం సంవత్సరాత్మకంగా లెక్కించి, సంవత్సరాదినాడు కాలాన్ని మనఇష్ట దైవస్వరూపంగానూ, సకలదేవతాస్వరూపంగానూ భావించి, సంవత్సరకాలభవిష్యత్తును ముందుగా తెలుసుకొని, ఆయాసమయాల్లో దైవానుగ్రహప్రాప్తికై చేయాల్సిన సాధనాలను సిద్ధపరచుకొనే ఒకచక్కనిశాస్త్రీయ ప్రణాళికకు పూర్వరంగం ఏర్పరచుకోవడం ఉగాదివిశిష్టత. కాలగణనంలో ఒకప్పుడు మార్గశిరంతోనూ, వైశాఖంతోనూ, కార్తికంతోనూ, ఆశ్వయుజంతోనూ ఇలా అనేకవిధాలుగా సంవత్సరం ప్రారంభమైనవిశేషాలు మనవాఙ్మయంలో కన్పిస్తున్నాయి. అట్లే యుగప్రారంభతిథివిషయంలోనూ కల్ప, మన్వంతరాదిభేదాన్నిబట్టి తేడా లున్నాయి. నక్షత్రాల్నికూడా యుగాదినక్షత్రాలుగా పేర్కొన్నారు. బ్రహ్మదేవుడు చైత్రశుద్ధపాడ్యమి, సూర్యో దయవేళ ఈ సృష్టిని సమగ్రంగా చేసినాడు. అందుకు కృతజ్ఞతాసూచకంగా, జ్ఞాపకచిహ్నంగా ఉగాది పండుగ జరుపుకొంటున్నాము.

జీవనప్రయాణంలో మున్ముందుగా వచ్చే సుఖదుఃఖాలనే ద్వంద్వాల మజిలీలనుగూర్చి తెలుసుకొని, మార్గాన్ని సుఖతరమూ, సులభతరమూ చేసుకుని, పురోగమించడానికే "పంచాంగశ్రవణం" ఉగాదినాడు ఏర్పాటయ్యింది. అన్నివర్గాలవాళ్లకీ, దేశాలవాళ్లకీ, పంచాంగం ఎంతోముందుచూపుతో ప్రవర్తించే విధి విధానాలను చూపుతుంది. ఖగోళ భూగోళాలకు సమన్వయాన్ని సాధిస్తుంది.

'ఉ' అంటే సంతోషం, శివుడు, విష్ణువు అనీ, 'గ' అంటే గతి, పొందుట అనీ అర్థాలు. కనుక 'ఉగ' అంటే భగవత్కృపవల్ల సంతోషాన్ని ఒక సంవత్సరంపాటు ప్రణాళికాబద్ధంగా, ధర్మయుక్తంగా పొందే మార్గానికి 'ఆది' మొదటి రోజు అని గ్రహించాలి. 'యుగాది' పదం సృష్టి ప్రారంభాన్ని సూచిస్తే 'ఉగాది' పదం ఆ సృష్టితత్త్వాన్నీ, మూలాన్నీ తెలుసుకొని, అందలిఆనందాన్ని ఆస్వాదించే సంవత్సర ప్రమాణవిధానాన్ని నిరూపించేది అవుతుంది. ఇలా రెండుపదాలూ 'కార్యకారణఫల' త్రివేణీసంగమంగా మన జీవనాభ్యుదయానికీ, ఆనందానికీ మూలకందాలు! "మూలకందో ముకుందః" కనుక ముకుందారాధన ఉగాదికి ఆత్మ!

# ఒక వీడ్కోలు - మరొక 'మేలిరాక'

- బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ

మనం చూచే ప్రపంచం, దీనిలోని పదార్థాలు, ప్రాణులు- అన్నీ 'పొడవు, వెడల్పు, లోతు (ఎత్తు)' అనే మూడు పరిమితుల్లో ఉంటాయి. ఇవన్నీ ఆధారపడి ఉన్న పరిమితి 'కాలం'. కాల గతిని అనుసరించి పదార్థాల, సంఘటనల ఉనికి ఆధారపడి ఉంటుంది. అన్నిటికీ కాలపరిమితి ఉంటుందేమో కానీ, కాలానికి పరిమితి లేదు.

అత్యంత శక్తిమంతమైన కాలంలోని దైవీయలక్షణాన్ని గుర్తించి, ఉపాసించి అనుకూలంగా మలచుకునే విధానాలు మనకు ఉన్నాయి.

"కాలం కలిసి రాలేదు" అనే మాటను వింటుంటాం. అన్నీ సమకూరినా, కాలానుకూలత సరిపోవాలి. అది లేనప్పుడు సాఫల్యం సిద్ధించదు. ఋతువులు, వాటిలో పరిణమించే ఎండా, వానా, చలివంటివన్నీ కాలాన్ని అనుసరించి ఏర్పడతాయి.

నిశితంగా గమనించినట్లయితే, వీట న్నిటినీ నియమిస్తున్నది. కాలమే! గ్రహ, నక్షత్రాదుల గమనాలుసైతం కాలనియతిని అనుసరించే సాగుతాయి. కాలానికి ఉన్న ఈ మహాశక్తిని పరిశీలించి, కాలపు ప్రతి మలుపులో అనుకూలతకై ప్రార్థించడం ప్రతి సంస్కృతిలోని సంప్రదాయం. వారి వారి సంవత్సరాలకు ఆదిలో శుభాకాంక్షలు పలకడం, ఉత్సవాలను నిర్వహించడం ప్రపంచంలో అన్నిదేశాలప్రజల్లోను ఆన వాయితీ. వ్యక్తికూడా ప్రతి సంవత్సరం పుట్టిన రోజును ఉత్సాహంగా జరుపుకుంటాడు.

అథర్వవేదం "భూత, భవిష్యద్వర్తమాన రూపుడై, ప్రాతః, సాయంకాల, దివారాత్రుల" రూపాలతో ఉన్న కాలపురుషుణ్ణి ప్రార్థించింది.

"భూతభవ్యభవత్ప్రభుః' అని విష్ణుసహస్రనామాలు కూడా కాలరూపుడైన పరమాత్ముణ్ణి పేర్కొన్నాయి. కాలాన్ని గాయాలు మాన్పే శక్తిగా భావించడం పరిపాటి. ఎన్నింటినో కబళించే కాలవదనం, మరెన్నింటినో సంప్రదాయాలుగా మిగుల్చుతుందికూడా!

కాలంలో విలీనమైన ఎన్నో అంశాలను శోధనతో సాధించాలని కొందరు యత్నిస్తే, తపస్సుతో సిద్ధింపజేసు కునేందుకు కొందరు ఉద్యమిస్తారు. సావిత్రి కాలపురుషుణ్ణి ప్రార్థించి, కాలంలో లీనమైన తనపతిప్రాణాలను తిరిగి సంపాదించినవైనం మహాభారతంలోను, పురాణవాఙ్మయంలోను కనిపిస్తుంది. శ్రీకృష్ణుడు తనకాలశక్తితో యముణ్ణి శాసించి, గురుపుత్రుణ్ణి బ్రతికించినఉదంతం విన్నదే.

> **భవిత ఆశగా,**
> **ఊహగా ఆహ్వానిస్తే**
> **గతం జ్ఞాపకంగా,**
> **ప్రభావంగా**
> **మిగిలిపోతుంది.**
> **గతం మనకు**
> **గురువు.**
> **ఈ గురువు**
> **ఎన్నో అనుభవాల**
> **ద్వారా**
> **పాఠాలు నేర్పింది.**
> **అవేమిటో పునశ్చరణ**
> **చేసుకోవడానికి**
> **ఒక అవకాశం**
> **ఈ కొత్త ఏడాది కల్పన.**

'దేశకాలాలు (Space & Time) రెండూ అంతు చిక్కనివే. కానీ, వాటిలో కట్టు బడి మన జీవనయానం సాగుతుంది. అపరి మితంగా అఖండంగా వ్యాపించిన ఈశ్వర చైతన్యం, దేశకాలాలకు అతీతంకూడా!

సర్వవ్యాపకమైన ఆ విష్ణుతత్త్వమే అతీతమైనందువల్ల కాలానికే కాలంగా, 'కాల కాలు' డనీ 'మహాకాలు' డనీ వ్యవహరింప బడుతోంది.

కాలాన్ని పరిమితులతో పోల్చుకునేం దుకు మనం ఏర్పరచుకున్న 'సంవత్సరం' వంటి ప్రమాణాల్లో ఉండి, ఆ కాలస్వరూపు డైన పరమాత్మను ప్రార్థించి, ప్రతికాలం ప్రతి కూలం కాకుండా, సానుకూలమై సత్ఫలితాలను ప్రసాదించాలని ఆకాంక్షిస్తూ.... కొత్త కాల గణనలకు స్వాగతం పలుకుదాం!

*'విశ్వం విష్ణుర్వషట్కారః, భూత భవ్య భవత్ప్రభుః'*- అంటూ దేశకాలాల్లో వ్యాపించిన అనంతచైతన్యస్వరూపుణ్ణి ప్రస్తుతిస్తూ, 'అహః (పగలు) 'సంవత్సరః'... వంటి రూపాలతో సంభావించి సంస్తు తించుదాం!!

# శ్రీరామనవమి

– డా॥ పమిడికాల్వ చెంచుసుబ్బయ్య
98481 11794

శ్రీమన్నారాయణుడు చైత్రశుద్ధనవమినాడు భూలోకంలో మానవుడుగా అవతరించాడు. ఒకే మహావిష్ణువు తనను తాను నాల్గువిధాలుగా విభాగించుకొని, దశరథుని సంతానంగా దివినుండి భువికి దిగివచ్చాడు. రామ లక్ష్మణ భరతశత్రుఘ్నులు నల్వురూ దైవత్వం కల్గిన మానవులే! మానవలోకాన్ని ధార్మికంగా తీర్చిదిద్దడానికి మానవరూపం ధరించి, మానవధర్మాలతో ప్రవర్తించిన మహాత్ములు.

సీత పాతివ్రత్యానికి పరమోదాహరణం! రాముడు ధర్మనిష్ఠకూ, సత్యసంధతకూ, ఏకపత్నీవ్రతమహత్తుకూ దృష్టాంతం! శ్రీరామునిదివ్య చరిత్రను కీర్తించిన వాల్మీకి ప్రపంచవాఙ్మయంలో 'ఆదికవి'గా శ్రీమద్రామాయణం 'ఆదికావ్యం'గా ఆరాధ్యమూర్తులయ్యాయి.

శ్రీరామునివంటి ఉత్తమగుణసంపన్నుడు మరొకడు ఆ కాలానికే కాదు ఏకాలానికీ లేడు. శ్రీరామునిధర్మచరిత సృష్టి ఉన్నంతకాలం ఉంటుంది.

సద్గుణసంపదతో రమించేవాడూ, ప్రజల్ని సంతోషపెట్టేవాడు కనుక ఆ మహాత్మునికి రాముడనేపేరు సార్థకం. రాముడు భారతీయులకే కాదు మానవజాతికే ఆదర్శమూర్తి!

మానజాతిని తీర్చిదిద్ది, ధార్మికజీవనం ఎంతగొప్పదో, ఎంతపవిత్రమైందో, ఎంత ఆదర్శవంతమైందో తనప్రవర్తన ద్వారా నిరూపించిన మహాత్ముని జన్మదినమే శ్రీరామనవమి. ఇదే శ్రీరామజయంతి. (జయంతి=జన్మదినం) ఇలాంటి మహాత్ముల జయంతులు జరుపుకొని, వాళ్లజీవితాన్ని మననం చేసుకొని, అందలి సత్యధర్మాలను ఆదర్శంగా స్వీకరించి, యథాశక్తిగా దీక్షతో ఆచరిస్తానని దృఢప్రతిజ్ఞ చేసి, ఆచరిస్తే ఫలం దక్కుతుంది కానీ ప్రసాదం స్వీకరించి తృప్తిపడితే చాలదు.


సామాన్యంగా భారతీయులందరూ శ్రీరామ నవమీపూజను యథాశక్తిగా ఆచరిస్తారు. 'ఇతర పండుగల' మాదిరి అనేక భక్ష్యభోజ్యాలు ఈ పండుగలో ఉండవు. ఈ పండుగనాడు కేవలం బెల్లంపానకం, నీరుమజ్జిగ, పెసరబేడల వడపప్పు మాత్రమే నివేదించి, స్వీకరిస్తారు. అందరికీ ఇస్తారుకూడా!

## ఆచరణవిధానం

శ్రీరామనవమినాడు ఉపవాసం ఉండి, పూజాదులు నిర్వహించి, రాత్రి జాగరణ చెయ్యాలని వ్రతగ్రంథాలు సూచించాయి. నవమినాడు విష్ణువు రామావతార మెత్తినందున చైత్రశుద్ధనవమీతిథి. ఇది 'సర్వకామదా' అన్నికోర్కెలు తీర్చేది అయింది. నవమిఉపవాసం, రాత్రి జాగరణ చేసి, దశమినాడు నిత్యకర్మానుష్ఠానం గావించుకొని, భక్తిశ్రద్ధల్తో శ్రీరాముణ్ణి పూజించి, అన్నసంతర్పణం చేయాలి. శ్రీరామభక్తులకు యథాశక్తిగా వస్త్రాలంకారాలు భక్తితో సమర్పించాలి. శ్రీరామనవమీవ్రతాన్ని ఆచరించడంవల్ల తెలిసో, తెలియకనో చేసిన అనేక పాపాలు నశిస్తాయి.

చైత్రశుద్ధపాడ్యమినుండి శుద్ధనవమిదాకా కొందరు శ్రీరామవసంతనవరాత్రులు నిర్వహిస్తున్నారు. వీటిల్ని 'గర్భజయంతి ఉత్సవాలు' అంటారు. కొందరు శ్రీరామనవమినుండి తొమ్మిదిరోజులు నిర్వహిస్తారు. వీటిల్ని 'జననజయంతి ఉత్సవాలు' అంటారు. రెండు విధానాల్లోనూ, తొమ్మిదిరోజులూ శ్రీమద్రామాయణపారాయణం, రాత్రులందు రామకథా కాలక్షేపం, భజనలూ చేస్తారు. నవమినాడు శ్రీరామజన్మవృత్తాంతఘట్టం చదివి, విన్పించి, పూజలు నిర్వహిస్తారు. దశమినాడు శ్రీరామ పట్టాభిషేకం చేస్తారు. కొన్నిఆలయాల్లో శ్రీరామ నవమినాడు 'సీతారామకల్యాణం' నిర్వహిస్తుండడం విశేషం!

కొందరు శ్రీరామనవమినుండి "రామకోటి" వ్రాయడం ప్రారంభించి మరుసటి శ్రీరామ



# ‘రామ’ నామ మహిమ

**శివుడు నిరంతరం జపించేది ‘రామ’ నామాన్నే!**
**‘రామః’ లోని ‘రా’ అనే మొదటి అక్షరం “ఓం నమోనారాయణాయ”**
**అనే నారాయణ అష్టాక్షరీ మంత్రంలోని “రా” అనేది.**
**ఈ ‘రా’ అనేది ఈ మంత్రానికి జీవం.**
**ఈ ‘రా’ లేకపోతే “ఓం నమో నాయనాయ” అవుతుంది.**
**అపుడు “పొందుటకు వీలులేదు” అనే అర్థం వస్తుంది.**
**‘రామః’ లోని రెండవదైన “మః” అనే అక్షరం**
**“ఓం నమశ్శివాయ” అనే శివపంచాక్షరీమంత్రంలోని “మః” అనేది.**
**ఈ అక్షరం ఈ మంత్రానికి జీవం. ఇది లేకపోతే “ఓం నశివాయ” అవుతుంది.**
**అపుడు “మంగళముకొరకు కాదు” అంటే “అమంగళంకొరకు” అనే**
**అర్థం వస్తుంది. కనుక శివకేశవుల ముఖ్యశక్తుల్ని**
**గ్రహించి, ఏర్పడిన దివ్యమూర్తి శ్రీరాముడు.**
**శివకేశవతత్త్వాలు రెండూ శ్రీరామునిలో నిండి ఉన్నాయి.**
**తారకమంత్ర మనే పేరు**
**‘రామ’ నామానికే ప్రసిద్ధం!**

నవమినాటికి పూర్తిచేస్తారు. రామనామంలోని ఒక్క అక్షరమే మహాపాపాల్ని హరిస్తుంది. రామనామమహిమ అనంతం!

మనదేశాన్ని ఏకసూత్రంతో బంధించింది అనాదికాలంనుండి శ్రీరామచరితమే! కవలపిల్లలు పుట్తే ‘రామ లక్ష్మణు’లని పేర్లు పెట్టడం మన ఆచారం! భారతీయ జీవనవిధానంలో రామచరిత్ర అంతర్లీనమై ఉంది. రామకథ తెలియని భారతీయుడు ఉండడు.

చైత్రమాసంలోనే మత్స్య, కూర్మ, వరాహ, శ్రీరామ జయంతులు వస్తాయి. సంవత్సరంలో వచ్చే దశావతార జయంతుల్లో అందరూ ఆచరించే మొట్టమొదటి జయంతి శ్రీరామజయంతి.

శ్రీరామజయంతి ఆచరణకు పునర్వసునక్షత్రంతో కూడిన చైత్రశుద్ధనవమి చాలా శ్రేష్ఠం. అష్టమితో కూడిననవమి శ్రీరామజయంతి పూజకు పనికిరాదు. ఈపూజ నవమినాటి మధ్యాహ్నం 12-00 గంటలకు చేయాలి.

## శ్రీరాముడు జగత్ప్రభువు

భారతీయకాలమానంప్రకారం వైవస్వతమన్వంతరంలో ఐదవత్రేతాయుగం నాల్గవభాగంలో 30 వేల సంవత్సరానికి సరైన విళంబి సంవత్సర చైత్రశుద్ధనవమి బుధవారం శ్రీరాముని జననం జరిగిందని పెద్దలు నిర్ణయించారు. ఇన్ని లక్షల సంవత్సరాలు గడచినా శ్రీరామునిజననం మహాపర్వదినంగా మనం నిర్వహిస్తున్నామంటే శ్రీరాముని ధర్మప్రవృత్తి మనపై ఎంత గొప్పగా ప్రభావం చూపిందో అర్థమవుతూంది.

ఆదర్శమానవుడైన శ్రీరాముణ్ణి చక్రవర్తిగా, పురుషోత్తముడుగా, యోగీశ్వరుడుగా, పరమాత్మగా ఎవరు ఎలా భావిస్తే వాళ్లకు అలా సాక్షాత్కరించి, వాళ్లను రక్షిస్తాడు శ్రీరాముడు.

రామునితో సమానమైన దైవం లేదని ఢంకాభజాయించి చాటిచెప్పినకంచెర్ల గోపన్న (రామదాసు) మాట ముత్యాల మూట! ‘రామ’ అనే రెండక్షరాలు స్మరించినంతనే సకల పాపాలూ హరించి, శుభాభ్యుదయాలు కల్గించేది రామనామం. ఆపేరుగల శ్రీరాముడు అవతరించినరోజును సాత్త్వికవిధానంలో జయంతి పర్వదినంగా భావించి, శ్రీరాముణ్ణి పూజించడంకంటే మానవజాతికి మహాసంపద మరేముంది?

మహాత్ముల జయంతులను పండుగలుగా జరుపుకొని, వాళ్ల పవిత్రచరిత్రను జ్ఞాపకం చేసుకొని, వాళ్లు మానవజాతికి ఆచరించి యిచ్చిన దివ్యసందేశాన్ని గ్రహించి, మనమూ అలా ప్రవర్తించడంకోసమే ఈ రామోత్సవాలు!

ఇంతటి ప్రభావానికీ, ఆదర్శానికీ నిలయమైన శ్రీరామునిజన్మదినం పండుగ మనందరికీ సత్యధర్మసౌశీల్యాల త్రివేణీసంగమం.

శ్రీరాముణ్ణి పూజించడంకంటే మానవజాతికి మహాసంపద మరేముంది?

# శ్రీమద్భగవద్గీత

5



విద్వాన్, డా॥ ఈ.జి. హేమంత కుమార్

## 5వ - అధ్యాయం (సారసంగ్రహం)

### కర్మసన్న్యాస యోగం- అధ్యాయ నామౌచిత్యం

కర్మ అంటే పని. సన్న్యాసం అంటే త్యాగం. కర్మ సన్న్యాసం అంటే - ఏ పనీ చేయకుండా ఉండటం కాదు. కర్మఫలాన్ని వదలి కర్మ చేయడమని అర్థం. కర్మను విడిచి ఉండటంకంటేకూడా కర్మయోగాన్ని అనుసరించటమే శ్రేష్ఠ మంటున్నాడు భగవానుడు. ఈ క్రింది శ్లోకంలో ఆ విషయమే చెప్పబడింది.

సన్న్యాసః కర్మయోగశ్చ నిఃశ్రేయసకరావుభౌ।
తయోస్తు కర్మసన్న్యాసాత్కర్మయోగో విశిష్యతే॥ 2

శ్రీకృష్ణపరమాత్మయొక్క సమదృష్టి, విశాలభావం ఇందులో కన్పిస్తుంది. అందరినీ సమానంగా చూచేవాడే ఆత్మజ్ఞుడని, బ్రహ్మం సమస్వరూపమనీ, సమచిత్తుడు సంసారాన్ని జయిస్తాడని శ్రీకృష్ణుడు ఈ అధ్యాయంలో నొక్కి వక్కాణించాడు.

కర్తృత్వభావన లేకుండా కర్మల్నిచేసి, పరమాత్మకు అర్పణ చేసేవాడు యోగి. అతనికి ఏ పాపమూ అంటదు.

బ్రహ్మణ్యాధాయ కర్మాణి సంగం త్యక్త్వా కరోతి యః।
లిప్యతే న స పాపేన పద్మపత్ర మివాంభసా॥ 10

తామరాకుపైన ఎంత వానకురిసినా నీరు ఎలా అంటదో అలాగే ప్రపంచంలో ఉన్నప్పటికీ ప్రపంచవిషయాలకు అంటకుండా ఉండేవాడు ముక్తుడౌతాడు. అట్టివాడు శాశ్వతశాంతిని పొందుతా డని ఈ అధ్యాయం బోధిస్తోంది.

గృహస్థాశ్రమం మంచిదా? సర్వసంగపరిత్యాగంతో కూడిన సన్న్యాసఆశ్రమం మంచిదా? అనే ప్రశ్నలకు సమాధానంకూడా ఈ అధ్యాయంలో లభిస్తుంది. కామక్రోధ రహితులకు బ్రహ్మనిర్వాణం కరతలామలకమనీ, సర్వయజ్ఞాలకు భోక్తయైన భగవంతుణ్ణి తెలుసుకున్నవారికి శాంతి సిద్ధిస్తుం దనీ ప్రతిపాదించబడింది.

ఈ అధ్యాయంలో సన్న్యాస మనే పదం అటు సాంఖ్యానికీ ఇటు జ్ఞానానికీ పర్యాయంగా వాడబడింది. ఇక్కడ కర్మయోగం, జ్ఞానయోగం రెండిటినిగూర్చి తెలియజేయబడి ఉండడంచేతకూడా దీనికి కర్మసన్న్యాసమనే పేరు ఏర్పడి ఉండవచ్చు.

ఈ ప్రకారంగా కర్మసన్న్యాసాన్నిగూర్చి విపులంగా బోధించిన అధ్యాయం అయినందున దీనికి కర్మసన్న్యాసయోగం అనే పేరు కల్గింది. ఈ అధ్యాయం చదివినా, విన్నాకూడా పాపాలు నశించి, ఉత్తమగతుల్ని పొందుతారు.

### అర్జునుడు అడుగుతున్నాడు

"కృష్ణా! కర్మలను విడిచిపెట్టడం మంచిదంటావు, మరల వెంటనే కర్మయోగాన్నే మెచ్చుకుంటావు. కర్మసన్న్యాసం మంచిదా? కర్మయోగం మంచిదా? ఈ రెండింటిలో ఏది మేలో? నిశ్చయించి చెప్పు" అన్న అర్జునుడిప్రశ్నను స్పష్టం చేస్తూ -

### శ్రీకృష్ణ డిలా అంటున్నాడు

"అర్జునా! కర్మసన్న్యాసం, కర్మయోగం రెండూకూడా ఉత్తమమైనవే! కర్మలను త్యాగం చేయటంకంటే కర్మచేయడం శ్రేష్ఠమైనమార్గం. "నేను చేసే కర్మకు కర్తను నేనే, దానిఫలితం నాదే" అని అనుకోకుండా కర్తృత్వ, భోక్తృత్వాలను, విడిచి పెట్టేవాడు సన్న్యాసి. అంటే దేనియందూ వాంఛ, ద్వేషం లేకుండా ద్వంద్వాలకు అతీతంగా నడచుకునేవాడు సదా సన్న్యాసియే అని తెలుసుకో!



సుఖదుఃఖాలు వెలుగునీడల వంటివి

సాంఖ్యం అంటే జ్ఞానయోగం. జ్ఞానయోగం కర్మయోగం- ఈ రెండూ వేరువేరుగా ఉంటాయని అవివేకులు అనుకుంటారే తప్ప విజ్ఞులు అలా భావించరు. ఈ రెండూ మోక్షమిచ్చేవే! అయితే జ్ఞానయోగంలో ప్రయాస ఎక్కువ.

కర్మయోగంలో కష్టంలేదు. పైగా ఇందులో సులభంగా ఫలితాన్ని పొందవచ్చు. కర్మయోగం లేకుండా సన్న్యాసం సాధ్యంకాదు. కర్మఫలంతో సంబంధం లేకుండా నిష్కామంగా కర్మయోగాన్ని అభ్యసిస్తేనే "కర్మసన్న్యాసం" మీద అధికారం కలిగేది. కనుక అన్నికార్యాలను తనతో చేయించేవాడు భగవంతుడే కానీ తాను కా దని తెలిసినవాడు-తత్త్వమెరిగినవాడే జ్ఞాని.

కర్మయోగి చిత్తశుద్ధితో, ఇంద్రియనిగ్రహంతో, అన్ని భూతాల ఆత్మలూ ఒకటే అనే భావనతో కర్మచేస్తే ఆ కర్మ బంధం అతణ్ణి అంటదు. ఈ యోగాన్ని పొందినవాడు ఏం చూచినా, వినినా, తాకినా, వాసనచూచినా, తినినా, నడచినా, నిద్రించినా, ఊపిరి పీల్చినా, విడిచినా, మాట్లాడినా, కనులు తెరచినా, మూసినా- ఈ క్రియలన్నీ ఇంద్రియాల సహజవ్యాపారాలే అని భావించి, ప్రకృతి పైగాని, ఈశ్వరునిపైగాని ఆరోపించి, సర్వం బ్రహ్మార్పణం అనుకుంటూ, దేనియందూ ఆసక్తి లేకుండా వ్యవహరించేవాడు కర్మలను చేసినా చేయని వాడే! తామరాకును నీరు అంటనట్లు కర్మలు వారిని బాధించవు.

యోగులు ఆత్మశుద్ధికోసం కర్మలను చేస్తారు. ఇతరుల్ని పవిత్రం చేయడానికే యోగులు కర్మల్ని ఆచరిస్తారు. భగవంతుడు సాక్షిమాత్రమే! వారివారికర్మలవల్లనే వారివారి పుణ్యపాపాలను వారు సంపాదించుకుంటారు. భగవంతుడు ఎవరి పుణ్యపాపాలను గ్రహించడు. జ్ఞానం అజ్ఞానంచేత ఆవరింపబడటంవల్ల జనులు దుఃఖాన్ని పొందుతారు. అజ్ఞానఆవరణం తొలగిపోతే-మబ్బునుండి వెలువడిన సూర్యుడులాగా దేదీప్యమానంగా ప్రకాశిస్తారు.

నవద్వారాల పురమైన ఈ శరీరంలోని ఆత్మవిషయం కూడా అంతే! ఆత్మను పొందాలంటే, ఆత్మానుభూతి కలగాలంటే నిరంతరసాధన, చింతన చేస్తూనే ఉండాలి. అప్పుడు అజ్ఞానం పటాపంచలైపోయి పునర్జన్మలేని పరమపదం సిద్ధిస్తుంది.

**విద్యావినయసంపన్నే బ్రాహ్మణే గవి హస్తిని।**
**శుని చైవ శ్వపాకే చ పండితా స్సమదర్శినః॥ 18**

సృష్టిలోని సమస్తజీవరాశుల 'ఆత్మ' సమమే అన్న సమబుద్ధి కలిగి ఉండాలి పండితుడు.

**న ప్రహృష్యేత్ ప్రియం ప్రాప్య నోద్విజేత్ప్రాప్య చాప్రియమ్।**
**స్థిరబుద్ధిరసమ్మూఢో బ్రహ్మవిద్ బ్రహ్మణి స్థితః॥ 20**

ప్రియం కల్గినప్పుడు ఉబ్బిపోక, అప్రియం కలిగినప్పుడు నీరుకారిపోక రెండింటియందు సమభావం కల్గి, అంతా భగవత్ప్రసాదంగా భావించాలి. స్థిరబుద్ధితో ఆత్మసాక్షాత్కారమందినవాడే జీవన్ముక్తుడు. కావున అర్జునా! అన్ని సుఖాలకంటే ఆత్మసుఖం మిన్న. ప్రాపంచికసుఖాలు క్షయం కలవి, క్షణికాలు. ఆత్మసుఖం అక్షయం. ఆత్మసాక్షాత్కారాన్ని పొందాలంటే కామక్రోధాల్ని జయించాలి. మనల్ని నిరంతరం వంచించే కామక్రోధాల వేగం అరికట్టబడాలి. మరి ఎప్పుడు సాధించాలి? ఈ శరీరం పతనం కాక పూర్వమే! శరీరం ఎప్పుడు పతనమైపోతుందో ఎవ్వరికీ తెలియదు. కనుక అర్జునా! నీవు వెంటనే కామక్రోధాదిఅరిషడ్వర్గంపై విజయం సాధించు. మోక్షం ఎక్కడో లేదు. అది ఇక్కడే లభిస్తుంది.

బాహ్యవిషయాలపట్ల ఆసక్తిని వదలిపెట్టు. నేత్రాలను కనుబొమల మధ్యనుంచు. ఉచ్ఛ్వాసనిశ్వాసాలను సమంగా ప్రసరించేటట్లు చేయి. ఇంద్రియాలను, మనసును, బుద్ధిని స్వాధీనంలో నిల్పి, మోక్షాన్ని కోరి, కామక్రోధాలను వదలిపెట్టు. ఆత్మజ్ఞానసంపాదనమందే బుద్ధిని నిల్పి, అభ్యాసం చేస్తే ముక్తుడవవుతావు.

"యజ్ఞము, తపస్సులచేత ఆరాధింపబడేవాణ్ణి, సర్వలోకాలకు ప్రభువును, సమస్తప్రాణులకు పరమమిత్రుణ్ణి, అయినట్టి నన్ను తెలుసుకొని, యోగియైనవాడు శాశ్వత సుఖాన్నీ, శాంతినీ, ఆనందాన్నీ పొందుతాడు."

శ్రీకృష్ణార్పణ మస్తు.



# కాలగమనంలో తొలిఉషస్సు

- డా॥ సుబ్బలక్ష్మి మర్ల

మన వేదశాస్త్ర పురాణేతిహాసాలను పరిశీలిస్తే భారతీయులు కాలప్రమాణాన్ని ఏవిధంగా ఏర్పరచుకున్నది తెల్లమౌతుంది.

మనపురాణాలను అనుసరించి కాలం– యుగం, మన్వంతరం, కల్పం, దినం, మాసం, సంవత్సరాలుగా విభజింపబడింది. దినం మళ్లీ ఘడియలు, విఘడియలు, లిప్తలు, నిముషాలుగా విభజింపబడింది. ఏడుయుగాలు ఒక మన్వంతరం. పదునాలుగు మన్వంతరాలు ఒకకల్పం. ఒక కల్పమంటే బ్రహ్మకు ఒకపగలు. రెండుకల్పాలు బ్రహ్మకు ఒకదినం.



సృష్టికర్త అయిన బ్రహ్మదేవుని ఆయుస్సు మన మానవ ఆయుస్సుతో లెక్కించలేదు.

ఇక మానవుల కాలప్రమాణాన్ని పరిశీలిస్తే వీరు యుగాలను నాలుగుగా ఏర్పరచుకున్నారు. కృతయుగం, త్రేతాయుగం, ద్వాపరయుగం, కలియుగం. కృతయుగానికి పదిహేడులక్షల ఇరవైవేల సంవత్సరాలు. త్రేతాయుగానికి పన్నెండులక్షల తొంభైఆరు సంవత్సరాలు. ద్వాపరయుగానికి ఎనిమిదిలక్షల అరవైనాలుగు సంవత్సరాలు. కలియుగానికి నాలుగులక్షల ముప్ఫైరెండుఏండ్లు. ఈ విధంగా మొత్తం ఈ నాలుగు యుగాలకు కలిపి నలభైమూడులక్షల పన్నెండు వేల సంవత్సరాలు. దీన్ని ఒక మహాయుగం అంటారు.

సంవత్సరానికి పన్నెండుమాసాలు, మాసానికి ముఫ్పైదినాలు, నాలుగువారాలు. వారానికి ఏడు రోజులు. ఈ విధంగా ఉపవిభజన చేసుకుని అరవై సంవత్సరాలను ఒక ప్రమాణంగా తీసుకుని వాటికి పేర్లను నిర్ణయించుకున్నారు. ఇవే ప్రభవాదులైన పేర్లతో నేడు వ్యవహారంలో ఉన్న సంవత్సరాలు.

మానవునిఆయుఃప్రమాణం నూరు సంవత్సరాలు. ఇందులో అరవై సంవత్సరాలు గడిస్తే సగంజీవితానికి పైన గడిచినట్లు పరిగణించి, రెండవభాగం కూడ ఏవిధమైన క్లేశాలు లేకుండా సుఖశాంతులతో విలసిల్లాలని షష్టిపూర్తి మహోత్సవం జరపడం రివాజు.

షష్టిపూర్తి అయిన దంపతులు నియమనిష్ఠలతో ఉపవాసదీక్షతో మండపం ఏర్పరచి, అందు అరవైసంవత్సరాలకు ప్రతీకగా అరవై కలశాలు, అష్టదిక్పాలకులను, నవగ్రహాలను, దేవీదేవతలను ప్రతిష్ఠించి, పూజాదికాలు నిర్వహిస్తారు.

మరుసటిరోజు అవభృథస్నాన మాచరించిన తర్వాత తిరిగి వారికి వివాహమహోత్సవం వేడుక జరిపిస్తారు. బంధు మిత్రులకు, బ్రాహ్మణులకు అన్నదానం చేసి, సువర్ణాదివివిధ దానాలను చేస్తారు. ఈ విధంగా షష్టిపూర్తి జరుపుకునేటప్పుడు ఆ వ్యక్తి జన్మించిన వత్సరమే ఉండడం సమంజసంగా తలపోసే కాబోలు సంవత్సరాలను అరవైగా నిర్ణయించడం జరిగింది.

ప్రాచీనకాలంలో ఒకయుగం పరిసమాప్తమై వేరొక యుగం ప్రారంభమైనపుడు ఆ నూతనయుగారంభాన్ని స్వాగతిస్తూ ఉత్సవాలు జరుపుకునేవారు. కాలక్రమంలో ఈ సంప్రదాయం యుగాలకు కాకుండా సంవత్సరాలకు జరుపుకోవడం ప్రారంభమై, యుగాది కాస్త ఉగాదిగా మారింది. ఉగాదినే సంవత్సరాదిగాకూడా వ్యవహరిస్తారు.

సంవత్సరాదినాడు ఏమి చేస్తే, సంవత్సరం పొడవునా అదే చేస్తాము అనే నమ్మకం మన తెలుగువారిది. అందుచేతనే ఉగాదినాడు సత్ప్రవర్తనతో మెలగడం, విద్యార్జనలో బుద్ధి నిలపడం, పెద్దలపట్ల వినయవిధేయతలతో మెలగడం చేస్తారు.

ఉగాదిరోజున అభ్యంగనస్నానం ఆచరించి, నూతన వస్త్రాలు ధరించి, ఉగాదిపచ్చడి తినడం తెలుగువారిఆచారం. ఈ ఉగాది పచ్చడి షడ్రుచులతో తయారు చేయబడుతుంది. ఈ పచ్చడి జీవితం షడ్రసోపేతమైన భోజనం వంటిదని, సుఖదుఃఖాలను సమభావంతో స్వీకరించి, బ్రతుకును ఆనందమయం చేసుకోవాలనే సందేశాన్ని అందిస్తోంది.

చాంద్రమానాన్ని అనుసరించేవారికి నూతనసంవత్సరం చైత్రశుద్ధపాడ్యమితో ప్రారంభమౌతుంది. వసంతాగమనంతో చెట్లు. పుష్పించి, నయనానందకరంగా ఉంటాయి. లేతమావిచిగురులు మేసిన కోయిలలు కుహూకుహూరావాలతో వీనులవిందు చేస్తాయి.

ఆ సమయంలో నూతనంగా విరిసిన నింబపుష్పాలు, క్రొత్తగా వచ్చిన చింతపండు, అప్పుడే పుష్ప దశనుండి పిందె దశకు చేరిన మామిడిపిందెలు, నూతనసంవత్సరఆరంభానికి ప్రతీకలుగా నిలిచి, ఉగాదిపచ్చడి రూపుదాల్చి భావికాలంలో అవి ఏవిధంగా అభివృద్ధి చెందుతాయో, వాటిని ఆరగించిన వారి జీవితాలుకూడా అలాగే అభివృద్ధిపథంలో సాగిపోవాలనే సందేశాన్ని అందిస్తాయి.

ఉగాదినాడు తప్పనిసరిగా ఆచరించవలసిన అతిముఖ్యమైన పని పంచాంగ శ్రవణం. ఈ పంచాంగంలో ఆ సంవత్సరం



సంక్రాంతిపురుషలక్షణాలు, భావికాలంలో కలిగే వర్షపాతాలు, ధరవరులు మొదలైన అనేకఉపయుక్తవిషయాలు వివరించబడటమే కాకుండా– సుముహూర్త నిర్ణయాలు, వ్యక్తిగతంగా ఆయా నక్షత్రజాతకులకు కలిగే భావిపరిణామాలు అన్నీ వివరించబడతాయి.

దీనివల్ల భావికాలంలో ఏర్పడబోయే అనర్థాలను తొలగించుకోవడానికి కావలసిన ముందుజాగ్రత్త చర్యలను చేపట్టి, వాటిని కొంతవరకైనా నివారించుకోవడానికి అవకాశం కలుగుతుంది. భావికార్యప్రణాళికకు కూడా ఈ పంచాంగం ఎంతగానో సహకరిస్తుంది. అందుచేతనే ఉగాదినాడు తప్పని సరిగా పంచాంగశ్రవణం చేయాలి అనే ఆచారం ఏర్పడింది.

'సర్వేజనా స్సుఖినో భవంతు'.

## తిరుమలలో భక్తులు...

**తిరుమల మాడవీధులలో భక్తులు పాదరక్షలు వేసుకొని తిరుగరాదు.**

**ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మాస్క్ ధరించవలెను.**

**మీ చుట్టు ప్రక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవలెను.**

**ప్రతి ఒక్కరూ సామాజికదూరం తప్పక పాటించవలెను.**

# ఇలవైకుంఠపురి ఒంటిమిట్ట ఏకశిలాపురి

- విద్వాన్ కట్టా నరసింహులు,
94413 37542

పూర్వం కాశినుంచి రామేశ్వరానికి, రామేశ్వరం నుంచి కాశికి వెళ్లే మార్గం ఇది. కృతయుగంలో జాంబవంతుడు వందసంవత్సరాలు రామతారకజపం చేసిన శైలం ఇక్కడే ఉంది. మృకండుమహాముని నిరంతరంగా హోమాలు నిర్వహించిన ఆశ్రమం సమీపంలోనే ఉంది. కలియుగ శ్రీవేంకటేశ్వరుడు కొలువైన అగ్రభాగం నుంచి మల్లి కార్జునుడు వెలసిన చివరివరకు విస్తరించిన 'శేషాచలంకొండలు' ఇక్కడ దర్శనమిస్తాయి. పదునాలుగేండ్లు అరణ్యవాసం చేసిన శ్రీరామచంద్రుడు సీతమ్మతో, తమ్ముడు లక్ష్మణునితో ఇక్కడే కొంతకాలం ఓ మిట్టపై గడిపాడు. ఇంతటిపురాణపరిమళాన్ని నింపుకొన్న ఈ పవిత్రప్రాంతంలోనే ఏకశిలానగరం పేరుతో రామాలయం భక్తులకు పరమపదమైన వైకుంఠధామంగా ఒంటి మిట్ట కనువిందు చేస్తూ ఉంది.

ప్రతి చైత్రమాసం శుద్ధనవమినుంచి పూర్ణిమ తర్వాత కూడా శ్రీరామబ్రహ్మోత్సవాలు పరవశింపజేస్తాయి. ఈ ఆల యాన్ని ఇంతవరకు చూడనివారికి తహతహ, ఒకసారి చూచినవారికి మళ్లీ చూడాలనే కుతూహలం, ఎన్నిమార్లు దర్శించినా తనివి తీరని పరమానందం కలుగుతుంది.

తిరుపతినుంచి కడపకు వేళ్లేమార్గంలో రాజంపేట-కడపల మధ్య రహదారికి ప్రక్కనే ఈ కోదండరాముని ఆలయం దర్శనమిస్తుంది. బస్సులో వెళుతున్నా, రైలులో ప్రయాణిస్తున్నా, ఆలయగోపురశిఖరాలు మనగుండెల్ని తట్టి లేపుతాయి. చేతుల్ని జోడింపచేస్తాయి.

ఈ కోదండరామాలయంలో స్వామి తూర్పుముఖంగా ఉంటాడు. ఆయనకిరువైపులా సీతాలక్ష్మణులుంటారు, గర్భా లయం ఎదుట నిల్చి వారిని దర్శించుకుంటాం. గర్భాలయా నికి ముందు ముఖమండపం, ఈ ముఖమండపానికి ముందు రంగమంటపం ఉంది. రంగమంటపం పెద్ద పెద్ద 32 స్తంభాలతో, అపూర్వమైనశిల్పసౌందర్యంతో విరాజిల్లుతూ ఉంటుంది. ఈ ప్రధానఆలయంచుట్టూ కోటగోడలాంటి మహాప్రాకారం మధ్య విశాలమైన ప్రాంగణం ఉంది. పడమట తప్ప మూడువైపుల ప్రాకారం మీదుగా మూడుగోపురాలు చూచేవారిని ఆకట్టుకుంటాయి. తూర్పుగోపురం మిగతా రెంటికంటె ఎత్తైనది. ఉత్తరద్వారంలో శ్రీవైకుంఠఏకాదశినాడు కొలువుదీరి, స్వామి భక్తులకు దర్శనమిస్తాడు. తూర్పుగోపురం కిందుగా ఉండే మహాద్వారం నుంచి ఆలయం లోపలికి భక్తులు ప్రవేశిస్తారు. ధ్వజస్తంభం ఎదురుగా కనిపిస్తుంది. ఆగ్నేయ మూల ప్రసాదశాల, నైరృతిమూల ఒకప్పటి కల్యాణమంటపం, వాయవ్యఈశాన్యదిశల్లో రెండు ఎదుర్కోలు మంటపాలు చూస్తూ, భక్తులు ఆలయప్రదక్షిణ చేస్తారు. ఉత్తరద్వార సమీపంలో 1960 ప్రాంతంలో ప్రతిష్ఠించిన రామలింగేశ్వరుని దర్శనం చేస్తారు. మూడు గాలిగోపురాల కిందుగా గోడలమీది శిల్పాలు 'పౌరాణిక చారిత్రక' సాంస్కృతిక విశేషాలు తెలియ జేస్తాయి.

ఆలయం బయటిసోపానాల సమీపంలో భవనాశి ఓబన్న మంటపం ఉంది. రెండు శతాబ్దాల క్రితంనాటి భక్తుడు ఈయన. బ్రహ్మోత్సవాలలో గరుడసేవనాడు స్వామిసోపానాలు దిగి వస్తుండగా ఓబన్న పేరు మీద హారతి ఇస్తారు, సోపానా లకు దక్షిణంవైపు సిద్ధవటంసీమకు సుబేదారుగా ఉన్న ఇమాంబేగ్ బావి త్రవ్వించాడు. ఆ బావిని ఇమాంబేగ్ బావి అని పిలుస్తారు.




రామాలయానికి ఎదురుగా సంజీవరాయస్వామి గుడి ఉంది. సంజీవ రాయడంటే ఆంజనేయస్వామి. లక్ష్మణ స్వామికోసం, వానరసైన్యాన్ని బ్రతి కించడంకోసం, హనుమ సంజీవని తెచ్చాడు కదా! అప్పటి నుంచి హనుమం తుని 'సంజీవరాయడు' అని పిలుస్తారు.

నేను రామునిబంటును. బంటు ఇంటి బయట కొలువుంటాడు. వైకుంఠ మందిరం రామయ్యదే!

వైకుంఠానికి ఎదురుగా ఉండి, ఆయన భజన చేసుకుంటాను అని హనుమ సంజీవరాయడుగా ఇక్కడ కొలువుదీరి ఉన్నాడు. రామయ్య భక్తు లకు మిత్రుడుగా, తన భక్తులకు ఆప్తుడుగా, వారి వారి కోరికలు తీరుస్తూ ఉంటాడు.


సంజీవరాయని కోవెల ఆను కొని శ్రీరామచంద్రుని రథం కనిపి స్తుంది. రథశాలలో కొలువైయున్న ఈ తేరు బ్రహ్మోత్సవాలలో సీతారాముల కల్యాణం అయిన తర్వాత ఉదయం ఊరేగుతుంది.

ఆలయానికి దక్షిణంవైపున శృంగిశైలం కనిపిస్తుంది. ఒంటి మిట్ట ఆలయానికి ఇక్కడే నాంది జరిగింది. కృతయుగంలో జాంబ వంతుడిక్కడ తపస్సు చేశాడు. ఎదురుగా ఉన్న మరో మిట్ట మీది నుంచి శ్రీరామచంద్రుని దివ్య దర్శనం అయింది. శ్రీరామ చంద్రుడు అరణ్యవాస సమయంలో



జాంబవంతునికి దర్శనమిచ్చిన చోట కొంతకాలం కాపురం చేశాడు. సీతమ్మను వెతి కేందుకు వెళుతూ జాంబవంతుడు మరోమారు ఇక్కడికి వచ్చి, ఒక శిలారూపంలో రాముణ్ణి దర్శించుకొన్నాడు. ఈ ప్రదేశంలోనే విజయనగరచక్రవర్తి బుక్కరాయలు ఆలయాన్ని నిర్మించాడు. ఈ ప్రతిష్ఠను జాంబవత్ప్రతిష్ఠ అంటారు. ఇరవయ్యో శతాబ్దం తొలిపాదంలో ఆంధ్రవాల్మీకి వావిలికొలను సుబ్బారావు ఈ ఆలయానికి వైభవాన్ని తీసుకువచ్చాడు. ఆయన నిర్మించుకొన్న ధ్యానమందిరం శృంగిశైలం మీద ఉంది. ఆయనజయంతి కొండమీద జరుగుతుంది.

ఈ శృంగిశైలానికి దక్షిణంగా ఒంటిమిట్ట చెరువుకట్ట కిందుగా రామతీర్థం కనిపిస్తుంది. సీతమ్మకు దప్పిక తీర్చడానికి బాణం వేసి, పాతాళగంగను తెప్పించిన తావు ఇది. అప్పుడు పుట్టిన బుగ్గ ఆలయం నిర్మించిన అనంతరం రామతీర్థంగా మారింది. ఒంటడు, మిట్టడు అనే బోయనాయకులు ఈ బుగ్గ నీరు తాగుతూ ఈ అడవులమీద పెత్తనం చేసేవారు. ఉదయగిరి పాలకుడు కంప రాయలు ఈ ప్రాంతాన్ని దర్శించినపుడు ఈ బోయల కోరిక మీద



ఆలయం చెరువు నిర్మించేందుకు అంగీకరించాడు. ఆ బాధ్యత ఈ ఒంటడు, మిట్టడులకే అప్పగించాడు. చెరువును, ఆలయాన్ని, ఇక్కడ నిర్మించిన గుడిని ఆ ఇద్దరిపేరుమీద పిలుస్తారు.

## తి.తి.దే. చేపట్టిన అభివృద్ధి

ఆంధ్రప్రదేశ్ నుండి తెలంగాణా విడిపోయాక ఒంటిమిట్ట ఆలయం దశమారింది. అంతకు మునుపు భద్రాచలానికి ఉన్న గౌరవం ఒంటిమిట్టకు దక్కింది. అప్పటినుండి రాష్ట్ర ప్రభుత్వలాంఛనాలు ఒంటిమిట్ట రాముడు అందుకొంటున్నాడు. తిరుమల తిరుపతి దేవస్థానాలవారు ఒంటిమిట్ట ఆలయ అభివృద్ధిపథంలో ఒక్కొక్క మార్పు తెస్తున్నారు.

బ్రహ్మోత్సవాలకాలంలో నిర్వహించే సీతారామకల్యాణం ఆలయానికి పడమట ఒక కిలోమీటరు దూరంలో నిర్వహిస్తారు.



లక్షకు పైగా భక్తులు కనులారా చూచే భాగ్యం కల్పించారు. కల్యాణవేదిక కట్టుదిట్టంగా నిర్మించారు.



ఆలయానికి తూర్పుగా వాస్తుకు అనుకూలంగా పుష్కరిణి నిర్మించారు. ఈ పుష్కరిణి తెప్పోత్సవంకోసం నిర్దేశించారు. ఆలయానికి చుట్టూ మాడవీథులు నిర్మించారు.



ఆలయానికి దక్షిణంగా ఆధునికపద్ధతుల్లో... ఉద్యానవనం నిర్మించారు. ఈ వనాన్ని చూడవచ్చిన భక్తులకు ఆహ్లాదం కలిగించే రీతిలో నామవనం, రాశివనం, నక్షత్ర వనం పెంచారు.

ఒంటిమిట్టను తరతరాలుగా పీడించేది నీటియెద్దడి, గొప్పచెరువున్నా, ఎప్పుడో నిండేది. పెన్నానదిలోని నీటిని మోటర్లద్వారా తెచ్చి, చెరువులోకి వదిలారు. ఒంటిమిట్ట చెరువులో ఎల్లప్పటికి నీరు ఉండడంవల్ల యాత్రికులకు, ప్రాంతీయులకు సౌకర్యంగా ఉంది.

ఆలయంలోపలివైపు ప్రాంగణంలో పాతనాపరాయి తొలగించి, గ్రానైటు రాయి పరిచారు. క్యూలైను నిర్మించారు. విద్యుత్ సౌకర్యాన్ని మెరుగుపరిచారు. యాత్రికుల సందర్శనం నిత్యం పెరుగుతూ వస్తున్నది. ఏ కొరత లేకుండా నిత్యోత్సవ, పక్షోత్సవ, మాసోత్సవాలు బ్రహ్మోత్సవాలు జరుగుతూ ఉన్నాయి.

తాళ్లపాక అన్నమాచార్యులు ఆ రోజుల్లో ఈ ఆలయాన్ని సందర్శించి, 'ఇందులోనే కానవద్దా ఇతడు దైవమని' అని కీర్తించాడు. ఆ పాట ఫలవంతమై, శ్రీవేంకటేశ్వరునిప్రసాదం ప్రతిశనివారం భక్తులకు అందుతూ ఉంది.

అన్నమయ్య వేంకటరామా! అని కీర్తించినట్లు ఆ వేంకటేశ్వరుడు ఈ రాముడు వేరు వేరు కాదు– ఇరువురూ ఒక్కరే!

జాంబవంతుని తపస్సుతో బీజం పడి, శ్రీరాముని అరణ్యవాసంతో మొలకెత్తి, విజయనగరచక్రవర్తులతో మహావృక్షమై, నేడు తిరుమల తిరుపతి దేవస్థానాల సౌజన్యంతో అత్యంత వైభవోపేతంగా అలరారుతున్న కోదండరాముని ఏకశిలాపురి– ఇల వైకుంఠపురిగా భక్తుల గుండెల్లో కొలువుదీరి ఉంది.

*రండి, దర్శించండి, తరించండి.*

# మత్స్యమూర్తిం భజే!

- శ్రీమతి యడవల్లి మృదుల లక్ష్మి

శ్రీమహావిష్ణువు ధర్మరక్షణ కోసం ధరించిన దశావతారాల్లో మొట్టమొదటిది మత్స్యావతారం. సృష్టి పరిణామ క్రమంలో మత్స్యావతారాన్ని జలావిర్భావానికి సంకేతంగా చెబుతారు.

మత్స్యావతారానికి సంబంధించిన వరాహకల్పంలో జరిగిన ఓ గాథ మనకు పురాణాల్లో కన్పిస్తుంది. మహాప్రళయకాలంలో లోకాలన్నీ నశించి ఏకార్ణవమవుతాయి. దాన్నే నైమిత్తిక ప్రళయం అంటారు. వేయి మహాయుగాలు బ్రహ్మకు ఒక పగలు. రాత్రి కాలం కూడా అంతే. పగలు గడవగానే బ్రహ్మ నిద్రకు



ఉపక్రమిస్తాడు. నిద్రలేచిన తర్వాత బ్రహ్మ యథాపూర్వం సృష్టిని కల్పిస్తాడు. దీనికి 'కల్పం' అని పేరు.

వరాహకల్పంలో సత్యవ్రతుడనే రాజు (తర్వాతి కాలంలో ఇతడే వైవస్వతమనువుగా ప్రసిద్ధి పొందుతాడు) 'కృతమాలికా' నదీతీరంలో పితృదేవతలకు జలతర్పణం చేస్తుండగా ఒక చేప పిల్ల అతడి దోసిట్లో పడింది.

అతడు కరుణించి, ఆ చేపపిల్లను తన కమండలంలో వేశాడు. మరునాటికి ఆ చేప పిల్ల పెద్దదై తనకు కమండలం సరిపోలేదంది. మనువు దాన్ని తీసి ఒక చెరువులో విడిచాడు. ఆ చెరువుకూడా దానికి సరిపోలేదు. చేప రోజురోజుకూ పెద్దదైపోతుంటే రాజు దాన్ని సముద్రంలో విడిచాడు. మత్స్యం మరుక్షణంలోనే రెండులక్షల యోజనాల ప్రమాణానికి పెరిగి పోయింది.

మనువు సంభ్రమాశ్చర్యాలకులోనై 'స్వామీ, నీవెవరు?' అని అడిగాడు. అప్పుడు ఆ మీనం... 'రాజా! నేను శ్రీమన్నారాయణుడిని. ఏడురోజుల్లో ప్రళయం రానున్నది. సకల జీవకోటి నశిస్తుంది. ఇప్పుడు చాక్షుష మన్వంతరం నడుస్తున్నది. కాబట్టి వేదాలు, విద్యలు, బీజాలు, నేను, బ్రహ్మదేవుడు నీ రక్షణ పొందవలసి ఉంది. ఇక్కడ సప్తఋషులతో కూడిన ఓ నావ ఉంటుంది. నీటిమీద తేలుతూ అనంతుడనే సర్పం ఇక్కడికి చేరుతుంది. దాన్ని తాడు చేసి, ఆ నావను నా కొమ్ముకు కట్టివెయ్యి. నేను మిమ్మల్ని కాపాడతాను' అని చెబుతాడు.

అనంతరం సత్యవ్రతుడు ఆ మహామీనాన్ని విష్ణు స్వరూపంగా అనేకవిధాలుగా స్తోత్రం చేస్తాడు.

సత్యవ్రతుడు చేసిన స్తుతికి సంతోషించిన మత్స్యస్వరూపుడైన మహావిష్ణువు అతడికి సాంఖ్యక్రియాయోగాన్ని ఉపదేశించి, అంతర్ధానం చెందుతాడు.

**మత్స్యావతారం జలావిర్భావానికి సంకేతం**



## మహిమాన్వితం... మత్స్యయంత్రం

అథర్వణవేదంలో మత్స్యయంత్రం గురించిన వివరణ ఉంది. ఇది అత్యంతప్రభావాన్ని కలిగిన యంత్రరాజం. మహావిష్ణుస్వరూపం. మయబ్రహ్మ దీన్ని నిర్మించాడని పురాణాలు చెబుతున్నాయి. అన్నిరకాల వాస్తుదోషాలను నివారించే శక్తి ఈ యంత్రానికి ఉంది. అందుకే నూతనంగా చేసిన ఏ నిర్మాణంలో అయినా మత్స్యయంత్రాన్ని ప్రతిష్ఠ చేస్తారు. మత్స్యయంత్రాన్ని ఉంచిన స్థలంలో ఉండే వాస్తు దోషాలన్నీ యంత్రప్రభావంవల్ల తొలగిపోతాయి.

ముఖ్యంగా శల్యదోషాలనివారణకు మత్స్యయంత్రాన్ని వాస్తునిపుణులు సూచిస్తారు. మనం నివసించే ఇంటి భూమి క్రిందిభాగంలో అనేకరకాలైన అవాంఛనీయ వస్తువులు (పుర్రెలు, ఎముకలు వగైరా) దాగుండే అవకాశం ఉంది. ఇవి ఎవరూ కావాలని పెట్టేవి కావు. మనం గుర్తించటం కూడా అన్ని సందర్భాల్లో సాధ్యం కాదు. ఇటువంటి వస్తువులు ఉన్నస్థలంలో నిర్మాణం చేసి, అందులో నివాసం ఉంటే అనేకఇబ్బందులు కలుగుతాయని వాస్తుశాస్త్రం చెబుతోంది. ఈ దోషాలనివారణకు మత్స్యయంత్రాన్ని తప్పనిసరిగా ప్రతిష్ఠించాలి.

మహామీనమూర్తి ఉపదేశించినట్లు సత్యవ్రతుడు ఓషధులన్నీ తీసుకుని నావను చేరుకుంటాడు. అంతా సురక్షితులైన తర్వాత మత్స్యం అంతర్ధానమౌతుంది. ఈ మత్స్యమే అవతారమూర్తిగా లోకాలచేత పూజలందుకుంటున్న మత్స్యావతారమూర్తి. శ్రీమహావిష్ణువు తొలిఅవతారం కూడా!

దక్షిణావర్తశంఖవత్తాంతం కూడా ఈ మత్స్యావతార గాథతో ముడివడి ఉంది. మత్స్యరూపుడైన విష్ణువు సోమకాసురుడి కడుపు చీల్చి, వేదాలను వెలుపలికి తీస్తున్న తరుణంలో పవిత్రమైన దక్షిణావర్తశంఖం వెలువడింది. స్వామి శంఖాన్ని తాను తీసుకుని, బ్రహ్మకు వేదాలు అప్పగించాడు. తమస్సు నుంచి వేదాలు వెలుగులోకి రావడంతో బ్రహ్మ సృష్టికార్యానికి కలిగిన ప్రతిబంధకం తొలగిపోయింది. చైత్రశుక్లతదియతిథి మత్స్యావతార ఆవిర్భావంగా పురాణాలు పేర్కొన్నాయి. వేదాలను అపహరించటం విజ్ఞానప్రకాశాన్ని, తమోగుణాహంకారశక్తిని తనలో లయం చెయ్యటానికి సంకేతంగా నిలుస్తుంది.

రాక్షస సంహారం జరిగిన వెంటనే చతుర్ముఖుని సృష్టికార్య ప్రతిబంధకరూపమైన నిద్రారూపతమస్సు అంతరిస్తుంది. బ్రహ్మ సహజమైన స్వరూపజ్ఞానం పొందడమే వేదాలు మరల గ్రహించటంలో ఉన్నతత్వార్థం!


పరబ్రహ్మ చైతన్యాత్మ సర్వవ్యాపకమనీ, విశ్వంలో కనిపించే తేజమే పరమాత్మస్ఫురణమనీ గ్రహించిన ముముక్షువులు నివృత్తిరూపంలో ఉండే మోక్షపదం పొందుతారని మత్స్యావతార గాథ సూచిస్తుంది. పరమాత్మవల్ల సంప్రాప్తించిన ఆ వేదాలు మానవకోటి ఆధ్యాత్మికమహాభ్యుదయానికి వరప్రసాదాలుగా నిలిచాయి.

సమాజంలో దైవభక్తిని ప్రబోధించే పవిత్రకేంద్రాలు పుణ్యక్షేత్రాలు. ఆయా పుణ్యక్షేత్రాల విశిష్టత- అందలి దేవతామూర్తుల మహిమావిశేషాలతో కూడిన వాటి ప్రాచీనచరిత్రవల్లనే లోకానికి విశదంగా వెల్లడౌతూవుంటుంది. సుప్రసిద్ధ పుణ్యక్షేత్రాల పుట్టుపూర్వోత్తరాలను వివరించే అలాంటి చారిత్రక గ్రంథాలను స్థలపురాణాలు, మాహాత్మ్యాలు, ఇత్యాదిగా వ్యవహరిస్తూ ఉంటారు. వీటిల్లో కొన్ని సంస్కృతంలోను, మరికొన్ని ప్రాంతీయభాషల్లోను రచింపబడి ఉన్నాయి.

విశ్వవిఖ్యాతి గాంచిన తిరుమల పుణ్యక్షేత్రంయొక్క పూర్వకాలీనవృత్తాంతాన్ని వివరించే రచనల్లో మిగుల విశిష్టమైంది "తిరుమలై ఒళుగు". ఇది తమిళభాషలో వ్రాయబడింది. "ఒళుగు" అనే తమిళపదానికి 'ఐతిహ్యమాల', 'కడచి పోయిన గాథల సముదాయము' అనే అర్థాలను విద్వాంసులు విశదీకరించియున్నారు.

ఇందులో శ్రీమద్రామానుజాచార్యులవారికాలం (క్రీ.శ. 12వ శతాబ్ది) నుండి సదాశివరాయల కాలం (క్రీ.శ.16వ శతాబ్ది) వరకు నడచిన కొన్ని ముఖ్యసంఘటనలు, తిరుమల దేవాలయంలో కొనసాగే కొన్ని ప్రత్యేకసంప్రదాయాలు, ఆచారాలు మొదలైనవి ఆసక్తికరంగా వివరింపబడి ఉన్నాయి. ఈ "తిరుమలై ఒళుగు" తమిళగ్రంథం చాలాయేళ్ల క్రితమే తి.తి.దేవస్థానంవారిచే ప్రకటితమైంది.

బహుభాషాకోవిదులు, విద్వత్ శిరోమణులు అయిన శ్రీమాన్ ఎన్.సి.వి.నరసింహాచార్యులవారు, శ్రీమాన్ టి.ఏ. కృష్ణమాచార్యులవారు ఈ ఇరువురు విద్యావేత్తలు ఈ తమిళగ్రంథాన్ని "తిరుమల సమయాచారములు" - అనే పేరుతో సరళమైన శైలిలో స్వతంత్రరచనవలె తమిళమూలానికి దీటుగా అనువదించియున్నారు. తిరుమల తిరుపతి పుణ్యక్షేత్రానికి సంబంధించిన అపూర్వసంప్రదాయాలను ఆచారవిశేషాలను తెలిసికొనగోరుతూ ఉన్న వారందరికీ ఈ ధారావాహిక ఆనందదాయకం కాగలదని ఆశిస్తున్నాం.




శ్రీరంగాది దివ్యక్షేత్రములందు ఆయా ఆగమసిద్ధములును, ఆయా దివ్యక్షేత్రమాహాత్మ్యసిద్ధములును, భగవదనుగ్రహమూలములును అగునట్లు ఏర్పడిన భగవద్ధర్మమును ఉద్ధరించుటకై అనుగ్రహింపబడినదియు శ్రీభగవద్రామానుజాచార్యుల ఆమోదము పొందినట్టియునగు–

## తిరుమల తిరుపతి ఐతిహ్యామాల

శ్రీవేంకటేశ్వరస్వామి, కలియుగారంభమునందు తనను ఆశ్రయించిన తొండమాన్‌చక్రవర్తికి కలిగినట్టి యాపదను తొలగించుటకై శంఖచక్రములను ప్రసాదించినకాలము మొదలుకొని శ్రీరామానుజాచార్యులవారు శ్రీరంగదివ్యక్షేత్రమున 'శ్రీవిష్ణుపరతత్త్వప్రతిష్ఠాపనాచార్యులై' విజయము చేసి ఉండు కాలమున కొన్నాళ్లపాటు తమ శ్రీహస్తములందు శ్రీశంఖచక్రములు లేకయే ఉండెను. అప్పుడు దేవాలయమునందున్న వైఖానసులు శ్రీవేంకటేశ్వరస్వామి దివ్యమూర్తికి ఉచితోపచారములు చేయక అధర్మకృత్యములు సలుపుచుండగా ఆ దేశాధిపతి ఇది చూచి వారిని తీవ్రదండనకు గురిచేసినందునను, ఆ స్థలమున పెద్దలగు శ్రీవైష్ణవులు లేకుండుటవలనను ఆ కాలమున

కొందరు శైవులు ఆ దేశాధిపతి ఆస్థానమున కరిగి – “తమ వేల్పగు కుమారస్వామి ఈ కొండకు వచ్చి, తపము చేయుచున్నారని వామనపురాణమునందలి శ్రీవేంకటాచలమాహాత్మ్యపరమగు మూడవఅధ్యాయమున నున్నందున ఇక్కడ కోనేటిగట్టున నున్నట్టి దేవుడు కుమారస్వామి తపసు సలుపుచున్నందున ఆయనకు ఆయుధములగు పాశాంకుశాదులు లేవనియు, ‘స్వామి’ అనెడు సుబ్రహ్మణ్యస్వామి పేరునుబట్టి ఈ తీర్థమునకు ‘స్వామిపుష్కరిణి’ అనెడి పేరు ఏర్పడినదనియు, కనుక ఈ పర్వతము శైవక్షేత్రమేయనియు మధ్యకాలమున కొందరు శ్రీవైష్ణవులు రాజవాల్లభ్యము సంపాదించి, విష్ణువిగ్రహము చేయించి తెచ్చి గుడిలోపెట్టి ఉత్సవాదులు జరుపుచున్నారు” అని చెప్పుచు వామనపురాణవచనములకు పురాణాంతరములతోడి ఏకార్థత తెలిపెడు పూర్వోత్తరసందర్భపర్యాలోచన చేయక పైపైన తోచుచున్నట్టి అర్థమును తెలుపుచుండిరి.

అప్పుడు దేశాధిపతి వీరి వాదమును, పెరవారి వాదమును విని, విచారణ చేసెను. ‘నేటివరకు ఈ పర్వతము విష్ణుక్షేత్రమనియు, ఈ కొండపై నిత్యనివాసము చేసెడి స్వామి విష్ణువనియు, ఈ తీర్థము విష్ణుతీర్థమనియు ప్రసిద్ధమైయుండ శ్రీవైష్ణవులే ఈ దేవునకు పూజామహోత్సవాదులు జరుపుచున్నారు గదా! ఇప్పుడు శైవజనులిట్లు పలుకుచున్నారే’ అనియు యోచించుచుండెను. అప్పుడు ఆ స్థలమందు పెద్దలగు శ్రీవైష్ణవులు లేకుండుటచేత, ఉన్నవారు కొందరు రాజాస్థానానికి వెళ్లి, పురాణార్థములను వివరించి, విష్ణువని స్థాపింప నశక్తులైయుండిరి. అంతట శ్రీరంగమున విజయము చేసియున్న శ్రీభగవద్రామానుజుల సన్నిధానమునకు ఈ వృత్తాంతమును వ్రాసి పంపిరి. శ్రీరామానుజాచార్యులవారు ఈ సంగతి తెలిసి, వెనువెంటనే తిరుపతికి విజయముచేసిరి; దేశాధిపతిని దీవించి, అష్టాదశపురాణములయం దున్నట్టి వేంకటాచలమాహాత్మ్యబోధక వచనములను పూర్వోత్తరసందర్భవిరోధము లేకుండునట్లు ఏకవాక్యత పొసగులాగున ఉపన్యసించియు, ఆళ్వారుల శ్రీసూక్తులను శాస్త్రసమ్మతమగు శిష్టాచారమును, వచనానుష్ఠానములను ఉపన్యసించియు, కొండమీదిదేవుడు శ్రీమహావిష్ణువేయని నుడివిరి.

ఇదియంతయు వినిన రాజు ఇరుపక్షములవారును పేర్కొనిన పురాణవాక్యములను విని ఒక నిర్ణయమునకు రాలేక మధ్యస్థుడుగనే ఉండగ అప్పుడు భగవద్రామానుజులవారు రాజునుద్దేశించి –

“దర్శయన్ భక్తవాత్సల్యం యో దదౌ హస్తగే శుభే
శంఖచక్రే నృపేం ద్రాయ చక్రవర్తీతి యం విదుః
అత ఏవాఽరిశంఖాభ్యాం సంధృశ్యేతే వినా కరౌ.”

(ఎవ్వడు (శ్రీనివాసుడు) భక్తునియెడ వాత్సల్యము చూపుచు ‘చక్రవర్తి’ అని ప్రసిద్ధిగన్న రాజశ్రేష్ఠునకు (తొండమాన్ చక్రవర్తికి) తన కరములనున్న శుభకరములైన శంఖచక్రముల నిచ్చెనో....కావుననే హస్తములు శంఖచక్రరహితములై కనిపించుచున్నవి.)

అని బ్రహ్మపురాణము ఏడవ అధ్యాయమున నున్నట్లే కలియుగాదియందున్నస్వామి తనభక్తుడగు తొండమాన్ చక్రవర్తికి శత్రుసంహారార్థమై శంఖచక్రముల నొసగెనని ఆరంభించి, కావుననే శంఖచక్రములు లేక ఉన్నారని పురాణార్థములు నిరూపించి చెప్పినను రాజుకు అందునిర్ణయ మేర్పడలేదు. అప్పుడు భగవద్రామానుజులవారు ప్రత్యక్షముగనే నిశ్చయ మేర్పడుటకై ఒకసంగతి చెప్పెదనని రాజుతో ఇట్లనిరి– “నేను శ్రీమహావిష్ణు వని పలికితిని. శైవులు సుబ్రహ్మణ్యస్వామి అని చెప్పినారు. ఈ సందేహము తీర్చుటకై నేను విష్ణుమూర్తికి అసాధారణములైన శంఖచక్రములు చేయించికొని వచ్చి, స్వామి సన్నిధిలో ఉంచెదను. శైవులు సుబ్రహ్మణ్యస్వామికి అసాధారణములైన పాశాంకుశాదులు చేయించి పెట్టవలెను. స్వామి ఏ ఆయుధములు గైకొని, ధరించునో ఆ యా ఆయుధధారియైన దేవతగా ఈ దేవుని నిర్ణయింపవలెను.”

ఇది విని రాజు ‘అట్లే చేయుడు’ అనగ, ఇరుపక్షముల వాదులును ఆ యా ఆయుధములు చేయించుకొని, రాజును కూడ వెంట నిడుకొని, తిరుమలకు వచ్చి రాత్రివేళ స్వామి గర్భగుడిలో వానినిబెట్టి రాజముద్రను వేయించి, పిదప ప్రాతఃకాలమున తలుపులు తెరచిచూచినపుడు భగవంతుడు శంఖచక్రములు ధరించియుండెను. అది గాంచిన ప్రభుడు సంతుష్టుడై శ్రీభగవద్రామానుజుల పాదపద్మములందు భక్తిప్రపత్తులు గలవాడాయెను. వీరు చెప్పిన చొప్పున శైవులను వారి అసత్యవాదమునకు తగినట్లుగ నిగ్రహించి, దేశమునుండి బహిష్కరించి, శ్రీరామానుజాచార్యుల దివ్యచరణము లాశ్రయించి కృతార్థుడైనాడు.

*(ఇంకా ఉంది)*



శాంతము లేక సౌఖ్యము లేదు

భారతీయసంస్కృతి కేవలం భారతదేశానికి మాత్రమే పరిమితంకాక అది సమస్త విశ్వానికి వర్తిస్తుంది. భారతీయ సంస్కృతికి ప్రధానగ్రంథాలు రెండు. అవి మహత్తమమైనవి. మొదటిది శ్రీమద్రామాయణం. రెండవది మహాభారతం.

భారతాన్ని కేవలం ఇతిహాసంగానే కాక సమస్త విజ్ఞానానికి నిధిగా రచించాడు వ్యాసుడు. అందులో ధర్మసూక్ష్మాలు కోకొల్లలు. చారిత్రకాంశాలు, వర్ణనలు ఎన్నెన్నో! శాస్త్ర విషయాలు, వేదాంతవిషయాలు చాలాఉన్నాయి. వ్యాసమహర్షి ప్రతిజ్ఞ చేశాడు. "*ఈ గ్రంథంలో ఉన్నదే ప్రపంచంలో ఎక్కడైనా ఉంటుందని, ఇక్కడ లేనిది ఎక్కడా ఉండద*"ని భూత, భవిష్యద్వర్త మానాలు దర్శించగల దివ్యనేత్రం గల వ్యాసమహర్షికే చెల్లింది ఇలాంటి ప్రతిజ్ఞ చేయడం. అన్ని కాలాలలో అందరికీ మార్గదర్శకం మహాభారతం.

అయితే, మహాభారతంలో వైజ్ఞానికాంశాలు గూడా చాలా ఉన్నాయి. ఆధునికసమాజంలో దినదినాభివృద్ధి చెందుతున్న విజ్ఞానశాస్త్ర విషయాలు వేల సంవత్సరాల క్రితం నాటి మహాభారతంలో కనిపించడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.

# నేటివన్నీ.. నాటి భారతంలోనే..

- డా॥ నిష్ఠల సుబ్రహ్మణ్యశాస్త్రి

## తూర్పు మేఘాలే పాండవులు

మేఘాలు, వర్షాలకు సంబంధించిన ప్రకృతి విజ్ఞానం, ఆధునిక శాస్త్రవేత్తలు కనుగొన్న (టెస్ట్‌ట్యూబ్ బేబి) జీవనిర్మాణం విషయాలు, స్త్రీలు పురుషులుగా, పురుషులు స్త్రీలుగా ఆధునిక కాలంలో శరీరంలో పరిణామాలవల్ల మారడం, చెట్లు తీగలలో ప్రవహించే జీవశక్తిచర్యలు. యుద్ధాలలో వాడే క్షిపణులువంటి విషయాలు ఎన్నో ఉన్నాయి- భారతంలో.

ప్రకృతివిజ్ఞాన విషయాలను మనం పరిశీలిస్తే కౌరవ పాండవగాథద్వారా ఋతువులు, మేఘాల ప్రవృత్తి నిరూపింప బడింది. పాండవులు తెల్లగానున్న తూర్పుమేఘాలు. వీటికి అధిపతి దేవరాజు అయిన ఇంద్రుడు. ఖగోళంలో కనుపించే కన్యారాశి ద్రౌపది. అందుకే పెద్దలు "అహల్యా ద్రౌపదీ తారా సీతా మండోదరీ తథా" అంటూ కన్యలలో చేర్చారు ద్రౌపదిని. కన్యలో సూర్యుడు ప్రవేశించగానే తూర్పుమేఘాలు వస్తాయి. కన్య అనేపదంద్వారా కుంతిని గూడా గ్రహించవచ్చు. సూర్యానుగ్రహం వలననే కుంతికి కర్ణుడు జన్మించాడు. ఉత్తర నుండి విశాఖవరకు గల ఐదునక్షత్రాలు పాండవులకు, అనూ రాధనుండి కృత్తిక వరకు గల తారలు కౌరవులకు సంకేతాలు. కుంతికి కర్ణుడు జన్మించాడంటే కన్యలో రవిప్రవేశంవల్ల వర్షించడమే.

పాండవులు కౌరవులను జయించారు గదా! అంటే ఈశాన్యఋతుపవనాలద్వారా నైరృతిఋతుపవనాలు తిరోగ మనం పట్టడమే! అందుకే కౌరవులు పాండవులచే ఓడించ బడినారు.

కౌరవుల అక్షౌహిణీ సంఖ్య 11. పాండవుల అక్షౌహిణీ సంఖ్య 7. మొత్తము 18. అశ్వినినుండి పుబ్బవరకు గల తారలు 11. ఉత్తరనుండి జ్యేష్ఠ వరకు 7 మొత్తం 18. ఈ విధంగా నక్షత్రాలచేత, అక్షౌహిణీసంఖ్యచేత తూర్పు, పడమరగాలులు సూచింపబడ్డాయి. ఇలా ఆకాశంలో గల ప్రకృతిరహస్యాలు సూచింపబడ్డాయని చెబుతారు.

## గర్భవతులు మంచిమాటలే వినాలి!

చెట్లకు తీగలకు ప్రాణం ఉంటుందని భారతీయ విజ్ఞానశాస్త్రవేత్త జగదీశ్‌చంద్రబోస్ నిరూపించాడు. అయితే వృక్షాదులకు పంచేంద్రియాలశక్తి ఉంటుందని మహాభారతంలో సిద్ధాంతీకరించాడు వ్యాసమహర్షి. దీన్ని భౌతికంగా నిరూపిం చాడు బోసు.

ఉత్తరగర్భంలో ఉన్న అభిమన్యుడు అర్జునుడు చెబుతున్న పద్మవ్యూహంలో ప్రవేశించేవిధానం విన్నాడు. అది పెద్దయ్యాకకూడా గుర్తుంది. ఆ జ్ఞానంతో పద్మవ్యూహంలో ప్రవేశించగలిగాడు అభిమన్యుడు.

జీవిగర్భంలో ఉండగా జ్ఞాపకశక్తి, గ్రహణశక్తి ఉంటాయని ఆధునికులు నిరూపించిన విషయం. దీన్ని ముందే చెప్పాడు వ్యాసుడు. అందుకే మంచిమాటలు గర్భవతులు వినాలన్నారు మనప్రాచీనులు.

వేదవ్యాసుడు కేవలం ధర్మవిషయాలను కావ్యలక్షణోదాహరణాలనుమాత్రమే భారతంలో చెప్పలేదు. అన్ని వైజ్ఞానికాంశాలు, సిద్ధాంతాల్ని గూడా ప్రతిపాదించాడు.

## శాస్త్రవేత్తలకు ఈ శ్లోకమే స్ఫూర్తి!

రోబర్ట్ హోసర్ హీమర్ మహాశయుడు గొప్ప పరిశోధన చేసి, ప్రపంచంలో మొదటిసారిగా అణువిక్షేపాన్ని (ఆటమ్ బాంబ్) ప్రకటించాడు. అతడు 1945వ సంవత్సరంలో జులై 16వ తేదీనాడు అలమోగోట్టా ఎయిర్‌బేస్ అనే ప్రాంతంలో సభలో గీతాశ్లోకం చదివి, పరమేశ్వరునకు వేయిసూర్యుల కాంతి ఉందనే ఆ శ్లోకభావం చెప్పి, ఆ శ్లోకమే తనకు పరిశోధనలో స్ఫూర్తినిచ్చిందని చెప్పాడు. ఆ శ్లోకం మహాభారతంలోనే ఉంది.

"జాతస్య హి ధ్రువో మృత్యుః, ధ్రువం జన్మమృతస్య చ" అని గీతలో మృత్యుసిద్ధాంతం ప్రకటింపబడింది. ఈ విజ్ఞానవిషయాన్ని బ్రిటీష్ సింహాసనం ఎక్కిన ఛార్లెస్ ఒప్పుకున్నది.

దీర్ఘతమునిపాత్రద్వారా అనారోగ్యం గల ఆవుల చికిత్సావిధానమంతా నిరూపించాడు వ్యాసమహర్షి. అశ్వవిద్యలో నకులుడు నిపుణుడని వర్ణించేఘట్టంలో గుఱ్ఱాల చికిత్సా విధానాన్ని స్పష్టంగా చెప్పాడు. సహదేవుడు విరాటరాజును చేరి, ఎద్దుమూత్రాన్ని వాసనచూచిన ఆవు ఎలా దూడను ప్రసవిస్తుందో అలా నేను కూడా చేయగలనన్నాడు. ఇందువల్ల ఆ కాలంలోనే ఇలాంటి చికిత్స ఉండేదని తెలుస్తూంది.

చెట్లు, లతలకు కూడా వినడం, వాసనచూడడం మొదలైన ఇంద్రియవ్యాపారాలు, శక్తులు ఉన్నాయని నిరూపించాడు మహర్షి. చెట్లలో ఆకాశశక్తివల్ల పూలు పూయడం, పండ్లు ఏర్పడడం జరుగుతుంది. చెట్లఆకులు, తొక్కలు వాడిపోతుండటంవల్ల అగ్నిశక్తి ఉన్నదని తెలుస్తుంది. జీర్ణమౌతుండడంవల్ల స్పర్శ, మబ్బుల ఉరుములకు, పూలు, పండ్లు రాలుతుండుటవల్ల శ్రవణశక్తి అంగీకరింపబడుతోంది. దూరంగా ఉండే పూలతీవియలు చెట్టును చుట్టుకోడానికి పాకుతుండుటవల్ల చూపు, గంధద్రవ్యాలతో, పొగలతో చెట్ల రోగాలు తగ్గుతుండుటవల్ల వాసనచూచేశక్తి, నీటిని గ్రహించడంవల్ల ఆస్వాదించేశక్తి ఉందని తెలుస్తోంది.

## పాత్రలలో అండాల పోషణ

స్త్రీల అండాన్ని పురుషునిబీజాన్ని కలిపే ఫలదీకరణ పద్ధతి సఫలమై విదేశాలలో మెప్పు పొందింది. ఇది వైజ్ఞానికుల ప్రయోగం. ఇలాంటి వైజ్ఞానికప్రయోగం మహాభారతంలో వ్యాసునిచేత ద్వాపరయుగంలోనే నిరూపింపబడి, ఆశ్చర్యాన్ని కలిగిస్తూంది.

గర్భవతి అయిన గాంధారి చాలాకాలం అయినా ఇంకా సంతానం కలగలేదనే బాధతో తనగర్భాన్ని కొట్టుకుంది. ఆ గర్భం పగిలి, దానినుండి మాంసపు ముద్ద బయటకు వచ్చింది. వ్యాసుడది చూచి ఆ పిండాన్ని 101 భాగాలుగా చేసి, నేతితో నిండిన పాత్రలో పెట్టి ఆ పాత్రను నీటిమధ్యలో ఉంచాడు. దాని నుండి వందమంది కుమారులు, ఒక్క కుమార్తె జన్మించారు. ఈ పద్ధతినే ఆధునికులు 'టెస్ట్ ట్యూబ్ బేబి' అని చెప్పుతున్నారు.

ఈ ఆధునిక కాలంలో స్త్రీలు, పురుషులుగా పురుషులు స్త్రీలుగా వైద్యచికిత్సద్వారా మారుతున్నారు. ద్రుపదమహారాజుకు శివునివరంవల్ల కుమార్తె జన్మించింది. ఆమెకు పురుషుని వస్త్రాలు ధరింపజేసి పెంచారు. కాలం గడిచాక ఆమెను పురుషుడే అని భావించి, కొందరు పుత్రిక నిచ్చి వివాహం చేశారు. స్త్రీ అని తెలుసుకున్నాక అందరూ కుపితులయ్యారు. ఆ సమయంలో శిఖండిని అయిన ఈమె మరణమే తనకు శరణమని భావించి, అడవికి వెళ్ళింది.

ఇదంతా గమనించిన ఒక యక్షుడు దయామయుడై తన పుంస్త్వాన్ని ఆమె కిచ్చి, ఆమె స్త్రీత్వాన్ని తాను స్వీకరించాడు. ఈ గాథ 5000 సంవత్సరాల క్రిందటనే స్త్రీపురుషుల లింగ వ్యత్యయాత్మకమైన వైజ్ఞాని కాంశాన్ని సూచించడం ఆశ్చర్యాన్ని కలిగింపక మానదు.

ఋతుదినం మొదలుకొని 14వ రోజున స్త్రీలకు అండమేర్పడుతుందని వైద్యులు చెప్తున్నారు. ఇలాంటి విజ్ఞానవిషయం మహాభారతంలో వ్యాసునిచే ముందే చెప్ప బడింది. ఈ విషయమును పరిశీలిద్దాం!

పూర్వం వ్యుషితాశ్వుడనే రాజు ఉండేవాడు. అతడు సంతానం లేకనే మరణించాడు. భద్ర అనే ఆతనిపత్ని "నాథా! నాకు సంతానము నిమ్ము లేదా నేనుకూడా సహగమనం చేస్తాను" అని ఏడ్చింది. అప్పుడు ఆకాశవాణి "ఋతుశుద్ధి అయిననాటినుండి 14వ నాడు పరిశుద్ధురాలవై పాన్పుపై నిద్రించు. నిద్రించేముందు భర్తను స్మరించుకో! నీకు సంతానం కలుగుతుంద"ని తెలిపింది. భద్ర అట్లాచరించి సంతాన్ని పొందింది.

## నేటి క్షిపణులు నాటి భారతంలోనే...

ద్రోణాచార్యుడు పన్నిన పద్మవ్యూహంలో ప్రవేశించడం మాత్రమే తెలుసుకుని యుద్ధానికి వెళ్లాడు అభిమన్యుడు. అభిమన్యునికి సహాయంగా వచ్చిన ధర్మరాజాదులను శివుని వరంతో అడ్డగించాడు సైంధవుడు. కౌరవులంతా మాయజేసి అభిమన్యుణ్ణి చంపారు. అది తెలిసి మండిపడ్డ అర్జునుడు బాలుడని చూడక, మాయతో సంహరించిన సైంధవుణ్ణి మరు నాడు సూర్యాస్తమయంలోగా చంపుతా నని ప్రతినబూనాడు.

అలాగే, ఆ మరునాడు పాశుపతాస్త్రంతో సైంధవుని శిరస్సును ఖండించాడు అర్జునుడు. శిరస్సు భూమిపై పడ రాదనే శ్రీకృష్ణుని మాటతో అర్జునుడు పాశుపతాస్త్రంతో శ్యమంతక క్షేత్రంలో తపస్సు చేస్తున్నట్టి అర్ఘ్యమివ్వడానికి పూనుకున్న సైంధవుని తండ్రి దోసిలిలో శిరస్సును పడ గొట్టాడు. దోసిలిలో పడ్డ ఆ తలను నేలపై వదిలివేస్తూ వృద్ధక్షత్రుడు మరణించాడు.

నిజానికి కురుక్షేత్రంనుండి శ్యమంతపంచకం చాలా దూరంలో ఉంది. బాణాన్ని ప్రయోగించే అర్జునునకది తెలి యదు. అయినా ఒక వస్తువు నుద్దేశించి బాణం ప్రయోగించడం ఆధునికకాలంలోని క్షిపణీప్రయోగం ఒకటే గదా!

## భూమిని తాకకుండా వాహనాలు నడచుట

జపానుదేశంలో భూమిని తాకకుండగనే వాహనాలు నడుస్తాయని చెప్పుకున్నాం గదా! ద్రోణాచార్యుడు మరణించే ముందు 'అశ్వత్థామ మరణించాడు' అని ధర్మరాజు చెప్పిన సందర్భంలో–

శ్లో॥ తస్య పూర్వం రథః పృథ్వ్యాః చతురంగుల ముచ్ఛ్రితః
బభూవైవం చ తేనోక్తే తస్య వాహాః స్పృశన్మహీమ్ ॥

అని గలదు. ద్రోణాచార్యుని రథం భూమికి నాలుగు అంగుళాలు ఎత్తుగా నడుస్తూ ఈ మాట వినగానే నేలను తాకిందని అర్థం.

## భారతంలో మఱపడవలు

నదులు, సముద్రాలలో పయనించే సమయంలో ఈ ఆధునిక కాలంలో మఱపడవలు చాలా కనిపిస్తున్నాయి. అయితే ఇలాంటి మఱపడవలు మహాభారతంలో వర్ణించబడడం విచిత్రం.

లక్కయిల్లు తగలబడ్డాక పాండవులు గంగానదిని మఱపడవలతో దాటినట్లు మహాభారతంలో వర్ణింపబడింది.

## ఖగోళ విజ్ఞానం

ఆధునికఖగోళవిజ్ఞానంతో సరిపోయే ఖగోళవిజ్ఞానాన్ని భీష్ముడు మహాభారతంలో చెబుతాడు.

## మృతులు తిరిగి బ్రతకటం

మహాభారతంలో తారకాక్షుని కుమారుడు మృతులను బ్రతికించేవిద్య కావాలని శివుణ్ణి యాచించాడు. శివుడొక బావిని సృష్టించి మరణించిన వారిని దానిలో పడేస్తే వాళ్లు తిరిగి జీవిస్తారని చెప్పాడు. ఈ పద్ధతి క్లోనింగ్ విధానాన్ని అనుకరిస్తోంది. శరీరం సుగంధభరితంగా ఉండడానికి ప్రజలు సుగంధసాధనాలను (పర్ఫ్యూమ్స్) వాడుతారు. ఇదే విషయాన్ని మత్స్యగంధిచరిత్ర చెబుతూంది. భీష్ముడు ధర్మరాజుకు ఉప వాసపద్ధతులను వివరించాడు. ఇది ఆధునికులు చెప్పే విషయమే– డైటింగ్. భారతంలో వర్ణింపబడ్డ పాచిక లాటనుండే చదరంగం ఆట (చెస్) పుట్టింది.

ఇలా మహాభారతంలో అనేక వైజ్ఞానికాంశాలు కన్పిస్తాయి. విజ్ఞానఖని అయిన వ్యాసమహర్షిని ఇలా స్తుతిద్దాం.

శ్లో॥ నమోஉస్తుతే వ్యాస! విశాలబుద్ధే! ఫుల్లారవిందాయతపద్మనేత్ర!
యేన త్వయా భారత తైలపూర్ణః ప్రజ్వాలితో జ్ఞానమయః ప్రదీపః॥


# అన్నమయ్య ఆర్థికసూత్రాలు

- డా॥ గూడూరు యానాది రాజు,
97018 57260

సమాజంలో కొంతమంది భోగభాగ్యాలతో తులతూగుతూ విలాసజీవితం గడుపుతూ ఉంటే కొంతమంది కనీసం కూటికి, గూటికి, గుడ్డకు లేక దుర్భరజీవితాలతో దుఃఖపడుతున్నారు.

మానవులందరు సమానమేనన్న అభిప్రాయమున్న అన్నమయ్య సమాజంలో ఆర్థికపరమైన అసమానతలను చూసి ఆవేదనతో విచారం వ్యక్తం చేశాడు. సంపద అస్థిరమైంది. అది ఒక చోట నిలువదు. అది చెట్లనీడవంటిది. వెన్నెలలా కొంతకాలం పెరుగుతుంది, మరలా తరుగుతూ ఉంటుంది. అస్థిరమైన సంపద స్థిరమైందని సంతోషపడడం భ్రమ మాత్రమే అవుతుంది.

అందుకే అన్నమయ్య తన జీవితకాలంలో వ్యక్తిగతంగానూ, కుటుంబపరంగాను సామాన్యసాధారణజీవితాన్ని గడపాడు.



ప్రపంచదేశాల ఆర్థికవ్యవస్థను పరిశీలిస్తే ఆర్థికపరమైన కార్యకలాపాలన్నీ పకడ్బందీగ ప్రభుత్వాధిపత్యంతో నిర్వహించడానికి వివిధరకాల నాణేలముద్రణ తయారీ మరియు చలామణి అవసరమై ఉంది.

పూర్వకాలంలో వెండి, బంగారు లోహాలతో తయారు చేసిన తారం, కాసులాంటి వివిధవిలువలు గల్గిన నాణేలు వాడుకలో ఉండేవని తెలుస్తుంది. ధనం నాణేలుగా చెలామణి కావడం, అన్ని రాజ్యాలలో, అన్ని కాలాలలో సర్వసాధారణంగా జరిగే విషయమే! ధనం ఉన్న చోట ఉండదు. అది రూకలుగా, మాడలుగా, రువ్వలుగా మారి లోకమంతా సంచరిస్తుంటుంది. ఈ విషయం గురించి జనమంతా ఆలోచించే విధంగా అన్నమయ్య ఓ కీర్తనలో ఆర్థికవ్యవహారాలను చక్కగా వర్ణించాడు.

రూకలై మాడలై రువ్వలై తిరిగీని
దాకొని వున్నచోట దానుండ దదివో

ధనం ఎంతో చిత్రమైందని అంటున్నాడు అన్నమయ్య. ఎలా అంటే... అది ఉండటంతో ఒకడు ప్రభువుగాను, ఆ డబ్బే లేకపోవటంతో ఇంకొకడు బంటుగాను రాజ్యంలో గుర్తింపబడుతున్నాడు. పుణ్యపాపాలకు డబ్బే కారణం. లోకంలో కలహాలకు, కొట్లాటలకు కారణం ధనమే నన్నది నిజం. ఈ విధంగా సమాజంలో ఆర్థికపరంగా ఉన్న రుగ్మతలను ఎత్తిచూపుతున్నాడు అన్నమయ్య. డబ్బు చెలామణి ప్రజల జీవితాల్లోకి ప్రవేశించి అది చేయిస్తున్న విన్యాసాలు, అది చేస్తున్న నటనలు చిత్రించాడు ఆయన.

రాజ్యపాలనలో పాలకుడైన ప్రభువుకు సహాయం చేయడానికి అమాత్యులు, మంత్రులు, పురోహితులు,

సేనాధిపతులు, ఖజానాపర్యవేక్షకులు, అధికారులు మొదలైన వారి అవసరం ఉంటుంది. తేనెటీగల్లా బాధ తెలియకుండా పువ్వులోని మకరందాన్ని గ్రోలి, తేనెతెట్టెలో దాచి, ఉంచినట్లు సమర్థులైన పాలనాధికారులు ప్రజల నుండి పన్నుల రూపంలో సొమ్మును వసూలు చేసి, ఖజానాలో నిధిగా ఉంచుతారు. ఆ ధనాన్ని ప్రజాసంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకు వెచ్చించాలి. పాలకులు ప్రజాధనానికి కాపలాదారులే తప్ప భక్షకులుగా మారరాదు.

అన్యాయార్జితమైన ఆడంబరజీవితం గడపడంకంటే సమాజంలో మనిషికి నిర్దుష్టమైన సాధారణ, సామాన్యజీవితం చాలా మేలైందన్న అర్థాన్ని అన్నమయ్య ఈ కీర్తనలో వివరించాడు.

**అప్పులేని సంసారమైన పాటే చాలు**
**తప్పులేని జీత మొక్క తారమైన జాలు**
**(సంపుటం.1, కీర్తన. 114)**

అప్పు చేసి ఆడంబరంగా కాపురం జరుపుటకంటే అప్పులేని సంసారం చిన్నదైనా చాలును. అక్రమార్జితమైన అధిక ధనంకంటే తప్పులేని నాలుగుకాసులు అయినా చాలునని, అదే ఆనందమైందని భావించాడు అన్నమయ్య.

అందుకే మనకంటే ఆర్థికంగా ఒకటి రెండుమెట్లు క్రింద ఉన్న సామాన్యులతో స్నేహం చేయాలి. ఆ మిత్రులు ధనం విలువ గుర్తెరిగి ఉంటారు. ఆడంబరాలకు ఆకర్షితుల మైనప్పుడు ఒక చిన్న హెచ్చరికతో పరిస్థితులకు అనుగుణంగా మనల్ని ఆలోచింపజేస్తారు.

చక్కగా కప్పబడి ఎండ వానలు జొచ్చుటకు కంతలు లేని గుడిసెలాంటి చిన్న ఇల్లు మేలు. చీకూ చింత లేని అంబలి చేరెడైనను సంతోషం అంటూ హితువు పలికాడు అన్నమయ్య.

ప్రతికార్యానికి తప్పనిపరిస్థితులలో సామాన్యులు అప్పు చేస్తూనే ఉంటారు. తిరిగి ఆ అప్పును సకాలంలో చెల్లించకపోవడంవల్ల ఋణగ్రస్తులుగా మిగిలిపోతున్నవారు ఎందరో?.... అందుకే అన్నమయ్య మరో కీర్తనలో అందరమూ అప్పులవాళ్లమేనన్న భావాన్ని నలుగురితో పంచుకుంటున్నాడు.

**అప్పుల వారే అందరును**
**కప్పగ దిప్పగ గర్తలు ఏరీ? (సంపుట. 1, కీర్తన 81)**

# అన్నమయ్య మాటలు ఆనందానికి బాటలు

ఇలా ఋణ సమస్యలు సృష్టించుకొంటున్నజీవులకు ఆ బాధలు తీర్చే కర్త లేరని అన్నమయ్య ప్రశ్నిస్తున్నాడు.

ఉపద్రవాలు, బాధలు ఎదురైన పరిస్థితుల్లోనే మనం ఎంత విజ్ఞులమో, స్థితప్రజ్ఞులమో తెలుస్తుంది. పుటం పెట్టి నప్పుడే బంగారునాణ్యత బయటపడుతుంది. ఆపదలు వచ్చి నపుడే మనబంధువుల ఆత్మీయత, మనవ్యవహారశైలీ బయట పడుతుంటాయి.

ఆ సమయంలోనే మనకు సంయనం వహించ డానికి అవసరమైన సలహాలివ్వగల హితులు, సన్నిహితులు ఎంతమంది ఉన్నారో అర్థమౌతుంది. ఈ బంధాలు, బాధలు వారికి వారుగా తెంచుకొనేవి కావు. అవి తీర్చి, సరైనమార్గంలో జీవులను నడిపించడానికి ప్రతిఒక్కరికి శ్రీపతి ఒక్కరే దేవుడై ఉన్నాడు అంటున్నాడు అన్నమయ్య.


సమాజంలోని ఏ వ్యక్తికైనా, కవికైనా వ్యక్తిత్వం, నైతికత చాలాముఖ్యం. అవి కవులు రచించిన సాహిత్యంలో ఎంత ఉన్నతంగా, విశ్వసనీయంగా ఉంటే పరిష్కారాలుగాని, ఫలితాలుగాని అంత పవిత్రంగా ఉంటాయి.

అన్నమయ్య వ్యక్తిగతంగా ఎంత భక్తితో జీవించాడో, ఎంత ధర్మబద్ధంగా దాంపత్యజీవితం పాటించాడో అంతే వ్యక్తిత్వంతో, నైతికతతో ఆయన పదసాహిత్యంద్వారా సమాజం లోని సమస్యలకు శ్రీవేంకటేశ్వరస్వామిసాక్షిగా పరిష్కారాలు చూపించాడు.

ఇలా భావితరాలకోసం ఆర్థిక నీతిసూత్రాలను తన సంకీర్తనలలో అలతి అలతి పదాలతో ఇమిడ్చిన మేధావి, ప్రజ్ఞాశాలి, జ్ఞాని, ఆర్థికవేత్త అన్నమయ్య. ఆయన సంకీర్తనలను చదివి, విని అందులో వివరించిన ఆర్థికవిషయాలను, నీతిని గ్రహించుకుని అందరూ ఆచరిస్తే సమాజంలో జనమంతా ప్రశాంతంగా, క్షేమంగా ఉంటారు. సమాజమంతా ఆనంద మయంగా, హాయిగా ఉంటుంది.

# జీవితం స్థిరంగా ఉండాలంటే...

– డా॥ మేడికుర్తి ఓబులేశు



రవి నవగ్రహాలకు అధిపతి. ఈ గ్రహం అనుకూలంగా ఉంటే జీవితకాలఅధికారం, మంచిఆరోగ్యం, పుత్రసంతాన ప్రాప్తి కలుగుతుంది. సంతానం మంచిస్థితికి చేరుకోవడం, వారి ద్వారా ప్రఖ్యాతి, వంశవృద్ధి, ప్రతిష్ఠ పెరుగుతాయి. విజ్ఞాన శాస్త్రవేత్తగా రాణింపు. మందులతయారీ. నూతన వైద్యవిధానాలు కనుగొనుట, వైద్యసంబంధితవ్యాపారాలు, మందుల అమ్మకం మొదలైనవాటిల్లో గొప్పగా రాణించడానికి రవిగ్రహఅను కూలస్థితే కారణం. మంచిడాక్టరుగా రాణించాలంటే, హస్తవాసి బాగుండాలన్నా, వైద్యుడిగా రాణించాలన్నా రవిగ్రహఅనుకూల స్థితి అవసరం. వైద్యవిద్యను అభ్యసించడానికి ముందు రవిగ్రహ అనుకూలతను పరిశీలించడం ముఖ్యం. రవిగ్రహ జాతకులు రుద్రపాశుపతహోమం చేయాలి. తండ్రివైపు, తాతవైపు ఆస్తి, అంతస్తులకు రవిగ్రహమే కారణం. పిత్రార్జితంవల్ల జీవితంలో సౌఖ్యం, తండ్రి స్థాపించిన వ్యాపారంద్వారా, వృత్తిద్వారా ఉన్నతస్థితిలో జీవనం గడపడం తండ్రిద్వారా రాజకీయ అధికారం శ్రమలేకుండా లభించడంవంటివాటికి రవిగ్రహ అనుకూలఫలితాలే కారణం. మానవజీవితంలో ఈ గ్రహ ప్రాధాన్యత తిరుగులేనిది. సూర్యసంచారాన్ని అనుసరించి జ్యోతిష్యశాస్త్రఫలితాలు ప్రధానంగా ఆధారపడి ఉంటాయి. రవి క్షత్రియగ్రహం. రవిగ్రహఅనుకూలతవల్ల జీవితస్థిరత్వం కలుగుతుంది.




## రవిగ్రహ అనుకూలతకు చేయాల్సినవి

తూర్పువైపు తిరిగి ముఖప్రక్షాళన చేయవద్దు. సూర్య గ్రహణంరోజున ఉపవాసం ఉండి, మరుసటిరోజు శివాలయంలో సర్పసూక్త సహిత రుద్రాభిషేకాన్ని చేయించండి. రామాలయాన్ని దర్శించి, తులసీదళాలతో పూజ నిర్వహించండి. రవిగ్రహ అనుకూలతకు మహాతీర్థంపొడి, సిద్ధగంధం, సుమంగళీ పసుపు జలాలతో రుద్రాభిషేకం చేయాలి. గోధుమలు దంపుడు చేసి, అందులో పంచదారమిశ్రమం వేసి, పక్షులకు ఆహారంగా వేయండి, అందుబాటులో ఉన్న సూర్యదేవాలయాన్ని దర్శిం చండి. ఆదివారంనాడు ఎరుపువత్తులతో దీపారాధన చేయండి. కృత్తిక, ఉత్తర, ఉత్తరాషాఢ నక్షత్రాలు ఉన్నరోజున ఆరువత్తు లతో, అష్టమూలికాతైలంతో దీపారాధన చేయండి. గోధుమలతో చేసిన వంటకాలు అర్హులైన వారికి మీ శక్తిమేరకు సమర్పించి ఆకలి తీర్చండి!


**రవిగ్రహస్తోత్రం**

**జపాకుసుమసంకాశం। కాశ్యపేయం మహాద్యుతిమ్।**
**తమోఽరిం సర్వపాపఘ్నం। ప్రణతోఽస్మి దివాకరమ్॥**

# తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి వసంతోత్సవం

**ఏప్రిల్ 24వ తేది నుండి 26వ తేది వరకు**






# శ్రీరామానుజ నామాలు గోవింద నామాల వరుస



అష్టభుజసేవక రామానుజ !
అనంతరూపా రామానుజ !
అనాథరక్షక రామానుజ !
అమృతమూర్తి రామానుజ !
అద్భుతరూపా రామానుజ !
అధర్మశత్రూ రామానుజ !
ఆముదల్వాన్ రామానుజ!
ఆశ్రితరక్షక రామానుజ !
ఆనందరూపా రామానుజ !
ఆదిశేషా రామానుజ!
రామానుజ శ్రీయతిరాజా !
యతిరాజా శ్రీరామానుజ !
ఆపద్బాంధవా రామానుజ !
ఇలైయాళ్వారే రామానుజ !
ఉడయవరే రామానుజ !
ఎంబారునాథా రామానుజ !
కరుణాంతరంగా రామానుజ !
కలిధ్వంసకా రామానుజ !
కల్పవృక్షమా రామానుజ !
దాసపావనా రామానుజ !
ధర్మసంస్థాపక రామానుజ !
దాశరథిగురు రామానుజ !
దీనజనోద్ధార రామానుజ !
రామానుజ శ్రీయతిరాజా !
యతిరాజా శ్రీరామానుజ !
దీనశరణ్య రామానుజ !
దీనదయాళో రామానుజ !
దీనబంధో రామానుజ !
దేవరాజప్రియ రామానుజ !
కాషాయాంబర రామానుజ !

కారుణ్యజలధే రామానుజ !
రామానుజ శ్రీయతిరాజా !
యతిరాజా శ్రీరామానుజా !
కామధేనూ రామానుజ !
కామాదిహరా రామానుజ !
కామితఫలదా రామానుజ !
కాంతిమతీసుత రామానుజ !
కూరేశపూజిత రామానుజ !
కేశవతనయా రామానుజ !
కోయిలణ్ణనే రామానుజ !
గద్యత్రయకర రామానుజ !
గోపీమోక్షదా రామానుజ !
రామానుజ శ్రీయతిరాజా !
యతిరాజా శ్రీరామానుజ !
గోదాగ్రజా శ్రీరామానుజ !
తిరుప్పులియాళ్వారే రామానుజ !
త్రిదండధారీ రామానుజ !
దయాసింధో రామానుజ !
పురాణపురుషా రామానుజ !
పురుషపుంగవా రామానుజ !
పుండరీకాక్షా రామానుజ !
పెరియనంబిచ్ఛాత్ర రామానుజ !
బలభద్రాజయ రామానుజ !
రామానుజ శ్రీయతిరాజా !
యతిరాజా శ్రీరామానుజా !
భక్తజనప్రియ రామానుజ !
భవభయహరా రామానుజ !
భక్తమందారా రామానుజ !
దేశికేంద్ర రామానుజ !
నిత్యనిర్మలా రామానుజ !

పరమదయాళో రామానుజ !
పంచాచార్యపదాశ్రిత రామానుజ !
పరాంకుశసేవక రామానుజ !
రామానుజ శ్రీయతిరాజా !
యతిరాజా శ్రీరామానుజా !
పరమహంసా రామానుజ !
పావనపురుషా రామానుజ !
పాపవిమోచనా రామానుజ !
ఫణిశరీరా రామానుజ !
ప్రియంవదా శ్రీరామానుజ !
యతిరాజా శ్రీరామానుజా !
యామునప్రియా రామానుజ !
రంగనాథపుత్రా రామానుజ !
లక్ష్మణమునే రామానుజ !
లీలామానుషవిగ్రహ రామానుజ !
వరదరాజసుత రామానుజ !
రామానుజ శ్రీయతిరాజా !
యతిరాజా శ్రీరామానుజా !
వీరాధివీరా రామానుజ !
వైష్ణవప్రియా రామానుజ !
శంఖచక్రప్రద రామానుజ !
శారదాశోకనాశ రామానుజ !
శిష్టరంజనా రామానుజ !
శిష్టపరిపాలా రామానుజ !
శ్రీభాష్యకర్తా రామానుజ !
శ్రీరామానుజ రామానుజ !
శ్రీలక్ష్మణార్యా రామానుజ !
శ్రీరంగప్రియ రామానుజ !
రామానుజశ్రీ యతిరాజా !
యతిరాజా శ్రీరామానుజా !
భక్తవత్సలా రామానుజ !

భాగవతప్రియ రామానుజ !
భాషాసన్నుత రామానుజ !
భువనపావనా రామానుజ !
భూరిదయానిధే రామానుజ !
భూతపురీశా రామానుజ !
మన్నాథాజయ, రామానుజ!
రామానుజ శ్రీయతిరాజా !
యతిరాజా శ్రీరామానుజా !
మంత్రప్రకాశా రామానుజ !
ముక్తిదాయకా రామానుజ !
మేషార్ద్రాసంభవ రామానుజ !
శ్రీరామసోదర రామానుజ !
శ్రీరంగాశ్రిత రామానుజ !
శ్రీకృష్ణాగ్రజ రామానుజ !
శ్రీభాష్యకారా రామానుజ !
శెల్వపిళ్ళజనక రామానుజ !
శ్వేతవర్ణా రామానుజ !
శేషావతారా రామానుజ !
శోకనాశనా రామానుజ !
సహస్రనామా రామానుజ !
సత్యసంకల్పా రామానుజ !
సజ్జనప్రియా రామానుజ !
సాక్షీభూతా రామానుజ!
సుదీర్ఘబాహూ రామానుజ !
సుగుణాకర రామానుజ !
సూరిశిఖామణి రామానుజ !
సౌశీల్యభూషా రామానుజ !
క్షాంతివర్ధనా రామానుజ !
క్షీరపురీశా రామానుజ !
రామానుజశ్రీయతిరాజా !
యతిరాజా శ్రీరామానుజా !



25-03-2021న తి.తి.దే. పాలకమండలి ప్రత్యేక ఆహ్వానితులుగా నియమితులైన శ్రీమల్లాది విష్ణు (విజయవాడ సెంట్రల్ శాసన సభ్యులు) గారికి శ్రీవారి చిత్రపటాన్ని అందజేస్తున్న తి.తి.దే. అదనపు కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి గారు



తిరుమల క్షేత్రపాలకుడైన రుద్రుడికి మహాశివరాత్రి సందర్భంగా జరిగిన విశేష పూజలు





తి.తి.దే. తరపున శ్రీకాళహస్తీశ్వరుడి బ్రహ్మోత్సవాలలో భాగంగా తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ వై.వి.సుబ్బారెడ్డి, తి.తి.దే. కార్యనిర్వహణాధికారి డా॥ కే.ఎస్.జవహర్ రెడ్డి, ఐ.ఏ.ఎస్. గార్లు పట్టువస్త్రాలు సమర్పిస్తున్న దృశ్యం



తి.తి.దే. తరపున మంత్రాలయం శ్రీగురురాఘవేంద్రస్వామివారి 426వ వర్ధంతి ఉత్సవ సందర్భంగా శేషవస్త్రం సమర్పిస్తున్న అదనపు కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి గారు



తి.తి.దే. ఇటీవల తిరుమలలో నిర్వహించిన శ్రీఅనంతాళ్వారు 967వ అవతారోత్సవ దృశ్యం. శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి, తి.తి.దే. హిందూధర్మప్రచారపరిషత్తు కార్యదర్శి ఆచార్య కె.రాజగోపాలన్, అనంతాళ్వారు వంశీకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


# భాగ్యమన్న అయోధ్యా వాసులదే!

- బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు శర్మ

భరతుడు "రామా, ఈ రాజ్యం నాదికాదు. నువ్వు నాకు న్యాసంగా ఇచ్చినా. దానిని తిరిగి ఇచ్చేస్తున్నాను. అందుచేత స్వీకరించవలసింది" అన్నాడు. ఆయన వినయ విధేయతలకు శ్రీరామచంద్రమూర్తి సంతోషించాడు. ఇక్కడే భరతుడు ఒకమాట చెపుతాడు దీనిని అందరూ ప్రతిరోజు కంఠస్థం చెయ్యవలసిన శ్లోకం. మీకు ఏ సుఖం వచ్చినా, ఏ ఆనందం వచ్చినా, ఏ దుఃఖం వచ్చినాకూడా మనల్ని రక్షించడానికి రాముడు ఉన్నాడని అనుకోవడానికి ఈ శ్లోకాన్ని కంఠస్థం చెయ్యాలి.

యావదావర్తతే చక్రం యావతీ చ వసుంధరా।
తావత్ త్వమిహ సర్వస్య స్వామిత్వమ్ అనువర్తయ॥ (6-131-11)

ఈశ్వరుడు ఇచ్చిన వైభవాన్ని మీరు అనుభవిస్తూ "స్వామీ! నీది నేను అనుభవిస్తున్నాను" అన్నంత మాత్రం చేత ఆ కృతజ్ఞతాభావానికి స్వామి పొంగిపోతాడు. ఇది మనిషిగా బ్రతికినవాడు నేర్చుకోవాలి. ఇది లేనినాడు నీవు కృతఘ్నుడవు. అటువంటి కృతఘ్నుడికి ఇంక ఎటువంటి ప్రాయశ్చిత్తం లేదు. కృతజ్ఞుడిగా ఉండడం ఎలాగో మనకు రామ పట్టాభిషేకఘట్టం నేర్పుతుంది.



"స్వామీ, మేము మీ భృత్యులం. మీ కింకరులం. అందుకని మీరు మమ్ములను స్వామిగా సర్వకాలాలయందు కాపాడండి. ఈ సిరిసంపదలు మావికావు. ఇవన్నీ మీవి. మీవయినవి మాకు ఇచ్చి, మేము ఆనందం అనుభవిస్తుంటే, మా ఆనందాన్ని చూచి, మీరు ఆనందిస్తున్నారు. మీరు తల్లిదండ్రులు. అందుకని మీరు మమ్మల్ని ఇలా కటాక్షించగలిగారు" అని భరతుడు చెపితే సంతోషించి, శ్రీరామచంద్రమూర్తి రాజ్యాన్ని స్వీకరించడానికి అంగీకరించాడు.

తదుపరి శత్రుఘ్నుడు వచ్చి "అన్నయ్యా! క్షురకర్మ చేసేవారిని తీసుకువచ్చాను. నీ జటాజూటం జటలు కట్టేసింది కదా! క్షురకర్మ చేయించుకోవాల్సింది" అన్నాడు.

ఇక శ్రీరాముని ఔదార్యం చూడండి! "నేను తండ్రిమాట నిలబెట్టడం కోసమని అరణ్యవాసానికి వెళ్లాను. కానీ తండ్రి ఆజ్ఞాపించకపోయినా నాయందు ఉండే ప్రేమచేత స్వచ్ఛందంగా తనంతతాను దీక్ష స్వీకరించి, నందిగ్రామానికి వచ్చి, నాపాదుకలను తీసుకువెళ్లి సింహాసనంలో పెట్టి, పద్నాలుగు సంవత్సరాలు రాజ్యంపై మమకారంలేకుండ పరిపాలించిన తమ్ముడు భరతుడు. ఆ భరతుడు ముందుగ దీక్ష విరమించి స్నానంచేస్తే తప్ప నేను దీక్ష విరమించను" అన్నారు. ఒక అన్నగారు అన్న గారిగా బ్రతకడం అంటే ఏమిటో రాముడు మనకు చూపిస్తారు.

ముందు భరతుడు క్షురకర్మ చేయించుకున్నాడు. మంగళ స్నానం చేశాడు. తదనంతరం లక్ష్మణ, శత్రుఘ్నులు చేయించుకున్నారు. సుగ్రీవుడు, విభీషణుడు కూడా క్షురకర్మ చేయించుకుని మంగళస్నానాలు చేసి, పట్టుబట్టలు కట్టుకున్న తరువాత

పధ్నాలుగుఏళ్లనుంచి ఆ కాళ్లలో ఎన్నిపల్లేరుకాయలు గుచ్చుకున్నాయో, ఎన్నిముళ్లు గుచ్చుకున్నాయో, ఎంత ఎండల్లో నడిచాడో, ఎన్నిరాళ్లల్లో నడిచాడో, ఎన్నిచెట్లక్రింద నడిచాడో, హా సీతా! హా సీతా! అని ఎంత ఏడ్చాడో, ఎన్ని పర్వతగుహలలో పడుకున్నాడో, శరీరంమీద పాములు పాకుతున్నా, తేళ్లు పాకుతున్నా, పడుకున్నవాడయి ఇన్నికష్టాలు పడినప్పటికి కూడ అగ్నిశిఖలా శోభించే రామచంద్రమూర్తి ఆ తర్వాత మంగళస్నానం చేసి, ఆ జటలు విప్పుకుని, చక్కగా శోభించే కేశపాశంతో అందమైన పట్టుపుట్టాలను ధరించి, అంగరాగాలను పూసుకుని, దివ్యాభరణాలను ధరించి బయటకు వచ్చాడు.

మామూలుగా చూస్తేనే శూర్పణఖవంటిది ప్రేమించేసింది. అలాంటిది ఇవ్వాళ స్వామి దివ్యాంబరాలను కట్టుకుని బయటకువచ్చి నిలబడేసరికి, నిజంగా కౌసల్యకళ్లల్లో ఎన్ని కన్నీళ్ళు కారి ఉంటాయో! "ఇన్నాళ్ళకు కదా నా కొడుకు ఇటువంటి బట్టలు కట్టుకోగా చూచాను" అనుకుంటుంది. ఆ పురవాసులు ఎంతో పొంగిపోయారు. హనుమ ఎంత పొంగిపోయాడో! సీతమ్మ ఎంత సంతోషించిందో! అది కదా పట్టాభిషేక సర్గ అంటే! **యావత్ జగతి సంతోషించిన సర్గ పట్టాభిషేక సర్గ.**

కొడుకు మరల ఇన్నాళ్ళకు తిరిగివచ్చాడని పొంగిపోయిన కౌసల్యాదేవి సీతకు అభ్యంగస్నానం చేయించి, పట్టుపుట్టం కట్టి, చక్కని అలంకారం చేసింది. వానరకాంతలు తలంటి స్నానం చేసారు. వాళ్లు కామరూపులు కనుక నరరూపాన్ని పొందారు. చక్కటిచీరలు కట్టుకుని, ఆభరణాలు పెట్టుకుని, వాళ్లందరు తొమ్మిదివేల ఏనుగులను ఎక్కారు.

ఎప్పుడు కూడా ఊరేగింపులో ఇంటి పెద్దాయన ఒకాయన వెళ్లాలి. ఎప్పుడైనా అమంగళకరమైన పనిమీద బయటకు వెడుతున్నప్పుడు మొట్టమొదట స్త్రీ ఇంటినుండి బయటకు వెళ్లాలి. మంగళకరమైన పని అయితే ముందు భర్త నడవాలి. వెనుక భార్య నడవాలి. అందుకని పూర్వం దశరథమహారాజు ఎక్కిన శత్రుంజయమనే ఏనుగుమీద సుగ్రీవుణ్ణి తీసుకువచ్చి కూర్చుండ చేశారు. అదీ రామచంద్రమూర్తి అంటే!

మిగిలిన వానరులు అందరు మనుష్యరూపాల్ని ధరించి పరమసంతోషంగా వెళ్లుతున్నారు. ఆ సమయంలో శ్రీరామచంద్రమూర్తి సూర్యమండలసన్నిభమైన రథం ఎక్కారు. స్వయంగా భరతుడు రథంపగ్గాలను పట్టుకుని, ఆ రథాన్ని నడుపుతున్నాడు. లక్ష్మణుడు నూరుతీగలుకలిగిన తెల్లని ఛత్రాన్ని పట్టాడు. శత్రుఘ్నుడు వింజామర వేస్తున్నాడు. విభీషణుడు ఒక పక్కన నిలబడ్డాడు. ఆయన వింజామర వేస్తున్నాడు. అందరూ బారులుతీరి నిలబడిపోయారు. నందిగ్రామంనుంచి అయోధ్యవరకు వచ్చేశారు.

రాముడు పూర్వభాషి. ఒకరు ముందుగా తనను పలకరిస్తే రాముడు దానిని చిన్నతనంగా భావిస్తాడు. "పెద్దలువచ్చి పలకరించారు నేను వెళ్లి ముందుగా వారిని పలకరించలేకపోయాను" అని సిగ్గుపడతాడు.

అంత రథంలో వెడుతూకూడా ప్రజల క్షేమసమాచారాలను అడిగి తెలుసుకుంటూ, అందరినీ పేరుపేరునా పలకరిస్తున్నాడు. వానరులు అందరూ సంతోషంగా నడుస్తున్నారు. ఇంటింటా పతాకాలను ఎగరవేశారు. ఇళ్ల ముందు రంగవల్లులు తీర్చబడ్డాయి. ఆనందంతో తాండవం చెయ్యనివాడు లేడు! ఎవరి నోట విన్నా "జై సీతారామచంద్ర ప్రభువుకి జై" అని ఒకటే మాట! అందరూ పొంగిపోయి ఆనందంతో పలుకుతున్నారు.

అందరు సంతోషపడిపోతూ, నాట్యంచేస్తూ బయలుదేరి వెడుతున్నారు. ముందు మంగళవాద్యాలు నడిచాయి. ఆగమశాస్త్రవేదపండితులు, ఆ వెనకాల పెద్దలు, ఆ వెనకాల యువతులు, ఆ వెనకాల పిండివంటలు పట్టుకుని కొంతమంది నడిచారు. ఆ వెనకాల అక్షతలు నడిచాయి. ముందు పేలాలు చల్లారు. పరిమళిస్తూ ఉండాలని గంధపునీరు చల్లుకుంటూ వెళ్లారు. ఆ వెనక ముత్తైదువలు చేతిలో పువ్వులు, పసుపు, కుంకుమ పట్టుకుని వెళ్ళారు. వశిష్ఠుడు, జాబాలి, కాశ్యపుడు, గౌతముడు మొదలైన ఋషులందరు వచ్చారు. వారంతా రాముడితో మాట్లాడుతున్నారు. చక్కగా రథం వెళ్లిపోతోంది. అయోధ్య చేరుకున్నారు. తరువాత స్వామిని సింహాసనం మీద కూర్చోబెట్టారు. ఆ రోజు రాత్రిమాత్రం సుగ్రీవుడికి రామచంద్రమూర్తి ఉండే శయనాగారాన్ని విడిదిగా ఇచ్చారు.

రామచంద్రమూర్తి పట్టాభిషేకానికి ఉన్నగొప్పతనం ఏమిటో తెలుసాండి! వానరులువెళ్లి నాలుగుసముద్రాల జలాలను, ఐదువందలనదులజలాలను తీసుకువచ్చారు. ఆ జలాలతో స్వామిని మూర్ధాభిషిక్తుణ్ణి చేశారు. ఇంద్రుడు నూరు బంగారుపూసలు కలిగిన మాలను స్వామికి కానుకగా ఇచ్చాడు. స్వామి ఆ కాంచనమణులమాలను మెడలో వేసుకున్నారు.

ఆఖరున కిరీటాన్ని తీసుకువచ్చి శ్రీరామచంద్రమూర్తిశిరస్సున అలంకరించారు. అందరు పరమానందాన్ని పొందారు. ఆ ఆనందసమయంలో శ్రీరామచంద్రమూర్తి కొన్నికోట్ల బంగారు నాణేలను, కొన్నిలక్షల ఆవులను, కొన్నివేలఎద్దులను బ్రాహ్మణులకు దానం చేశాడు. ఇన్ని దానములు పూర్తిచేసిన తరువాత లక్ష్మణుడివంక తిరిగాడు.



"ధర్మజ్ఞా! లక్ష్మణా! నీవు యౌవ రాజ్య పట్టాభిషేకం చేసుకో" అన్నాడు. ఎందుకని? లక్ష్మణునిధర్మం ఏమిటో లోకానికి చెప్పాలని స్వామి భావించాడు. రోజూ దేవాలయానికి వెడితే నీవు అసలు నోరువిప్పి అడగకుండా నీకు కావలసింది ఈశ్వరుడు చూచుకుంటాడు.

రాముడు అలా అనేసరికి లక్ష్మణుడు "అన్నయ్యా, నాకన్న పెద్దవాడు భరతుడు ఉన్నాడు. నాకు రాజ్యం వద్దు. భరతునికి ఈయవలసింది" అన్నాడు.

భరతుణ్ణి పిలిచి, యౌవరాజ్యపట్టాభిషేకం స్వీకరించుమన్నాడు. అతనికి యౌవ రాజ్య పట్టాభిషేకం జరిగింది. అంగదుణ్ణి పిలిచి, అంగదాలు ఇచ్చాడు. సుగ్రీవుడు మొదలైన వానరనాయకులందరికి, విభీషణునికి యథోచితంగా ఎవరెవరికి ఏ బహుమతులు ఇవ్వాలో ఆ బహుమతులు ఇచ్చాడు. హనుమకు తెల్లని వస్త్రాలతోపాటు ఆభరణాలను ఇచ్చాడు. అన్నిటినీ ధరించాడు.

అమ్మవారు చిట్టచివర తన మెడలోనుంచి ఒక హారాన్ని తీసి చేతిలో పట్టుకుంది. అపుడు రాముడు ఒకసారి సీతమ్మ వంక చూశాడు. ఆ హారాన్ని ఎవరికి ఇవ్వాలో రామునికి తెలుసు.

"సీతా! ఆ హారం ఎవరికి ఇవ్వాలో తెలుసా? పౌరుషం, బుద్ధి, విక్రమం, తేజస్సు, వీర్యం, పట్టుదల, ఘర్షణసామర్థ్యం, పాండిత్యం అన్నీ ఎవరిలో రాశీభూతం అయ్యాయో అలాంటివారికి ఈ హారాన్ని కానుకగా ఇవ్వు. అన్నిటినిమించి ఆ వ్యక్తి నీ అయిదువతనమునకు కారణం అయిఉండాలి" అన్నాడు.

ఆవిడ అయిదువతనమునకు కారణమైనవాడు ఎవరు? సీతమ్మ తల్లి క్షేమవార్త రామునికి చెప్పినవారెవరు? రామచంద్రమూర్తి క్షేమవార్త భరతునికి చెప్పినవారెవరు? వచ్చినవాడు రాముడని సుగ్రీవునికి చెప్పి, ప్రాణాలు నిలబెట్టినవారెవరు? ఎక్కడెక్కడ ప్రాణం వాయురూపమైతే, అక్కడ వాయునందనుడు హనుమ సాక్షాత్కరిస్తాడు. హనుమ ఎక్కడ ఉంటే అక్కడ ప్రాణాలు నిలబడతాయి. హనుమ ఎక్కడ ఉంటే అక్కడ మంగళం జరిగి తీరుతుంది. రామునిసూచనమేరకు సీతమ్మ తల్లి ఆ హారాన్ని హనుమచేతికి ఇచ్చింది. హనుమ దాన్ని తీసుకుని కన్నులకు అద్దుకుని మెడలో వేసుకున్నాడు.

తదనంతరం శ్రీరామచంద్రమూర్తి పట్టాభిషేకం పూర్తయింది. ఆయన సింహాసనంలో కూర్చుని ఉన్నాడు. రామచంద్రమూర్తి అలా సింహాసనం మీద కూర్చుని ఉండగా ఇంక ప్రపంచానికి ఏమిటి లోటు! అంత ధర్మాత్ముడైన ప్రభువు సింహాసనం మీద కూర్చునేసరికి ప్రకృతిలో, పంచభూతాలలో బ్రహ్మాండమైన మార్పు వచ్చింది.

ఎవరినోటవిన్నా రాముడు రాముడు అని తప్ప వేరొక మాట వినపడలేదు. అందరు రామా రామా అనడమే! అంత ఆనందంగా ఉంది. రాముడు రాజ్యం చేస్తుండగా దొంగల భయం లేదు. శత్రువుల భయం లేదు. నెలకు మూడువానలూ పడుతుండేవి. భూమి సస్యశ్యామలంగా పంటలను ఇచ్చింది. చెట్లు అన్నీ ఫలపుష్పభరితాలై ఉండేవి. ప్రజలు చాతుర్వర్ణాల

వారు తమతమధర్మాలలో అనురక్తులై ఉన్నారు. పెద్ద వాళ్లు బ్రతికి ఉండి చిన్నవాళ్లు మరణిస్తే, పెద్దవాళ్లు చిన్న వాళ్లకు ప్రేతకార్యం చేయడం రామరాజ్యంలో లేదు. ఇది ప్రభువునుబట్టి ఉంటుంది. ప్రభువు ధర్మాత్ముడైతే, యజ్ఞ యాగాదిక్రతువులయందు ఆస్తిక్యబుద్ధి ఉన్నవాడైతే, రాజ్యం సుభిక్షంగా ఉంటుంది. రాముడు సింహాసనం మీద కూర్చుని ఉంటే దేశం అంతా సస్యశ్యామలం అయి మూడుపువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లింది. ఎక్కడ ఏ విధమైన దోషాలు లేవు. అందరుకూడా ఆనందంతో పరమపరవశులై ఉన్నారు.

ఎక్కడెక్కడ రామాయణం చెపుతున్నపుడు, నమస్కరిస్తూ, పరమసత్యమనే ఆస్తిక్యబుద్ధితో వింటారో, అటువంటివారికి శ్రీమహావిష్ణువు కృపచేత తీరని కోరికలు ఉండవు. ఎవరికి ఏ కోరికలు ఉంటే ఆ కోరికలు తీరుతాయి. ఉద్యోగంలో ఉన్నవారు ఉద్యోగంలో వృద్ధి చెందుతారు. వ్యాపారులు వారివ్యాపారంలో వృద్ధిచెందుతారు. నెలకు మూడువానలు పడతాయి. భూమి సస్యశ్యామలంగా ఉంటుంది. చోరభయం, శత్రువుల భయం ఉండదు. రాజ్యం సంతోషంగా ఉంటుంది. సంతానం లేనివారు రామాయణాన్ని వింటే చాలగొప్పపుత్రులు పుట్టారు. తమ కుమారులు తమకళ్లముందు వృద్ధిలోకి వస్తూ ఉండగా రామలక్ష్మభరతశత్రుఘ్నులను చూచుకుని ఆనాడు కౌసల్య, సుమిత్ర, కైకేయి ఎలాంటి ఆనందాన్ని పొందారో, తమబిడ్డల వల్ల అలాంటి ఆనందాన్ని తల్లులు పొందుతారు. అంత గొప్ప ఆఖ్యానం రామాయణం! ఈ రామాయణం వినడంచేత వివాహం కానివారికి వివాహం జరుగుతుంది. ఏ సంకల్పాల్ని తీరిస్తే మీకు క్షేమమో అవి రామునికి తెలుసు. మీరు కోరారని తీర్చడం కాదు. మీకు ఏది క్షేమమో దాన్ని శ్రీరామచంద్రమూర్తి గ్రహించి తీరుస్తాడు. మీ కుటుంబం వృద్ధిలోకి వస్తుంది. వంశం ఆచంద్రతారార్కం నిలబడుతుంది. మంచిపనులకు ద్రవ్యం వినియోగమౌతుంది. దూరంగా ఉండే బంధువులు తొందరలోవచ్చి కలుసుకుంటారు. ఇంటికి మంగళతోరణం కట్టబడుతుంది. ఎన్నాళ్లనుంచో జరగని శుభకార్యాలు జరుగుతాయి. అన్నిటినీమించి పితృదేవతలు సంతోషిస్తారు. రామాయణం ఎక్కడ చెప్పబడిందో అక్కడికి సమస్తదేవతలువచ్చి పరమానందాన్ని పొందుతారు. అలాంటి రామాయణం తిరుగులేనిది. ఈ రామాయణాన్ని ప్రభువులు కాని, నగరంలో, పట్టణంలో, గ్రామంలో ఉన్న చాతుర్వర్ణాలవారు కాని చెప్పుకుని అంజలిఘటించి విని, తమక్షేమాన్ని, లోకక్షేమాన్ని పొందాలి అని మహర్షి అభిభాషించాడు. అందులో ఒకమాట చెపుతాడు. ఇంత రామాయణం చదివిన తర్వాత ఫలంపొందాలంటే మాత్రం ఒక విషయం జ్ఞాపకం పెట్టుకోవాలి.

మనల్ని ధర్మబద్ధంగా పరిపాలించి, మన యోగ క్షేమాలను చూచే ప్రభువు సింహాసనంలో ఉంటే మనం ఏమికోరుకుంటాం? మా ప్రభువుకు ఆయుర్దాయం, బలం, తేజస్సు ఉండాలి. సర్వకాలాలయందుకూడ ఆయన మమ్ము లను ఇలాగే కాపాడుతూ, పరిపాలిస్తూ మా యోగక్షేమాలను చూడడానికి కావాల్సిన బలం ఆయనకు నిలబడాలని మనం కోరుకోవాలి.

ఈ వేళ స్వామి రాజారాముడై ఉన్నాడు కనుక ఆ రాముడు విష్ణువు. రామునికి, విష్ణువుకి తేడాలేదు. ఇద్దరూ ఒక్కటే. రాముడే శ్రీమహావిష్ణువు అన్నారు దాశరథీశతకంలో గోపరాజుగారు. మనకు రామాయణం చదివిన ఫలితాన్ని పొందాలంటే మొహమాటం లేకుండా మా స్వామి, మా ప్రభువు, మా తల్లి, మా తండ్రి, శ్రీమహావిష్ణువు అంటూ –

నీలమేఘశ్యామ! నీవె తండ్రివి మాకు,
కమలవాసిని మమ్ము గన్నతల్లి,
నీ భక్తవరులెల్ల నిజమైన బాంధవుల్,
నీ కటాక్షము మా కనేకధనము,
నీ కీర్తనము మాకు లోకప్రపంచంబు,
నీ సహాయము మాకు నిత్యసుఖము,
నీ మంత్రమే మాకు నిష్కళంకపు విద్య,
నీ పదధ్యానంబు నిత్యజపము,

తోయజాతాక్ష! నీపద తులసిదళము
రోగముల కౌషధము బ్రహ్మరుద్రవినుత!
భూషణవికాస! శ్రీధర్మపురనివాస!
దుష్టసంహార! నరసింహ! దురితదూర!

(శ్రీనరసింహశతకము–47)

శ్రీమహావిష్ణువుకు బలం కలగాలని ప్రార్థించాలి. మన ప్రార్థనలను విని, స్వామి పొంగిపోతాడు. ఆయన సంతోషపడి పోయి మంచిఫలితాలను ఇచ్చి మనం కోరిన కోర్కెల నన్నిటిని తీరుస్తాడు.

శ్రీకృష్ణుని కోరికపై మయుడు ఒక అపూర్వమైన సభను నిర్మించి, పాండవులకు కానుకగా సమర్పించాడు.  అది దేవలోకసభలకంటే మహిమాన్వితమైన సభగా ప్రశస్తి పొందింది.  ఒక శుభముహూర్తాన పాండవులు అందులో ప్రవేశించారు. దేశదేశాలరాజులు వచ్చి, ధర్మరాజును దర్శించుకొని విలువైన కానుకల్ని సమర్పించుకున్నారు. తమ్ములతో కలసి ధర్మరాజు అక్కడ సుఖంగా ఉంటున్నాడు. ఒక రోజు నారదమహర్షి పాండవుల వద్దకు వచ్చాడు. ధర్మరాజు నారదమహర్షిని పూజించి, సత్కరించాడు.

అప్పడు నారదుడు ధర్మరాజుతో ప్రత్యేకించి పరిపాలన గురించి ప్రస్తావించిన విషయాలు!



# ధర్మరాజా! ఈ మాటలు వినవయ్యా!


- డా॥ సాకం నాగరాజ, 94403 31016

ఒకరోజు నారదమహర్షి కొన్ని రాజనీతి విషయాల్ని గురించి ప్రత్యేకంగా ధర్మరాజును అడిగాడు. "ధర్మరాజా! మీ పూర్వీకులు ఏర్పరచిన ధర్మపద్ధతులను నీవు ఆచరిస్తున్నావు కదా! ప్రభుత్వఉద్యోగాల్లో యోగ్యులు, సమర్థులైనవాళ్లను నియమించావా? విశ్వాసపాత్రులు, వివేకవంతులైనట్టి పండితులను మంత్రులుగా నియమించుకున్నావా? రాజ్యనిర్వహణకు రహస్య మంత్రాంగాలు సాగిస్తున్నావా? దక్షులు, నమ్మకస్తులైన వారిని సైన్యాధ్యక్షులుగా నియమించావా?

ధర్మరాజా! నీ మంత్రులు, తమకున్న విశేష పలుకుబడితో హద్దులు మీరి, ఇతరరాజులతో చేతులు కలిపి, నీకు వ్యతిరేకంగా కుట్రలు పన్నే పరిస్థితి లేదు కదా! ఎందుకంటే ధనం ఎటువంటివాళ్లకైనా దురాశను, అహంకారాన్ని కలిగిస్తుంది. నీ ఆయుర్వేద వైద్యులు ప్రజలపట్ల ప్రేమతో వైద్యసేవలు సక్రమంగా అందిస్తున్నారా? వారు మనోవ్యాధులను, శారీరక వ్యాధులను నయం చేస్తున్నారా? ముఖ్యంగా పన్ను వసూళ్ల కోసం నిపుణులను, బుద్ధిమంతులను, నీతిమంతులను చక్కగా పరీక్షించి, ఉద్యోగాలలో నియమించుకున్నావు కదా!

మీ సేవకులందరికీ కొరతలేకుండా జీతభత్యాలు క్రమం తప్పకుండా అందజేస్తున్నావా? సకాలంలో జీతాలు అందకపోతే ఉద్యోగులు అనుభవించే బాధలు, దుఃఖాలు ప్రభువుకు తప్పక కీడు చేస్తాయిసుమా! అంతేకాదు. మంచి సేవకులను రాజు గుర్తించి, వారికి సన్మానాలు జరపాలి. నీకోసం యుద్ధంలో మరణించిన వీరసైనికుల కుటుంబాలకు కూడుగుడ్డ లోటు లేకుండా ఆదుకొని సంతోషపెట్టాలికూడా!

ధర్మరాజా! నీవు లోభులను, దొంగలను, దుర్మార్గులను పక్షపాతం చూపేవాళ్లను, అధైర్యస్థులను రాచకార్యాల నిర్వహణకు పంపడం లేదు కదా! నీ పరిపాలనలో దొంగల భయం అసలు లేదు కదా! అట్లే ప్రభుత్వఉద్యోగుల్లో కీలకవ్యక్తులు



ధనాశాపరులై దొంగల నుండి ధనం లంచంగా తీసుకుని, వాళ్లను రక్షించడం లేదు కదా! ఓ పుణ్యాత్మా! నీ రాజ్యంలో అనావృష్టిభయం లేకుండా చెరువులు నిండి పుష్కలంగా ఉన్నాయా? పేదరైతులకు విత్తనాలూ, వర్తకులకు నూటికి ఒక్క రూపాయి వడ్డీ వంతున అప్పులూ అందజేస్తున్నావు కదా! కుంటి వాళ్లు, మూగవాని, గుడ్డివాని, అంగవిహీనులను, దీనులను దయతో సంరక్షిస్తున్నావా? శరణు కోరినవారిని కాపాడుతూ, సత్పురుషులను సభల్లో సత్కరిస్తూ, పరిపాలన సజావుగా సాగిస్తున్నావా?

ధర్మరాజా! రాజు ఆదాయంలో నాల్గవభాగాన్ని లేదా మూడవభాగాన్ని లేదా సగభాగాన్నిమాత్రమే ఖర్చుపెట్టాలి కానీ అంతకు మించి ఖర్చు పెట్టకూడదని గ్రహించావా? ప్రభుత్వంలోని అన్నివిభాగాలలో సమర్థులు, నమ్మకస్థులనే నియమించడం అత్యంత ముఖ్యం. శత్రురాజుల పోకడలను గూఢచారులద్వారా కనిపెట్టుతూ ఉండాలి. మరొక్కమాట. ప్రపంచమంతా వార్త మీదే ఆధారపడి నడుస్తున్నది. వార్తా సమాచారాలు లేకుంటే ప్రజలందరూ గాఢాంధకారంలో ఉండి పోతారు. కనుక ప్రభువు వార్తలను ప్రజల్లో బాగా వ్యాప్తి చేయాలి.

ధర్మరాజా! భార్యవల్ల సంతానం కలుగుతుంది. ధర్మ శాస్త్రాలవల్ల సచ్ఛీలం, సత్ప్ర వర్తన, దానగుణం అలవడు తాయి. అంతేకాదు, నీ రక్షణలో ఉన్న కోటలన్నీ ధన ధాన్యాలు, అస్త్రశస్త్రాలు, యుద్ధ వీరులు, పుష్కలంగా నీళ్లు, పశువుల గడ్డి, వంటకట్టెలు, ఆహారపదార్థాలు సమకూరి తులతూగుతున్నాయా? కోట లన్నీ శత్రుదుర్భేద్యాలై ఉన్నాయి కదా! బలవంతులైన శత్రురాజులపట్ల సామ, దాన, భేద, దండోపాయాల్ని ప్రయో గించి వ్యవహరిస్తున్నావు కదా! మరీ ముఖ్యంగా చెప్తున్నాను. పధ్నాలుగు రాజదోషాలపట్ల రాజులు అప్రమత్తంగా ఉండాలి. అవి ఏవంటే- నాస్తికత, అసత్యమాడడం, ఏమరుపాటు, సోమరితనం, అజ్ఞానులతో కార్యాలోచన, అతికోపం, అధిక కాలం దుఃఖంతో గడపడం, చేయాల్సిన పనినిగురించి అతి దీర్ఘంగా ఆలోచించడం, సకాలంలో పనులు చేయకపోవడం, జ్ఞానుల్ని గుర్తించకపోవడం, వృథా ఆలోచనలతో నిర్ణయించిన పనులు చెయ్యకుండా వదిలిపెట్టడం, రహస్యాల్ని బయట పడకుండా కాపాడలేకపోవడం, పుణ్యకార్యాలు ఆచరించక పోవడం, ఇంద్రియసుఖాలకు లోనుకావడం అనే ఈ పదు నాలుగు రాజదోషాలను నీవు విడనాడావు కదా!" అని నారద మహర్షి ధర్మరాజును విపులంగా, విచారించాడు.

అందుకు ధర్మరాజు ఇలా బదులు చెప్పాడు. "నారద మునీంద్రా! చేతనైనంత వరకు నేను అధర్మమార్గాన్ని వదలి పెట్టి, మహాత్ముల చరిత్రల్ని ఆదర్శంగా పెట్టుకొని, పరిపాలన సాగిస్తున్నాను. ఇక మీ ధర్మబోధలవల్ల శుభకార్యాలన్నీ మనః పూర్వకంగా ఆచరిస్తాను" అని విన్నవించాడు.

***ఈ ఘట్టం రాజనీతికి ఓ గని వంటిది. అతిపురాతనకాలంనుంచే సంక్షేమకార్యక్రమాలు అమలు పరచడం కనిపిస్తుంది. ఉద్యోగుల జీతాలు, ప్రజల ఆరోగ్యం, పన్నుల వసూళ్లు, వ్యవసాయానికి నీళ్లు, ప్రభుత్వంలో విశ్వాసపాత్రులుండడం వంటి విషయాలు ఆనాడే కాదు ఈనాటికీ పరిపాలనలో ప్రాధాన్యం కలిగిన అంశాలే! సుపరిపాలనకు ఓ చిన్నపాటిప్రణాళిక ఈ ఘట్టం.***

ధారావాహిక - 1

# శ్రీమద్భగవద్గీత

- శ్రీ కుప్పా విశ్వనాథశాస్త్రి

శ్రీమద్భగవద్గీత యొక్క ఉపదేశాన్ని ఆ గీతామృతాన్ని ఆస్వాదించే ముందు ఈ గీతామృతం మనకై ఉద్దేశించిందే అన్న విషయాన్ని మనం చాలా స్థిరంగా, నిశ్చయంగా తెలుసుకో వలసిన అవసరం ఉన్నది.

దీనికై ఛాందోగ్యోపనిషత్తులో ఒక చిన్నకథ తెలుసు కోవాలి. ఒకసారి బ్రహ్మదేవుడు ఒక పెద్దసభ చేశారు. ఆ సభలో సభ్యులుగా ఉండేందుకు, శ్రోతలుగా ఉండేందుకు మూడురకాల శ్రోతలను పిలిచారు. దేవలోకంనుంచి దేవతలను, పాతాళం నుంచి రాక్షసులను, మనుష్యలోకంనుంచి కొంతమంది మనుష్యులను పిలిచారు.

వీరందరు సమావేశమైయున్నారు చాలా పెద్దసభ! చాలా మంది కూర్చున్నారు. ప్రజాపతి రాకకోసం చూస్తు న్నారు. వారు వచ్చారు వచ్చి కూర్చున్న తరువాత, కార్యక్రమం ప్రారంభించిన తరువాత "అయ్యా! మీరు మమ్మల్ని పిలిచిన కారణమేమిటి?" అని అందరు అడిగారు. "మాకేదైన ఉపదేశం చెయ్యండి" అని ప్రార్థించారు. ప్రజాపతి చాలా పెద్ద విషయం చెబుతారని అందరు ఎదురుచూచారు.

ఆయన "ద ద ద" అని మూడక్షరాలు ఉచ్చరించారు. ఏదో ప్రజాపతిగారు మంగళాచరణం చేసుకుంటున్నారు. గురుబ్రహ్మ అనే బదులు ఈ మాట అంటున్నారనుకున్నారు. ప్రజాపతి లేచిపోయారు. ఉపదేశం ఇంతవరకే 'ద ద ద!' బ్రహ్మ లేచి వెళ్ళిపోవలసి వచ్చింది.

ఎవరిళ్లకు వాళ్లు వెళ్లిపోయి ఈ రోజు బ్రహ్మగారు మనకు ఏమి ఉపదేశం చేశారు? అని ఆలోచించటం ప్రారంభించారు. అందులో దేవతలందరు కూర్చున్నారు. కూర్చుని మనకు ఏమి ఉపదేశం చేసి ఉండచ్చు బ్రహ్మ? అని విచారించుకోవటం ప్రారింభించారు. వారికి తోచింది బ్రహ్మ మన మనస్సుల్లోకి వెళ్లగలిగినవారు. ఆయన చాలా ఉన్నతుడైన దేవుడు. మన మనసులలో ఏముందో తెలుసు. మనం ఏరకమైన వాళ్లమని తెలుసు. అందువలన మనకు కావలసిన ఉపదేశం చేశారు. ఏమిటి మనకు కావలసిన ఉపదేశం చేశారు? ఏమిటి మనకు దేవతలు చాలా పుణ్యం చేసుకుంటే వచ్చేటి కలిగినవారు. ఆ పుణ్యంవలన మనకు కొంచెం అహంకారం వస్తుంది. కాబట్టి అహంకారం కూడదు అని ఉపదేశం చేసుంటారు. ఆ ఉపదేశానికి పేరు 'దామ్యత' దామ్యత అంటే కాస్త ఇంద్రియ నిగ్రహంలో ఉండండి అహంకారాదుల జోలికి పోబోకండి అని అర్థం.

అందువల్ల మనల్ని ఉద్దేశించి దామ్యత అని ఉపదేశం చేశారు అని దేవతలందరు తీర్మానించుకున్నారు. మరి మిగతా రెండు 'ద' లు ఏమి చేద్దాం 'దదద' అని మూడు 'ద' లు ఉన్నాయి గదా! అని మళ్లీ చర్చకు వచ్చింది. వారందరు ఒక 'ద' మనకు, రెండవ 'ద' మనుష్యులకి, మూడవ 'ద' రాక్షసులకి అని తీర్మానం చేసుకున్నారు.

అలా దేవతల చర్చాగోష్ఠి పూర్తి అయింది. రాక్షసులు చర్చాగోష్ఠి పెట్టుకున్నారు. వారుకూడ ఇలాగే ఆలోచించి బ్రహ్మ ఏమి ఉపదేశం చేసుంటారు? అని ఆలోచించి, ఆలోచించి విచారించి, కష్టపడి ఏమి తీర్మానం చేశారంటే మనలో 'దయ' తక్కువ. రాక్షసులకు 'దయ' చాలా తక్కువ. కొంచెం క్రూరంగా ఉంటారు. ఏమాత్రం కోపం వచ్చినా సరే ఎదుటివాళ్ల మీద పడిపోతుంటారు. యుద్ధాల్లో గూడ కొంచెం క్రూరంగా వ్యవహరిస్తుంటారు. అందువలన మనకు దయతో ఉండమని ఉపదేశం చేశారు- అని వాళ్లుతీర్మానం చేశారు. దయాళుత్వం అని వాళ్లు అర్థం చేసుకున్నారు. మరి మిగతా రెండు 'ద' లు మాటగూర్చి యేమిటి? అని దేవతలకు మనుష్యులకు- అని వాళ్లుకూడా కూర్చుంటారు కూర్చుని మనంకూడ విచారణ చేసుకుందాం చేసుకుంటే మనకేం ఉపదేశం చేసుండవచ్చు? అంటే మానవులలో కొద్దిగా పిసినారి తనం ఎక్కువ అనే అభిప్రాయం ఉన్నది. పిసినారితనం ఎక్కువ అనటానికి నిదర్శనం ఎమిటంటే వేదంలో ఒక చోట తపస్సు అంటే ఏమిటి? అని పెద్ద జాబితా ఇచ్చినసందర్భం ఉన్నది. తపస్సంటే ఏమిటి అంటే దానం చేయటం. దానం తపః. ఇలాంటివి చాలా సందర్భాలున్నాయి దానాన్ని తపస్సుగా చెప్పారు.

*(ఇంకా ఉంది)*

## ఆయుర్వేదం

# 'సొరకాయ' తో ఆరోగ్యభాగ్యం

- డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ

కేవలం ఆహారంగానేకాక ఔషధప్రాధాన్యతనూ సంతరించుకున్న ద్రవ్యాలలో చౌక ధరకు లభించే సొరకాయ ఒకటి. సర్వత్రా ఈ కూరగాయ లభ్యమవుచూ అన్ని వర్గాల ప్రజలకు అందు బాటులో ఉంటుంది. సొరకాయలో కొన్ని బాగా ఆకుపచ్చగాను, కొన్ని లేత పసుపు పచ్చగాను, మరికొన్ని లేత తెలుపురంగులో వుంటాయి. అట్లే పొడవుగా వుండేవి, గుండ్రంగా ఉండేవి అని రెండు రకాలుగా మనకు లభ్యమవుతాయి. ఆంగ్లంలో బాటిల్ గార్డ్ గాను, హిందీలో లౌకి గాను పిలువబడే దీని శాస్త్రీయ నామం లాజినేరియా సిసిరేరియా. ఇవి కుకుర్‌బిటేసి అను వృక్ష కుటుంబానికి చెందిన కూరగాయ.

సొరకాయను పప్పు, సాంబారు, చట్నీ, కూర, హల్వాల తయారీలో వినియోగించటం పరిపాటి. లేత సొరకాయలను వాడటంవల్ల మంచి ప్రయోజనం చేకూరుతుంది. సొరకాయను వివిధవ్యాధులలో ఔషధంగా ఎలా సద్వినియోగపడుతుందో తెలుసుకుందాం.

**మూత్రవిసర్జన ఇబ్బందులకు:** రోజు ఒకసారి 200 మి.లీ. నీటిలో తొక్కను తొలగించి చేసిన సొరకాయ పేస్టు 10 గ్రాములు, అర టీస్పూను జీలకర్ర, అర టీ స్పూను ధనియాలు, అర టీ స్పూను తాటి కలకండ కలిపి 100 మి.లీ. నీళ్ళు మిగిలేలా మరిగించి, దించి, చల్లార్చి, వడగట్టి సేవిస్తు ఉంటే మూత్రవిసర్జనలో మంట, మూత్రాన్ని నియంత్రించలేకపోవటం. మూత్రంలో రక్తంపోవటం, మూత్రం జారీగా రాకపోవడం లాంటి సమస్యలతో పాటు కడుపులో మంట తగ్గుతుంది. మధుమేహ వ్యాధిగ్రస్తులు తాటి కలకండ మినహా మిగిలిన వాటితో ఔషధం తయారు చేసుకొని వాడుకోవచ్చు.

**అధికబరువుకు:** ఉదయం పరగడుపున 100 మి.లీ. సొరకాయ రసంలో 25 మి.లీ. నీరు, ఒక గ్రాము దాల్చిన చెక్క నలగొట్టిన ముక్కలు, ఒక గ్రాము పసుపు, 3-4 చిటికెల ఉప్పు, 3-4 చిటికెల మిరియాలపొడి వేసి కొద్ది సేపు ఉడికించి, దించి, వడగట్టి త్రాగాలి. ఇలా వాడటం వల్ల ఆకలి నియంత్రించబడి బరువుతగ్గటంతో పాటు శరీరానికి హానిచేసే చెడు కొలెస్ట్రాల్ తగ్గి మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. గుండె ఆరోగ్యానికి మంచిది. రక్తనాళాల్లో అవరోధాలు కలుగకుండా కాపాడు తుంది.

**కలరా విరేచనాల వల్ల కలిగే నిస్సత్తువ, నిర్జలీకరణకు:** సొరకాయ రసం, కొబ్బరి నీరు సమానంగా కలిపి ఉంచుకుని వైద్య సలహామేరకు నిర్దిష్ట ఔషధాలతో పాటు 10 నిమిషాలకు ఒకసారి ఈ ద్రవాన్ని 30-60 మి.లీ. చొప్పున వాడుతుంటే చాలా త్వరగా ఆయా సమస్యల నుంచి కోలుకుంటారు.

**అతివేడి తగ్గేందుకు:** రోజు ఒకసారి 250మి.లీ. నీటిలో సొర కాయ పై చెక్కును ముక్కలుగా చేసి 100 గ్రాములు తీసుకొని అందులో పెసరపప్పు 10 గ్రాములు కలిపి అరగంట నానిచ్చి 100 మి.లీ. నీళ్ళు మిగిలేలా మరిగించి, దించి, చల్లార్చి, వడగట్టి సేవిస్తూ ఉంటే అమిత వేడి తగ్గుతుంది. ఎప్పుడు వేడి చేసినట్లు ఉండటం, దాహం, శరీరం మంటలు, కళ్ళుమంటలు, జ్వరం వచ్చినట్లు ఉండటం లాంటి రుగ్మతలు తగ్గిపోతాయి. కడుపు ప్రేవుల్లో ఏర్పడిన వ్రణాలు తగ్గటానికి కూడా ఈ ఆహార ఔషధం దోహదపడతుంది.



**నిద్రలేమి :** 200 మి.లీ. సొరకాయ రసం, 50 మి.లీ నువ్వులనూనె కలిపి రసం అంతా ఇరిగి నూనె మిగిలేటట్లు మరిగించి దించి, చల్లార్చి, వడగట్టి కేశ తైలంగా వాడుకుంటూ ఉంటే చక్కటినిద్ర కలుగుతుంది. తల చర్మం పొడిగా ఉండటం, కళ్ళ మంటలు కూడ తగ్గుతాయి. చేతులు, కాళ్ళకు లేపనం చేస్తుంటే చేతులు, కాళ్ల పగుళ్ళు కూడా తగ్గుతాయి.

**చర్మం మంటగా ఉంటే:** రోజు ఒకసారి సొరకాయ రసాన్ని లేపనం చేస్తుంటే అరికాళ్ళు, అరిచేతులు మంట, ఒళ్ళు మంటలు, ఒంటి దురదలు తగ్గిపోతాయి.

# భద్రగిరి రామయ్య...

– శ్రీమతి డి. వరలక్ష్మి

రామ అన్న రెండక్షరాలు చాలు సర్వపాపాలనూ ప్రక్షాళనం చేయడానికి. రాముణ్ణి ప్రేమించనివారుండరు. అందుకే తెలుగునాట రామాలయం లేని పల్లెటూరే ఉండదంటే అతిశయోక్తి కాదు. రామాలయాలు ఎన్ని ఉన్నా, తెలుగువారికి తరతరాలుగా భద్రాద్రిరాముడంటే ప్రత్యేకమైన ఆరాధన, భక్తి. ప్రస్తుతం కరోనా మహమ్మారి దేశమంతటా కాదు... ప్రపంచమంతటా మరోసారి విస్తరిస్తున్న నేపథ్యంలో భద్రాచలం వెళ్ల(లే)కున్నా ఆ భద్రాచల క్షేత్రప్రాశస్త్యాన్ని, అక్కడ జరిగే సీతారాముల కల్యాణవిశేషాలనూ చదువుదాం! ఆనంద గోదావరిలో ఓలలాడదాం!

దక్షిణాదిన ఓ అయోధ్యగా భాసిల్లుతున్న క్షేత్రం భద్రాచలం!

భద్రాచలం తెలంగాణ, ఖమ్మంజిల్లాలో, గోదావరినది దక్షిణతీరాన ఉన్న ఒక పట్టణం. జిల్లాకేంద్రమైన ఖమ్మం పట్టణానికి 105 కి.మీ.ల దూరంలో ఉన్న ఈ పట్టణం భక్త రామదాసు నిర్మించిన శ్రీరామాలయానికి ప్రసిద్ధి చెందింది.

## ఆలయ ప్రశస్తి

పూర్వం భద్రుడు అనే భక్తుడు తపస్సు చేసి, తను ఒక కొండగా మారి తనపై శ్రీరాముడు వెలసే విధంగా వరం పొందాడు. ఆ కొండకు భద్రుడి పేరుమీద భద్రగిరి అనీ, తరువాతి కాలంలో ఆ పట్టణానికి భద్రాచలం అనీ పేరు స్థిరపడింది.

గోల్కొండ నవాబు అబుల్ హసన్ తానీషా పాలన కాలంలో భద్రాచల ప్రాంతానికి కంచెర్ల గోపన్న తహశీల్దారుగా ఉండేవాడు. ఇక్కడికి సమీపంలోని నేలకొండపల్లి గ్రామానికి చెందిన గోపన్న శ్రీరామభక్తుడు. తాను ప్రజలనుండి వసూలు చేసిన పన్ను (ఆరులక్షల రూపాయలు) సొమ్మును ప్రభుత్వానికి జమ చెయ్యకుండా, భద్రగిరిపై శ్రీరాముడు వెలసిన ప్రదేశంలో ఈ రామాలయాన్ని నిర్మించాడు. దేవునికి చింతాకు పతకం, పచ్చలపతకంవంటి అపురూపమైన ఆభరణాలెన్నో చేయించాడు.

ఆ సొమ్ము విషయమై తానీషా గోపన్నను గోల్కొండ కోటలో బంధించగా, ఆ చెరసాలనుండి తనకు విముక్తి కల్గించుమని శ్రీరాముణ్ణి ప్రార్థించాడు గోపన్న. ఆ సందర్భంలో రామునిపై పాటలు రచించి పాడుకున్నాడు. ఇవే రామదాసు కీర్తనలుగా ప్రసిద్ధి చెందాయి. గోపన్న కీర్తనలకు కరిగిపోయిన రాముడు, దేవాలయనిర్మాణానికి ఉపయోగించిన ప్రభుత్వ ధనాన్ని తానీషాకు చెల్లించి, గోపన్నకు చెరసాలనుండి విముక్తి ప్రసాదించాడు. ఆ విధంగా కంచెర్ల గోపన్నకు “రామదాసు” అనే పేరు వచ్చింది.



## ఆలయ వర్ణన

దేవాలయంలో సీతా, లక్ష్మణ, హనుమత్ సమేతంగా శ్రీరామచంద్రుడు ఇక్కడ అత్మారాముని రూపంలో కొలువుతీరి ఉన్నాడు. సీత, రాముని తొడపై కూర్చొని ఉన్నట్లు ఇక్కడి విగ్రహాలు కొలువుతీరి కనిపిస్తాయి. మరే దేవస్థానంలోనూ లేని ప్రత్యేకత ఇది. ప్రతిసంవత్సరం శ్రీరామనవమికి వైభవంగా జరిగే సీతా రామకల్యాణఉత్సవానికి అశేషప్రజానీకం వస్తారు. తెలంగాణరాష్ట్రప్రభుత్వం ఈ కల్యాణోత్సవానికి ముత్యపు తలంబ్రాలు, పట్టువస్త్రాలు పంపించడం సంప్ర దాయం. రామదాసు చేయించిన వివిధరకాల ఆభరణాలు దేవస్థానప్రదర్శన శాలలో ప్రదర్శనకు ఉంచుతారు.

భద్రాచలంలోని శ్రీరాముణ్ణి వైకుంఠరాముడు అని అంటారు. ఎందుకంటే ఇక్కడి రాముడు వైకుంఠానికి వెళ్లిన తర్వాత మరల భూమి మీదకి వచ్చి, తన భక్తుడైన భద్రుని కోరిక తీర్చి, భద్రపర్వతంపై నిలిచాడు.

13న చైత్రశుద్ధపాడ్యమి ప్లవనామ సంవత్సర ఉగాది పండగ సందర్భంగా మూలమూర్తుల స్నపన తిరుమంజనం, ఉగాది ప్రసాదవితరణ, సాయంత్రం నూతన పంచాంగశ్రవణం, ఆస్థానం, శ్రీస్వామివారికి తిరువీథిసేవ, 17న మృత్సంగ్రహణం, వాస్తుహోమం, అంకురార్పణ, 18న భగవద్రామానుజజయంతి, గరుడధ్వజపట లేఖనం, ఊరేగింపు నిర్వహిస్తారు. 19న ధ్వజారోహణం, 20న యాగశాలలో చతుష్ట అర్చనలు నిర్వహించి, వేడుకగా ఎదుర్కోలు ఉత్సవం నిర్వహించనున్నారు.

రాముడిఆరాధనకు ఐదుపాత్రలు వినియోగిస్తారు. వీటికి పంచపాత్రలని పేరు. ఇందులో తీర్థంతోనే స్వామికి పరిపూర్ణమైన ఆరాధన చేస్తారు. అర్ఘ్యపాత్ర, పాద్యపాత్ర, ఆచమనీయపాత్ర, స్నానపాత్ర, శుద్ధోదకపాత్రతో ఆరాధన సమగ్రంగా ఉంటుందని నమ్మిక.

భద్రాద్రిరాముడి ఆరాధన ఇంత పరిపుష్టమయ్యేందుకు ఆ ఐదుగురు మహాభక్తుల పాత్రలు పంచపాత్రలుగా ఈ క్షేత్రంలో ప్రకాశిస్తున్నాయి. ఆ ఐదుగురే భద్రమహర్షి, పోకల దమ్మక్క, భక్తరామదాసు, తానీషా, తూము నరసింహదాసు. వీరివల్లే భద్రాద్రి విశ్వవిఖ్యాతమైంది.

### అర్ఘ్యపాత్ర: భద్రమహర్షి

**చిన్నతనంనుంచి రామభక్తుడై నారద మహర్షి ద్వారా శ్రీరామ తారకమంత్రాన్ని ఉపదేశంగా పొంది, దండకారణ్యంలో శ్రీరాముని సాక్షాత్కారం కోసం ఘోరతపస్సు చేశారు.**

**ఆ తపస్సుకు మెచ్చిన స్వామి ఇక్కడ అపూర్వమైన రీతిలో రామనారాయణుడి రూపంతో ప్రత్యక్షమయ్యారు. దీనికి కారణం భద్రుడికి ఏ కోరికా లేకపోవడం, రాముడు ఏదైనా వరం కోరుకోమని గట్టిగా ఆదేశించడంతో "స్వామి! నువ్వు ఏ రూపంలో నాకు సాక్షాత్కారం ఇచ్చావో అదే రూపంలో నా తదనంతరం భక్తులు తరించేందుకు అర్చామూర్తిగా ఉండ" మని కోరాడు. దీంతో స్వామిభద్రుని శిరస్సుపై వెలిశారు.**

**ఆ వరం ఫలితంగానే నేడు స్వామిని మనం దర్శించుకుంటున్నాం. తానే కొండగా మారి నేటికి భద్రాద్రిరాముణ్ణి తన శిరస్సుపై మోస్తూ, ఈ ప్రాంతాన్ని భూవైకుంఠంగా మార్చాడు. ఈ మహర్షి పాత్ర ప్రథమస్థానం పొందింది. శ్రీరాముని ఆరాధనలో అర్ఘ్యపాత్రగా విలసిల్లు తోంది.**

### పాద్యపాత్ర: పోకల దమ్మక్క

**కాగా 16వ శతాబ్దంలో పుట్టలో ఉన్న శ్రీరాముని పాదాలను పోకల దమ్మక్క కడిగి పాద్యపాత్రగా నిలిచింది.**

### స్నానపాత్ర: గోల్కొండ నవాబు

**ఏ సంప్రదాయస్థుడైనా శ్రీరాముని సాక్షాత్కారం పొందడంతో అతని శరీరమంతా పవిత్రమైంది. శ్రీరాముడి కటాక్షంతో పూర్తిగా స్నానం చేసి, పూర్వజన్మసుకృతంవల్ల చరిత్రలోనే ఎంతో ఘనకీర్తిని సాధించారు. దీంతో ఆయన స్నానపాత్రగా నిలచారు.**

### ఆచమనీయపాత్ర: భక్తరామదాసు

**ఖమ్మంజిల్లా నేలకొండపల్లికి చెందిన కంచర్ల గోపన్న పాల్వంచకు తహసీల్దారుగా ఉన్న సమయంలో భద్రాద్రి రామాలయం నిర్మాణానికి ఆరులక్షల రూపాయాలు వెచ్చించాడు. భద్రాద్రిరాముడికి దప్పిక వేస్తే కీర్తనలనే అమృతాన్ని తాగించిన మహనీయుడు భక్తరామదాసు. ఆయన ఎన్నో అమూల్యమైన అజరామరమైన కీర్తనలను రచించి గానం చేసి తరించారు. వేదమంత్రాలు స్వామికి ఎంత ఆనందాన్ని ఇస్తాయో రామదాసు కీర్తనలకు సైతం స్వామి అంతగా ఆనందిస్తారు. అందుకే ఆచమనీయపాత్రగా నిలిచారు.**

## వైకుంఠరాముడు... ఓంకారరాముడు... భద్రాచలరాముడు

శ్రీరాముడికి చాలా పేర్లు ఉన్నట్లే, భద్రాచలంలోని స్వామి బహునామధారి. రామనారాయణుడు, వైకుంఠరాముడు, మోక్షరాముడు, భద్రాచలరాముడు, ఓంకార రాముడిగా భక్తులు కొలుస్తారు.



మేరువు అనే పేరు గల పర్వతరాజు, మేనక అనే అప్సరకాంతకు జన్మించినవాడే భద్రుడు. అతడు శిలారూపంలో దండకారణ్యంలో తపస్సు చేసుకునేవాడు.

వనవాసవేళ అయోధ్య రాముడు సీతాలక్ష్మణులతో దండకారణ్యానికి వెళ్లినప్పుడు, కొంతసేపు భద్రగిరిపై అలసట తీర్చుకుంటాడు. అప్పుడు భద్రుడు సంతోషించి, తనమీద శాశ్వతంగా కొలువుండాలని ప్రార్థించడంతో శ్రీరామచంద్రుడు అంగీకరిస్తాడు. రావణవధానంతరం రాముడు అయోధ్యలో పట్టాభిషిక్తుడవుతాడు. అవతారం తదుపరి వైకుంఠం చేరిన ఆయన, తిరిగి భద్రుడి కోరికమేరకు సీతాలక్ష్మణ సమేతంగా భద్రగిరిపై వెలశాడని ప్రతీతి.

అకార, ఉకార, మకారాలకు ప్రతిబింబాలుగా శ్రీరాముడు, మధ్యలో సీతాదేవి, లక్ష్మణుల విగ్రహాలు ఉంటాయి. అందుకే స్వామి ఓంకార రాముడయ్యాడు. దర్శించుకున్నవారికి మోక్షం ప్రసాదించే రాముడని; నాలుగుచేతులు, శంఖచక్రాలతో వెలసినందున రామనారాయణుడని అంటారు. వైకుంఠంనుంచి రామరూపంలో వచ్చినందున వైకుంఠరాముడని భక్తులు విశ్వసిస్తారు.

### శుద్ధోదకపాత్ర: తూము నరసింహదాసు

**ఎన్నో ఒడిదుడుకులు ఉంటే సరిచేసి ఆలయాన్ని అభివృద్ధిపథంలో నడిపి రామదాసు ఆశయాలను నెరవేర్చారు. ఆగమ, వైష్ణవసంప్రదాయాలను కొనసాగించి, పదిరకాల ఉత్సవాలకీర్తనలతో ఆరాధనలు జరిగేలా చేశారు. కాబట్టే ఆయన శుద్ధోదకపాత్రగా నిలిచారు.**

## ఆలయాన వెలసిన సుదర్శన చక్రం

**భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి దేవస్థానం గర్భగుడిపై ఉన్న సుదర్శన చక్రం ఎవరూ తయారుచేసింది కాదు.**

**మరి ఇది ఎలా వచ్చిందంటే...**

**భక్తరామదాసు తాను ఆలయం నిర్మించిన తర్వాత ఆలయం పైభాగాన సుదర్శన చక్రం ప్రతిష్ఠించడానికై గొప్ప గొప్ప లోహ శిల్పులను తెప్పించి, వారిచేత సుదర్శన చక్రాన్ని తయారుచేయిస్తున్నాడు. కానీ, వారు ఎన్నిసార్లు ప్రయత్నించినా అది విరిగిపోవటమో, లేదా సరిగా రాకపోవడమో జరుగుతోంది.**

**కలత చెందిన రామదాసు కలలో ఆ రాత్రి శ్రీరామచంద్రుడు ప్రత్యక్షమై "భక్తా!! సుదర్శనచక్రం అంటే చాలా మహిమాన్వితమైంది. దాన్ని సామాన్య మానవులు నిర్మించ లేరు. అందుకే నేను నీకు నా సుదర్శనచక్రాన్ని ఇస్తున్నాను అది గోదావరిలో ఉంది తెచ్చి ప్రతిష్ఠించు" అని చెప్పాడు.**

**మరునటిరోజు గజఈతగాళ్లతో రామదాసు వెతికించాడు. కానీ కనిపించలేదు.**

**మళ్లీ రాముడు కలలో కనిపించి 'అది నామీద అమితమైన భక్తిని పెంచుకున్న నీకుమాత్రమే కనిపిస్తుంది' అని చెప్పడంతో స్వయంగా రామదాసే వెళ్లి, గోదావరి మాతకు నమస్కరించి, శ్రీరామచంద్రుణ్ణి స్తుతించి, గోదావరిలో చేతులు పెట్టగా వచ్చి ఆ సుదర్శనచక్రం చేతిలో నిలిచింది.**

**ఆ సుదర్శనచక్రమే ఇప్పుడు మనం చూస్తున్నది.**

## పరిసరాలు- పర్యాటక స్థలాలు

**కిన్నెరసాని:** **భద్రాచలం పట్టణంనుండి 32కి.మీ.ల దూరంలోని కిన్నెరసానినదిపై ఒక డ్యాము, జింకల పార్కు ఉన్నాయి.**

**పర్ణశాల:** **వనవాస సమయంలో శ్రీరాముడు ఇక్కడ ఉన్నాడని, ఇక్కడినుండే సీతను రావణుడు అపహరించాడని స్థానిక కథనం.**

**పాపికొండలు:** **సుందరమైన గోదావరినది, కొండలు, ఆహ్లాదకరమైన వాతావరణం. భద్రాచలం నుంచి పడవలో ఇక్కడికి వెళ్లే సౌకర్యం ఉంది.**

భద్రాచలం దగ్గరి భద్రిరెడ్డిపాలెంలోని శబరివర్గం పోకలదమ్మక్క మొట్టమొదట రాముడికి పందిరి వేసి, భక్తితో కొలిచింది. నేలకొండపల్లి గ్రామంలో జన్మించినవాడు కంచర్ల గోపన్న. ఆయన మేనమామలు అక్కన్న, మాదన్న గోల్కొండ కోటనవాబు తానీషా వద్ద మంత్రులుగా ఉండేవారు. వారు గోపన్నను సమీపపరగణాకు అధికారిగా నియమిస్తారు. అప్పుడు ఆయన శ్రీరాముడి విగ్రహాన్ని దర్శించుకొని, అక్కడ ఆలయనిర్మాణానికి సంకల్పిస్తాడు.

గోపురం, ప్రాకారం, అంతరాలయనిర్మాణాలకు ఎంతో వ్యయమౌతుంది. అంతేకాక గోపన్న చింతాకు, పచ్చల పతకాలు; కిరీటాలు, ఇతర ఆభరణాలు అనేకం చేయిస్తాడు. కల్యాణంతో పాటు స్వామికి ఉత్సవాలు జరిపించడంతో, ప్రభుత్వధనం



వాడుకున్నాడంటూ గోపన్నను తానీషా కారాగారంలో బంధిస్తాడు. పన్నెండేళ్ల కఠిన కారాగారవాసం అనుభవించిన గోపన్న అనేకకీర్తనల్ని ఆశువుగా ఆలపిస్తాడు. దాశరథీశతకాన్ని రచిస్తాడు. ఆ భక్తికి మెచ్చిన రామలక్ష్మణులు తానీషాకు దర్శనమిచ్చి, బంగారు మొహరీలతో బాకీ తీర్చారు. అప్పటినుంచి అందరూ గోపన్నను రామదాసుగా కీర్తించారు.

గోదావరితీరంలోని భద్రాచలానికి సమీపంలో రాముడు పర్ణశాల నిర్మించాడని, అక్కడే సీతను రావణాసురుడు అపహరించాడని చెబుతారు. జింకరూపంలో వచ్చిన మారీచుణ్ణి శ్రీరాముడు వధించినప్పుడు, ఎక్కువ దుమ్ము రేగిన ప్రదేశమే దుమ్ముగూడెం అయిందని భక్తుల విశ్వాసం. జటాయువురెక్క పడిన చోటు జటపాక అని భావించి దర్శించుకుంటారు. భద్రాచల ఆలయం సుందరమైంది. గోదావరినదీతీరంలోని ఇది భక్తివిశ్వాసాలకు ప్రసిద్ధి. ఈ గుడి నిత్యోత్సవాలతో, ప్రత్యేకించి ఆరుబయట జరిగే కల్యాణవేడుకతో ప్రఖ్యాతి పొందింది.

ఇంతటి ప్రాశస్త్యం ఉన్నది కనుకనే భద్రాద్రి మహా పుణ్యక్షేత్రమై విలసిల్లుతోంది. భద్రాద్రిరాముడి కల్యాణాన్ని స్వయంగా చూచినవారికి, ఆ గాథను పఠించినవారికి పుణ్య ఫలం లభిస్తుందని పెద్దలు చెప్పారు. కాబట్టి అందరికీ ఆ భద్రాద్రి సీతారాముల అనుగ్రహం లభించాలని కోరుకుందాం!!

### వైకుంఠపాళి

### :: 63 - సమాధానాలు ::

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | 1 కౌ | 2 స | ల్య | | 3 తా | 4 ప | సి | |
| 5 సుం | | తి | | 6 న | | థం | | 7 అ |
| 8 ద | య | | 9 వి | రు | లు | | 10 గు | హ |
| ర | | 11 శ | | లు | | 12 క | | ల్య |
| | 13 అ | బ | ల | | 14 మా | రు | తి | |
| 15 మా | | రి | | 16 త్రి | | ణ | | 17 గా |
| 18 త | ల్లి | | 19 అ | జ | ము | | 20 సీ | త |
| లి | | 21 ఆ | | ట | | 22 వే | | మి |
| | 23 య | శ | స్వి | | 24 తా | ట | కి | |

# భారతీయ హృదయనాదం

- శ్రీ కె.జానకిరామావధాని,
90320 44114

వేదాలు అనంతమైన విజ్ఞానానికి నిలయాలు. ఆద్యంతాలు లేని అనంతమైన విశ్వరహస్యాలకు దర్పణాలు. ఆత్మ, పరమాత్మల సంయోగానికి వారధులు. కన్ను తెరచిన క్షణం నుంచి కన్నుమూసేవరకు మనిషిని చేయి పట్టుకుని నడిపించే మార్గదర్శకాలు. జీవితసాగరగమనంలో దారి తెలియక కొట్టుమిట్టాడుతున్నవారికి జ్ఞానమార్గాన్ని ప్రకటించే అనంతచైతన్యదీపాలు.

రాయిరప్పా, గొడ్డూగోదా, దయ్యం దైవం, మనిషీ రాక్షసుడు, సృష్టిలోని ప్రతిప్రాణి గురించి వేదం చెప్పింది. ఇంతటి సమున్నతమైన వైజ్ఞానికసంపదను సొంతం చేసుకున్న ఘనత కేవలం మనదేశానికిమాత్రమే దక్కింది. మన దేశాన్ని విశ్వగురుస్థానంలో నిలబెట్టినవి వేదాలే. ఇది మనకు మనంగా చేసుకుంటున్న సొంతప్రచారంకాదు యావత్ప్రపంచం శిరసువంచి పాదాభివందనం చేస్తున్న ఘటనలే ఇందుకు నిదర్శనం.

మన వేదాలు మతసంబంధ అంశాలు కాదు.. జీవనమార్గదర్శకాలు. జీవితంలోని ప్రతిదశలో మనిషి నడవడిక, గుణగణాలు ఎలా ఉండాలో నిర్దేశించే నియమాలు. సమాజంలో ముఖ్యభూమిక పోషించే యువత సరైన దారిలో ఉంటే అభివృద్ధి సుసాధ్యమౌతుంది. లోకకల్యాణానికి నాంది ఇక్కడే పడుతుంది.

అందుకే వేదాల్లో యువతీయువకులకు అనేకమార్గదర్శకసూత్రాలున్నాయి. తల్లిదండ్రులపట్ల వ్యవహరించాల్సిన తీరు దగ్గరినుంచి అలవాట్లు, గుణగణాలవరకు ఎన్నో సందేశాలను వేదాలు అందిస్తున్నాయి.

వ్రతేన దీక్షా మాప్నోతి - దీక్షయాప్నోతి దక్షిణామ్
దక్షిణా శ్రద్ధా మాప్నోతి - శ్రద్ధయా సత్య మాప్యతే
(యజు. 19-30)

యువతీయువకులు కార్యసాధనలో అందరికంటే ముందుంటారు. వారి సంకల్పాలు మొగ్గదశలో ఉంటాయి. సంకల్పం వ్రతంగా మారి, వారిని దీక్షాబద్ధులను చేస్తుంది. దీక్ష అంటే పట్టుదల. పట్టుదల ఉన్నప్పుడే కార్యం నిర్విఘ్నంగా సాగుతుంది. విజయాన్ని అందిస్తుంది. దాని వల్ల ప్రతిష్ఠ కలుగుతుంది. ప్రతిష్ఠతో ఆగక, సత్కార్యాచరణలో యువకులను ముందుకు తీసుకుని వెళ్లగలిగింది శ్రద్ధ. శ్రద్ధ అంటే సత్యనిష్ఠ. మొత్తం మీద యువత సంకల్ప వ్రతం లోకకల్యాణార్థం ఉద్దేశింపబడి సత్ఫలితాలనిస్తుంది.

పుత్రులు తమ తల్లిదండ్రులను, శిష్యులు తమ గురువులను, కోడళ్లు అత్తామామలను సముచితంగా సత్కరిస్తూ వారిని సంతృప్తిపరిచి ఆశీర్వాదం పొందాలని వేదం ఉపదేశిస్తుంది. ముఖ్యంగా గురుకులాల్లో ఉన్నంతకాలం బాలబాలికలు బ్రహ్మచర్యాన్ని పాటించి, కావలసిన విద్యలను నేర్చుకోవాలని, అందుకు గురువులకు ఎంత దక్షిణ ఇచ్చినా అది తక్కువేనని వేదం ప్రబోధిస్తుంది. బ్రహ్మచర్యం అనేది దేశాన్ని పాలించే రాజుకు ఎంత అవసరమో, ఆచార్యులకు అంతే అవసరమని అథర్వణవేదం నొక్కి చెబుతుంది.


బ్రహ్మచర్యేణ తపసా - రాజా రాష్ట్రం విరక్షతి
ఆచార్యో బ్రహ్మచర్యేణ - బ్రహ్మచారిణ మిచ్ఛతి
(11.3-5-17)



గురుకులాలు మానవనిర్మాణానికి మంచి శిక్షణ కేంద్రాలు. ఆచార్యులు యువతను మంచిదారిలో పెట్టడానికి నిరంతరం కృషి చేయాలని యజుర్వేదం ఉపదేశిస్తుంది. శాస్త్రవేత్తలు, యుద్ధవిద్యలో నేర్పరులు, శత్రునిర్మూలనం చేసే అతిరథులు మహారథులు, నిర్భయత్వానికి మారుపేరుగా నిలిచే యువతీయువకులు జన్మించాలనే సంకల్పం అటు రాజుకు గాని, ఇటు తల్లిదండ్రులకు గాని ఉండాలని వేదం ఉపదేశిస్తుంది.

## ఆరు సుగుణాలు...

వేదం ప్రబోధించే అంశాలను గమనిస్తే దేశం ఎంత సుభిక్షంగా ఉండాలో తెలుస్తుంది. వేదం ప్రకారం యజ్ఞానికి ఎంత ప్రాశస్త్యం ఉందో, యజ్ఞానంతరప్రార్థనకు కూడా అంతే ఉందనిపిస్తుంది. యజ్ఞానంతరప్రార్థన ఆరు



సుగుణాలను ప్రస్తావిస్తుంది. అవి ముఖ్యంగా యువతను దృష్టిలో పెట్టుకొని చెప్పినవే అన్పిస్తుంది.

మొదటిది తేజస్సు. విశేషమైన జ్ఞానం అని దాని అర్థం. యువతకు మొదట కావాల్సింది జ్ఞానం. దాన్ని సంపాదించుకోవడానికి ప్రయత్నించాలి. రెండవది వీర్యం. వైదికపరిభాషలో పరాక్రమమని దాని అర్థం. ఏ దేశమైనా బతికి బట్టకట్టాలంటే కేవలం విద్వాంసులవల్లనే సాధ్యం కాదు. పరాక్రమవంతులైన యువతీయువకులెందరో అవసరం. మూడవది బలం. ఈ బలం శారీరకమైంది కావచ్చు. మానసికమైంది కావచ్చు. ఈ రెండింటికంటే ఉత్తమమైంది ఆత్మబలం. ఈవిధమైన త్రివిధబలాలు యువతకు ఎంతో అవసరమని తెలుసుకోవాలి.

ఇదే వేదం చేసే ప్రబోధం.

నాల్గవది ఓజస్సు. దీనికి సామర్థ్యం అని పేరు. ఏ రంగంలో ప్రవేశించినా చివరికు యుద్ధరంగంలో ప్రవేశించినా నేర్పు అవసరం. కనుక దాన్ని సాధించాల్సిన అవసరం యువతకు ఎక్కువగా ఉందనేది నిర్వివాదం.

ఐదవది మన్యువు. క్రోధమని దానికి అర్థం. కోపానికి, క్రోధానికి భేదం ఉంది. కారణం లేకుండా వచ్చేది కోపమైతే, కారణసహితంగా ఆవిర్భవించేది క్రోధం. క్రోధం లేకపోతే శత్రువును నిర్జించటం సాధ్యం కాదు.


ఆరవది సహనం. ఓర్పు అని దాని అర్థం. ఎంత క్రోధం ఉన్నప్పటికీ అంత సహనశక్తి అవసరమని తెలుసుకోవాలి. సమాజంలో ముఖ్యంగా యువత అలవర్చుకోవాల్సిన అత్యంతావశ్యకమైన సుగుణాలే వైదికప్రార్థనలో చోటు చేసుకోవడం విశేషం.

వేదం పదే పదే తేజస్సు గురించి, ఓజస్సు గురించి చెప్పడమే కాకుండా సభల్లో చక్కగా, ఇతరులకు ఆదర్శంగా ఉండగలిగిన యువరత్నాలను పేర్కొంటుంది.

## మాతాపితలు... మాతృభూమి

తల్లిదండ్రులు బాలుర విషయంలో ఏ విధంగా వ్యవహరిస్తారో, బాలికల విషయంలోనూ అలాగే వ్యవహరించాలనిచెప్పడం వేదం గొప్పతనం. గురుకులంలో అమ్మాయిలు బాగా చదువుకొని యువావస్థను పొందిన తర్వాతనే స్వయంవరంద్వారా యువకులను వివాహమాడాలని ప్రబోధిస్తుంది. ప్రపంచానికి ఉపయోగపడే యువతీయువకుల్ని గురుకులాలు తయారుచేయాలని వేదం ఆజ్ఞాపిస్తుంది. తల్లిదండ్రుల ఆస్తులు పిల్లలవి అయినట్లే, పిల్లల ఆస్తిపాస్తులు తల్లిదండ్రులవై ఉండాలని, పిల్లలు వయసు రాగానే వృద్ధులైన తల్లిదండ్రులను దూరం చేయరాదని, జీవితాంతంవారిని కనిపెట్టుకొని ఉండాలని ఉద్బోధిస్తుంది.

తల్లిదండ్రులు యువతను చెడుసహవాసాల నుండి దూరంగా ఉంచాలని, సత్సంగాలద్వారా, ధార్మిక



శిక్షణ ఇప్పించి, వారిని మంచిపౌరులుగాను, కీర్తి మంతులుగాను తయారు చేయాలని యజుర్వేదం చెబుతుంది. యువతీయువకులు తమ తల్లిదండ్రుల్లోని, ఆచార్యుల్లోని మంచిగుణాలనే స్వీకరించి, దుర్గుణాలను త్యజించాలని, అయితే సుఖదుఃఖాల్లోమాత్రం భాగస్వాములై ఉండాలని, దుఃఖనివృత్తికోసం ప్రయత్నించాలని ఉపదేశిస్తుంది.

తల్లిదండ్రులకు, యువతీయువకులకు గల అనుబంధం సూర్యచంద్రుల వంటిది. తల్లిదండ్రులది సూర్య ప్రకాశమైతే, పిల్లలది చంద్రుని ప్రకాశం. ఇద్దరివల్ల భూమికి అనగా లోకానికి ఆనందం కలగాలని వేదం ఉపదేశిస్తుంది. ఏ తల్లిదండ్రులు పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పి, ఉత్తమ శిక్షణ ఇస్తారో, వారు తమ సంతానంచేత సంపూర్ణమైన సేవలు పొందడానికి అర్హులని చెప్పడం గమనార్హం.

వేదం అన్నిసుఖాలు వ్యవసాయంలోనే ఉన్నాయని ప్రతిపాదిస్తుంది. 'కృషిమిత్ కృషస్వ' వ్యవసాయం చేయమని చెబుతూనే జూదం మొదలైన వ్యసనాల వైపు మనసును మళ్లించ కూడదని ఆదేశిస్తుంది. యువత మాతృభూమి పరిరక్షణలో ఎట్లా వ్యవహరించాలో కర్తవ్యోపదేశం చేస్తుంది. అమృతపుత్రులుగా సంబోధించడంలోనే వేదం వారిలో ఉత్సాహాన్ని నింపుతుంది. యువతీయువకులు భవిష్యత్తులో రాణించాలంటే గత చరిత్రలను కూడా తెలుసుకొమ్మంటుంది వేదం.

యస్యాం పూర్వే పూర్వ జనా విచక్రిరే
యస్యాం దేవా అసురా నభ్య వర్తయన్
(అథర్వ. 12-1-5)

మాతృభూమిని రక్షించుకోవడంలో మన పూర్వికులు ఎలాంటి శౌర్యపరాక్రమాలు ప్రదర్శించారో, శత్రువులనెట్లు పారద్రోలారో, లేదా దేశం కోసం బలైనారో, తత్సంబంధమైన చరిత్రలను తెలుసుకోవాలని చెప్పటమే వేదం గొప్పతనం.

ముఖ్యంగా మూడు విషయాల్లో మనిషి శ్రద్ధ కలిగి ఉండాలి. ఇలా సరస్వతీ, మహీ తిస్రో దేవీర్మయో భువః బర్హిః- సదిన్త స్త్రిధః (ఋగ్వేదం 1-13-9).- మాతృభూమి, మాతృభాష, మాతృ సంస్కృతి ఈ మూడువిషయాల్లో యువతకు అవగాహన అవసరమని వేదం ఉద్బోధిస్తుంది. పిల్లలు తల్లి పాలు తాగడంవల్ల పిల్లలకు తల్లిమీద ప్రేమ ఉన్నట్లే జన్మభూమినుంచి కావాల్సిన పదార్థాలను పొందడంవల్ల యువతకూడా మాతృభూమి మీద ప్రేమ చూపాలనడం సముచితమే!

దేశాన్ని తల్లిగా భావించేవారిలో ఉత్తమ, మధ్య మాధమ భేదాలు ఉండవనీ, యువత శత్రువునెదిరించడంలో ముందుండాలనీ వేదం కోరుతుంది.

## ఆరు దుర్గుణాలు వదలండి

వేదం ఆత్మరక్షణలో పిడుగులు మీద పడినా, అడుగులు తడబడరాదని, అందుకు అంతర్గతశత్రువులైన ఆరుగురిని జయించాలంటుంది. ఆ ఆరుగురు శత్రువులెవరో కాదు, ఆరు దుర్గుణాలే. అవి కామం, క్రోధం, లోభం, మోహం, మదం, మాత్సర్యం.

యువత ఎప్పుడుకూడా పని చేయకుండా ఉండరాదని, ఎవరు ఇతరులపై ఆధారపడి జీవిస్తారో వారు భగవంతునికి శత్రువులని 'అకర్మాదస్యుః' అని వచనం.

"అభయం మిత్రాత్- అభయ మమిత్రాత్" అని వేదం చెప్పడంవల్ల యువతీయువకులు తమ స్నేహితుల నుంచి ఎల్లవేళల జాగ్రత్తగా ఉండాలనే సూచన అందుతుంది.

గృహలక్ష్మి

# ఆరు రుచుల్లో అద్భుత విజ్ఞానం

– డా॥ కప్పగంతు రామకృష్ణ

మానవజీవనానికి, కాలానికి ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకునే ఆనందవేళ ఉగాది. కాలాన్ని గుణిస్తూ, మారుతున్న ఋతువులకు అనుగుణంగా జీవితాన్ని తీర్చిదిద్దుకోవాలనే సందేశాన్ని ఉగాది అందిస్తుంది. సహనానికి, వ్యక్తిత్వవికాసానికి, మనోవికాసానికి ఆలవాలంగా నిలుస్తుంది. ఆశలు చిగురుల వంటివి. అవి ఎప్పుడూ వికసిస్తూ ఉండాలి. అలా కోరుకోవటమే నిత్యవసంతం అవుతుంది. ఎల్లప్పుడూ మంగళధ్వనులు వినాలనే తపనకు ప్రతిరూపమే కోకిలకూత. ఈ విధంగా ఉగాది పండుగ మనిషిజీవనంలో కీలకంగా, మూలకంగా ఆవిర్భవించింది. ఉగాదిపండుగ పునరుజ్జీవనానికి సంకేతం. అప్పటి వరకు మోడుబారినచెట్లు, తీగెలు ఉగాదిరాకతో మళ్లీ చిగురించి పూలు, కాయలతో కళకళలాడినట్లు కష్టనష్టాలతో క్రుంగిపోతున్న మనిషి జీవితం ధైర్యంతో, ఆశతో ముందుకుసాగాలనే సందేశాన్ని అందిస్తుంది.

## ఆరు రుచులు... ఆరు శత్రువులు

ఉగాది పండుగలో అన్నిటికన్నా విశేషమైంది ఉగాది పచ్చడి. మిగిలిన పండుగల్లో పిండివంటలు చేసుకుంటే ఉగాది రోజున పచ్చడి చేసుకుంటాం. అదికూడా పూర్తిగా స్వాభావికంగా. ఏవిధంగానూ పచనం (వండటం) చెయ్యకుండా తీపి, పులుపు, చేదు, వగరు, ఉప్పు, కారం అనే ఆరురకాలరుచులు అందించే పదార్థాలు కలిపి తయారుచేసే పచ్చడి ఇది.

ఈ రుచుల్ని కలపటానికీ ఓ లెక్క ఉంది. తీపి, కారం సమానంగా కలపాలి. వీటి మోతాదుకు సగభాగం పులుపు, వగరు, వీటికి సగభాగం ఉప్పు, చేదు కలపాలి. మానవజీవితం అన్ని రుచుల కలయిక. అన్ని రుచులూ కలిస్తేనే మనిషి శరీరం సమగ్రవికాసాన్ని అందుకుంటుంది. మనస్సు విశ్వతోముఖంగా ప్రసరిస్తుంది. అందుకే ఉగాది రోజున ఆరు రుచుల పచ్చడిని ప్రసాదంగా అందజేస్తారు. మధురానుభూతుల తీపి, కష్టాల చేదుసమస్యలతో మ్రింగుడుపడని కారం, బాధల ఉప్పు, కడగండ్ల పులుపు, అపజయాల వగరు మానవజీవితంలో సహజ రుచులు. వీటిని సమన్వయం చేసుకుని, అనుకూలంగా రంగరించుకుని ప్రయాణించటమే జీవనం.

ఉగాది పచ్చడిలో ఉపయోగించే పదార్థాలన్నీ శరీరంలో సమతూకాన్ని, ఆరోగ్యాన్ని పెంపొందింపజేస్తాయి. సంవత్సరం పొడవునా జీవితంలో ఏర్పడే కష్టనష్టాలు, సుఖసంతోషాలను సమానంగా స్వీకరించి, ముందుకుసాగాలనే తాత్త్వికసందేశం ఉగాదిపచ్చడిలో ఉంది.

నాలుకను నడిపించేది మనస్సు. కనుక ఉగాది పండుగ మనసుకు హెచ్చరిక చేస్తుంది. నాలుక ఏ ఒక్క రుచికో అలవాటు పడకుండా, అన్ని రుచులనూ సమానంగా స్వీకరించాల్సిన కర్తవ్యాన్ని ఉగాది పచ్చడి బోధిస్తుంది. అన్ని ప్రాణులకు కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు ఉంటాయి. వీటినే అరిషడ్వర్గాలు అంటారు. వీటిల్లో ఏ ఒక్క గుణం హద్దు మీరినా అది దుర్గుణంగా మారి, అదే మనిషికి శత్రువుగా మారుతుంది. వాటికి లొంగిపోకుండా మనిషిని జాగృతపరచటమే ఉగాది పచ్చడి అందించే సందేశం.

తీపి కామానికి, కారం క్రోధానికి, ఉప్పు మోహానికి, పులుపు లోభానికి, చేదు మదానికి, వగరు మాత్సర్యానికి సంకేతాలు. మనం తినే పదార్థాలు ఏవైనప్పటికీ ఈ ఆరు రుచుల్లోకే వస్తాయి. ఏదో ఒక రుచి లేకుండా మనం ఏ పదార్థాన్ని తినలేం. కాబట్టి, అన్నిరుచులను సమీకరించుకుని తింటే మనం గెలిచినట్లు. ఏదో ఒక రుచిని మాత్రమే మెచ్చుకుని, దాన్నే తీసుకుంటే ఓడినట్లు.

## మధురం / తీపి (బెల్లం)

ఉగాది పచ్చడిలో తొలి అంశం మధురం (తీపి). తీపికి ప్రతీకగా ఉగాది పచ్చడిలో కొత్త బెల్లాన్ని కలుపుతారు. తీపి ఆనందానికి గుర్తు. మనకు ఆనందం కలిగినప్పుడు మిఠాయిలు పంచుతాం. అంటే, ఒక వ్యక్తి తీపి పంచుతున్నాడంటే అతనికి ఆనందం కలిగినట్లు సంకేతం అందుకోవచ్చు. మనం ఉద్యోగం, వ్యాపారం, వ్యవసాయం... ఇలా ఏ పని చేసినా అంతిమంగా ఆశించేది ఆనందమయమైన జీవితమే! ఆనందమే మనిషి జీవితానికి పరమార్థం. అందుకనే ఆనందాన్ని నలుగురితో



ఉగాది పండుగలో అన్నిటికన్నా విశేషమైంది ఉగాది పచ్చడి

పంచుకోవాలని పెద్దలు చెబుతుంటారు. అటువంటి ఆనంద మయజీవితం ఈ ఏడాదంతా కావాలని సంకేతరూపంలో చెప్పేదే ఉగాదిపచ్చడిలోని మధురపదార్థం.

మరోకోణంలో తీపి కామానికి సంకేతం. కామం అంటే కోరిక. మనిషికి కోరిక ఉంటేనే చైతన్యంగా ఉంటాడు. అంత మాత్రాన కోరిక హద్దుమీరకూడదు. అందుకనే ఉగాది పచ్చడిలో సగభాగంమాత్రమే తీపి కలపాలని నియమంపెట్టారు. వైద్య పరంగా కొత్తబెల్లం (తీపి) శరీరంలో ఉండే వాత, పిత్తధర్మా లను అదుపులో ఉంచుతుంది. దప్పిక, మూర్ఛలను తొలగి స్తుంది. మంటలనుంచి శరీరానికి ఉపశమనం కలిగిస్తుంది. రక్తాన్ని శుద్ధిచేస్తుంది.

## లవణం (ఉప్పు)

ఉప్పు ఉత్సాహానికి ప్రతీక. మనిషి ఎల్లప్పుడూ ఉత్సా హంగా ఉండాలి. ఏదో కోల్పోయినట్లు నీరసంగా ఉండే వ్యక్తి ఏ లక్ష్యాన్ని సాధించలేడు. ఉత్సాహవంతుడైన వ్యక్తిమాత్రమే తన లక్ష్యాన్ని చేరుకోగలుగుతాడు. మనిషి జీవితానికి తప్పని సరిగా ఏదో ఒక లక్ష్యం ఉండాలి. ఆ లక్ష్యాన్ని చేరు కోవటానికి అతడు నిరంతరం శ్రమించాలి. ఆ శ్రమలోనే అతడికి ఆనందం కలుగుతుంది. ఆనందంతో, ఇష్టంతో పడేకష్టం అలసట కలిగించదు. అలసట ఎరుగని శ్రమ విజయాన్ని అందిస్తుంది. ఇనుపకండలూ, ఉక్కునరాలు కలిగిన యువకులు ఈ దేశానికి ఎంతో అవసరం. 'తిండి కలిగితే కండ కలదోయ్.... కండ కలవాడేను మనిషోయ్' అన్న మహాకవి మాటలూ ఈ విష యాన్నే బలపరుస్తాయి. ఇటువంటి ఉత్సాహాన్ని ఉగాది పచ్చడిలోని ఉప్పు అందిస్తుంది. వైద్యపరంగా చూస్తే ఉప్పు బద్ధకాన్ని నివారించి, ఆకలిని పెంపొందింపజేస్తుంది. కఫాన్ని, కంటిలో ఎరుపుదనాన్ని తగ్గిస్తుంది.

## తిక్తం (చేదు)

చేదు రుచికోసం ఉగాది పచ్చడిలో వేపపూత కలుపు తారు. చేదు మనిషికి కలిగే బాధలకు సంకేతం. బాధలేని మనిషి భూమ్మీద ఉండనే ఉండడు. అలాగని, బాధల్ని తల్చుకుంటూ జీవితాన్ని నిస్తేజంగా గడపటం తగదు. ఎప్పుడైతే బాధ కలుగుతుందో అప్పుడే ధైర్యాన్ని తెచ్చుకోవాలి. బాధలు కలిగినప్పుడే మనిషి సహనాన్ని అలవర్చుకోవాలి. బాధ కలిగింది కదా అని ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించకుండా, తన కష్టాన్ని తొలగించుకునే మార్గాన్ని అన్వేషించాలనే కర్తవ్యాన్ని ఉగాది పచ్చడిలోని చేదు బోధిస్తుంది.

సహనం కోల్పోతే విచక్షణ జ్ఞానం నశిస్తుంది. విచక్షణం లేని వ్యక్తి ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తాడు. ఇందువల్ల కష్టాలు, బాధలు మరింత పెరుగుతాయి. ఆప్తులు దూర మౌతారు. ఇవన్నీ జరగకుండా ఉండటానికి మనిషి సహనాన్ని పెంచుకోవాలి. బాధ కలిగినప్పుడు మనసును మరింత కఠినం చేసుకుని, ఆ బాధను దిగమింగుకునే ప్రయత్నం చెయ్యాలి. బాధపడుతూంటే కూర్చుంటే సమస్యలు పరిష్కారం కావు. వివేకం, వివేచన ఆయుధాలుగా చేసుకుని, బాధల తీరాన్ని దాటాలి. వేపపూత అందించే సందేశం ఇదే! వైద్యపరంగా చూస్తే- చేదు విషానికి విరుగుడుగా పనిచేస్తుంది. తల్లిపాలలో ఉండే దోషాలనుకూడా ఇది తగ్గిస్తుంది. దప్పిక, దురదలు, మంటలు పోగొడుతుంది. చర్మవ్యాధులనుంచి ఉపశమనం కలిగిస్తుంది.

## ఆమ్లం (పులుపు)

ఉగాది పచ్చడి నోటికి తగలగానే కలిగే భావన పులుపు. చింతపండు పుల్లదనం అందిస్తుంది. పులుపులో చురుకు ఎక్కువగా ఉంటుంది. పులుపు నేర్పరితనానికి సంకేతం. మనిషికి కలిగే కష్టాలు, నష్టాలు, బాధల నుంచి ఉపశమనం పొందటానికి నేర్పరితనం ఎంతో అవసరం. నేర్పరితనం లేని మనిషి మొద్దుగా ప్రవర్తిస్తాడు. ఇతరుల ఆత్మీయత అందుకోలేడు. మనిషిని సమాజానికి దగ్గర చేసేది అతనిలోని చురుకుదనం, నేర్పరితనం. ఈ రెండూ లేని వ్యక్తి సోమరిగా తయారౌతాడు. సోమరి ఏ పనీ చెయ్యకుండా ఇతరుల మీద ఆధారపడే పరాన్నజీవిగా మారతాడు. సమస్య కలిగినప్పుడు వెంటనే చురుకుగా స్పందించాలి. ఆ స్పందనలోని వేగమే అతడికి విజయాన్ని సాధించి పెడుతుంది. ప్రతిదానికి చిరాకుపడకుండా, చింతపడకుండా ప్రతి అంశంలోనూ కొత్తదనాన్ని తీసుకుని, చైతన్యవంతంగా ఉండాలనే సందేశాన్ని ఉగాదిపచ్చడిలోని పులుపు అందిస్తుంది. వైద్యపరంగా పులుపుదనం వాతాన్ని పోగొట్టి, ఆకలిని పెంచుతుంది. గుండెకు మేలు చేస్తుంది. రుచి కోల్పోయిన నాలుకకు ఉత్తేజం కలిగిస్తుంది.

## కషాయం (వగరు)

మామిడి పిందెల ముక్కలు ఉగాది పచ్చడికి వగరు దనాన్ని కలిగిస్తాయి. వగరుదనం కొత్త సవాళ్లను స్వీకరించ

టానికి సంకేతం. సవాళ్లను స్వీకరించిన మనిషిమాత్రమే జీవితంలో విజయం సాధిస్తాడు. లేకపోతే అతడు నిరంతరం పరాజితుడుగానే మిగిలిపోతాడు. బంధువులు, స్నేహితులు, గురువులు ఉన్న కౌరవసేనతో యుద్ధం చెయ్యలేనంటూ రథాన్ని విడిచిపెట్టిన అర్జునుడికి కృష్ణుడు చేసిన బోధ 'సవాలును స్వీకరించటం'. కష్టం, నష్టం... మరేదైనా కానీ ఆ సందర్భాన్ని ఒక సవాలుగా తీసుకోవాలి. భగవద్గీతలో కృష్ణపరమాత్మ 'క్షుద్రం హృదయదౌర్బల్యం' అన్నట్లు మనసులోని దుర్బలత్వాన్ని విడిచిపెట్టాలి. సీతమ్మజాడ కనిపెట్టటంకోసం సముద్రాన్ని లంఘిస్తున్న హనుమంతుడికి ఎన్నోవిఘ్నాలు కలిగాయి. వాటన్నిటినీ హనుమ సవాలుగా స్వీకరించి, వాటిని సమయోచిత నైపుణ్యంతో ఎదుర్కొని, సీతమ్మజాడ కనుగొన్నాడు. విజయం సాధించాడు. సవాలును స్వీకరించి, విజయంకోసం శ్రమిస్తేనే జీవితానికి అర్థం, పరమార్థం లభిస్తాయి. వైద్యపరంగా చూస్తే వగరుదనం శ్లేష్మ, రక్త, పిత్తబాధలు తగ్గిస్తుంది. గాయాలు మాన్పుతుంది. అధికస్రావాలను ఆపుతుంది.

## కటు (కారం)

ఉగాదిపచ్చడిలో అంటీ అంటకుండా నోటికి తగిలే రుచి కారం. ఈ రుచికోసం ఉగాది పచ్చడిలో మిరియాల చూర్ణం కలుపుతారు. కారం ధైర్యానికి సంకేతం. కోపానికి ప్రతీక. ధైర్యం లేనిమనిషి జీవితంలో ఏదీ సాధించలేడు. ధైర్యలక్ష్మి లేకపోతే మిగిలిన లక్ష్ములు ఉన్నా ప్రయోజనం లేదు. ప్రతిమనిషికీ జీవితం ఓ అగ్నిపరీక్ష. ఏ ఒక్కరి జీవితమూ పూర్తిగా సుఖాలతో ఉండదు. జీవితంలో ఆపదలు రావటం చాలా సహజం. అటువంటి సందర్భాల్లోనే ధైర్యం కలిగి ఉండాలి. ధైర్యం లేకపోతే వివేకం నశిస్తుంది. వివేకం లేకపోతే కష్టాన్ని దాటే ఆలోచన రాదు. సరైన ఆలోచన లేకపోతే కష్టం తొలగిపోదు. సీతమ్మను. రావణాసురుడు అపహరించినంతటి విషాదంలోనూ రాముడు ధైర్యం కోల్పోలేదు. అందుకే, సుగ్రీవుడితో సఖ్యం చేసి, చివరకు రావణాసురుణ్ణి సంహరించి, సీతమ్మను పొందాడు. దుర్యోధనుడు ఎన్ని కష్టాలకు గురిచేసినా పాండవులు ధైర్యం కోల్పోలేదు. అందుకే విజయం సాధించారు. దేవతలు అనేకవిధాలుగా కష్టాలు పెట్టి, పరీక్షించినా నలమహారాజు ధైర్యాన్ని విడిచిపెట్టలేదు. చివరకు తనను పరీక్షించిన దేవతలచేత ప్రశంసలుకూడా అందుకున్నాడు. కష్టాలకడలి మీదపడినా హరిశ్చంద్రుడు ధైర్యం కోల్పోలేదు. అబద్ధం చెప్పలేదు. అందుకే, జాతికి ఆరాధ్యుడయ్యాడు. వీరందరి మార్గదర్శకత్వమే మనిషికి ఆదర్శం కావాలి. 'ధైర్యే సాహసే లక్ష్మీః' అనే సామెత ఈ సందేశంతోనే పుట్టింది. వైద్యపరంగా చూస్తే కారం పేగుల్లో ఉండే పురుగులను చంపి, ఆకలిని పెంపొందిస్తుంది. రుచి పుట్టిస్తుంది. దురదలను తగ్గిస్తుంది.

**ఎడమచేతితో కరోనాను ఓడించవచ్చు**

**బయటికి వెళ్లినప్పుడు ఏ పనైన గానీ ఎడమ చేతితో మాత్రమే చేయండి. నోట్లు తీసుకోవడం, లిఫ్ట్ డోరు తెరవడం ఇలా ఏ పనైన ఎడమ చేతితో చేస్తే పొరపాటునైన మనం కుడిచేతితో కళ్లు, ముక్కు, ముఖం, తాకడం లాంటివి చేస్తే వైరస్ సోకే ప్రమాదం చాలా తక్కువ.**

## యోగశాస్త్ర పరంగా...

యోగశాస్త్రపరంగా ప్రతి మనిషిలో ఆరు చక్రాలు ఉంటాయి. వీటినే షట్చక్రాలు అంటారు. అవి మూలాధార, స్వాధిష్ఠాన, మణిపూరక, అనాహత, విశుద్ధ, ఆజ్ఞాచక్రాలు. ఈ షట్చక్రాల్లోనే ప్రాణవాయువు సంచారం చేస్తుంటుంది. ఈ ఆరు చక్రాలు మనం తీసుకునే ఉగాదిపచ్చడిలోని ఆరు రుచులకు ప్రతీకలుగా నిలుస్తాయి. మూలాధారం – తీపి, స్వాధిష్ఠానం – వగరు, మణిపూరకం – చేదు, అనాహతం – పులుపు, విశుద్ధ– కారం, ఆజ్ఞ – ఉప్పు – ఇవి రుచులకు ఆలంబనగా ఉంటూ, మనిషి జీవక్రియల నిర్వహణలో తోడ్పడు తుంటాయి.

మనం తీసుకునే ఆహారంలో ఏ రుచి ఎక్కువగా ఉందో అందుకు అనుగుణంగా ఆ రకమైన ప్రాణవాయువు ఉత్తేజిత మౌతుంది. షట్చక్రాలు, పంచప్రాణాలను యోగశాస్త్రపద్ధతుల ప్రకారం అదుపులో ఉంచుకోవటానికి కఠినమైన ఆహార నియమాలు పాటించాలి. ఏ ఒక్క ఆహారం (రుచి) మాత్రమే కాకుండా అన్నిరకాల రుచుల మేళవింపుగా ఉండే ఆహారం తీసుకోవాలి. ఇలా రుచులన్నీ సమపాళ్లలో అంది నప్పుడే శరీరం మనిషికి స్వాధీనంలో ఉంటుంది. ఉగాది పచ్చడిలో ఆరు రుచులను కలిపి మేళవించటంలో ఉన్న మరో అర్థం ఇదే! మొత్తంగా ఉగాది పచ్చడి మనిషిని పరిపూర్ణుడుగా మారేం దుకు ప్రేరేపిస్తుంది.

పాఠం-06

# సంస్కృతం నేర్చుకుందాం..!!

రచన- మహామహోపాధ్యాయ కాశీ కృష్ణాచార్య

నిర్వహణ- మహామహోపాధ్యాయ సముద్రాల లక్ష్మణయ్య

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| यः | = | ఎవడు(ఎవడైతే) | अन्यः | = | ఇతరుడు | स्वः | = | తాను |
| प्रभृति | = | మొదలుకొని, నుండి | श्वः | = | రేపు | ह्यः | = | నిన్న |
| सन्तु | = | వారుండనిమ్ము | स्त | = | ఉండుడు | असाम | = | మేముండనిమ్ము |

## అ) ఈ క్రింది వాటికి తెలుగులోకి అనువాదం చేయండి?

01) वयम् अद्यप्रभृति तत्र स्मः।

02) यूयं श्वः प्रभृति अत्र स्त।

03) ह्यः अहं तत्रासम्।

04) अन्यः तत्र नासीत्।

05) यः तत्रासीत् सः अहम्।

06) त्वं कः?

07) अहम् एकः।

08) कदा त्वं तत्रासीः?

09) ते ह्यस्तत्रासन्।

10) तत्र ह्यः के आसन्,
अद्य प्रातः प्रभृति के सन्ति?

### అ) జవాబులు

01) మేము ఇవ్వేళనుండి అక్కడ ఉన్నాము.

02) మీరు రేపటినుండి ఇక్కడనుండుడు.

03) నిన్న నేను అక్కడనుంటిని.

04) ఇతరుడు అక్కడ లేకుండెను.

05) ఎవడైతే అక్కడనుండెనో అతడు నేను.

06) నీవెవరు?

07) నేను ఒకడిని.

08) నీవు ఎప్పుడు అక్కడనుంటివి?

09) వాళ్ళు నిన్న అక్కడనుండిరి.

10) నిన్న అక్కడ ఎవరుండిరి, ఇవ్వేళ ఉదయం నుండి ఎవరున్నారు?

## ఆ) ఈ క్రింది వాటికి సంస్కృతంలోకి అనువాదం చేయండి?

01) నిన్న నీవక్కడ లేవా?

02) నే నక్కడ లేను.

03) మేమక్కడ నుండనిమ్ము.

04) వారిక్కడ నుండనిమ్ము.

05) మీరు ఈనాడు మొదలుకొని యెక్కడ నుంటిరి?

06) మే మిక్కడ నుంటిమి.

07) మీరు అక్కడ నుంటిరి.

08) వీరెక్కడనున్నారో!

09) వారందరు నిక్కడ నుండిరి.

10) ఇప్పుడక్కడ నొక్క డున్నాడు.

### ఆ) జవాబులు

01) ह्यः त्वं तत्र नासीः किम्?

02) अहम् तत्र नासम्।

03) वयं तत्र असाम।

04) ते अत्र सन्तु।

05) यूयम् अद्य प्रभृति कुत्र आस्त?

06) वयं अत्र आस्म।


07) यूयं तत्र आस्त।

08) एते कुत्रासन्!

09) ते सर्वे अत्रासन्।

10) इदानीं तत्र एकः अस्ति।

**విశ్వదాభిరామం** **వేమన పద్యసూక్తి**



# కులం - గుణం

కులములోన నొకడు గుణవంతు డుండెనా,
కులము వెలయు వానిగుణముచేత;
వెలయు వనములోన మలయజం బున్నట్లు;
విశ్వదాభిరామ! వినుర వేమ!


**అర్థాలు:** కులము= గుంపు, తెగ; వెలయు= ప్రకాశించు (ఒప్పు); వనము= అడవి / ఉద్యానవనము; మలయజము = గంధపు చెట్టు.

**భావం:** కులంలో ఒక్క గుణవంతుడుంటే చాలు. వాని గుణంవల్లనే ఆ కులం ప్రకాశిస్తుంది. రకరకాల చెట్లతో నిండుగా ఉన్నఅడవిలో ఒక గంధపు చెట్టు ఉండినా, తనవాసనచేత అది వనమును ప్రకాశింపజేస్తుంది కదా?

**వివరణ:** వంశంలో ఆరంభంనుండి క్రమంగా ఎందరో పుడతారు. వంశం వృద్ధి చెందుతుంది. కాని అంతమందిలోనూ మంచిగుణం ఉన్నవాడు ఒక్కడు ఉన్నా చాలు. ఆ ఒక్కడివల్ల మొత్తం వంశానికే కీర్తిప్రతిష్ఠలు కలుగుతాయి. సమాజం ఉద్ధరించబడుతుంది. రాముడు జన్మించడంవల్ల రఘువంశానికి కీర్తి లభించింది. రామరాజ్యం అనేపేరు నిలిచిపోయింది. అలాగే ఈకాలంలో వివేకానందుడు, గాంధీమహాత్ముడూ మొదలైన వాళ్లు. వాళ్లపుట్టుకవల్ల దేశానికి మేలూ, వాళ్ల వంశానికి కీర్తీ లభించాయి.

- విద్వాన్ కట్టా నరసింహులు

# 63 వైకుంఠపాళి




**నిర్వహణ** **శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు**

## అడ్డం

1)శ్రీరాముని తల్లి(3); 2)తపము చేసేవాణ్ణి(3); 8)రాజులకు ప్రజలపై ఇది ఉండాలి(2); 9)పువ్వుల్లు...(3); 10)కొండల్లో ఇవి ఉంటాయి(2); 13)బలములేని స్త్రీ(3); 14)శ్రీరాముని బంటు(3); 14)శ్రీరాముని బంటు(3); 18)కైక భరతుని...(2); 19)పూర్వం యజ్ఞంలో దీన్ని బలి ఇచ్చేవారుట(3); 20)రాముని భార్య(2); 23)యశస్సు కల్గినవాడు (3) 24)మారీచుని తల్లి(3)

## నిలువు

2)శ్రీరామునికి సీత(2); 4)శపథంలో మార్గం(2); 5)శ్రీరామాయణంలో ఈ సర్గనే పారాయణ చేస్తారు(3); 6)వానరులులో దాగిన మానవులు(3); 7)గౌతముని భార్య(3); 11)రామునికి ఎంగిలి పండ్లనిచ్చిన భక్తురాలు(3); 12)రామాయణంలో నున్న రసం(3); 15)ఇంద్రుని సారథి(3); 16)సీతకు స్వప్న వృత్తాంతం చెప్పిన రాక్షస స్త్రీ(3); 17)గోదావరి నదికి గల పేరు(3); 21)మానవులకిది ఉండుట సహజం(2); 22)రాజుల వ్యసనపు క్రియ(2)

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.

- ప్రధాన సంపాదకుడు



తెలివి ఉన్న చోట వెలుగు ఉంటుంది




# మనం పనిచేస్తూనే ఉండాలి!

- డా॥ గరికిపాటి నరసింహారావు

పోతనగారి భాగవతంలో ఒక చిత్రమైన పద్యం ఉంది. అది ప్రథమస్కంధంలో భీష్మస్తవంలో ఉంది. భీష్ముడు అంపశయ్య మీద ఉండి, శ్రీకృష్ణుణ్ణి స్తుతిస్తూ చెప్పినపద్యం ఇది.

**హయరింఖాముఖ ధూళి ధూసర పరిన్యస్తాలకోపేతమై,**
**రయజాతశ్రమతోయబిందుయుతమై, రాజిల్లు నెమ్మోముతో**
**జయమున్ పార్థున కిచ్చువేడ్క నని నా శస్త్రాహతిన్ చాల నొ**
**చ్చియు పోరించు మహానుభావు నెదలో చింతింతు నశ్రాంతమున్॥**

ఈ పద్యంలో శ్రీకృష్ణునిముఖారవిందాన్ని వర్ణిస్తున్నాడు భీష్ముడు. యుద్ధరంగంలో తొమ్మిదోరోజు యుద్ధ దృశ్యాల్ని మళ్లీ ఒక్కసారి ఊహించుకొంటున్నాడు. ఆ రోజు భీష్ముడు, విజృంభించి యుద్ధంచేశాడు. యుద్ధరంగంలోకి శూలం ధరించి వచ్చిన ప్రళయకాలరుద్రుడిలా ఉన్నాడు. పార్థ సారథి అతివేగంగా రథం నడుపుతున్నాడు. అర్జునుడు యథా శక్తి భీష్మునితో పోరాడుతూ, సారథియైన కృష్ణుణ్ణి కాపాడుతూ, తనను తాను కాపాడుకొంటున్నాడు. ఆ స్థితిలో శ్రీకృష్ణునిముఖ పద్మం ఎలా ఉందో గమనించిన భీష్ముడు ఆ దృశ్యాన్ని మరచి పోలేక మళ్లీ గుర్తుచేసుకొంటున్నాడు. అతివేగంగా పరిగెడుతున్న అర్జునుని గుర్రాల కాలి గిట్టలనుండి రేగినధూళి గోవిందుని నుదుటిమీద పడుతోందట! అప్పటికే బాగా చెమటపట్టిన ఆ నుదుటి మీద ముంగురులు (అలకలు) గుండ్రం గుండ్రంగా గిరజాలు గిరజాలుగా అతుక్కొని, ఆ ఫాలభాగం ఎంతో అందంగా ఉందట! అటువంటి నుదుటిమీద గుర్రాలగిట్టల దుమ్ము పడి, ఆ ముఖానికి అదో అలంకారంలా ఉందట!

ఇక్కడే కాస్త ఆగి ఆలోచించాలి. అసలే యుద్ధరంగం! బీభత్సదృశ్యాలు! భయంకరస్థితి! వేగం, గాలి, ధూళి కళ్లు కప్పేస్తూ ఉంటాయి. ఈ స్థితిలో చెమటతో దుమ్ముకొట్టుకొని ఉన్న ముఖం- ఎంత భగవంతుడిదైతేమాత్రం అంత అందంగా



ఉంటుందా? పైగా ముఖంమీద పడిన దుమ్ము- ఆ ముఖం అందాన్ని పెంచే ఆభరణం కావడమేమిటి? అనౌచిత్యంగా లేదూ?

మనకు అలా అనిపించవచ్చు. కానీ, పరమాత్మకు అలా ఉండదు. ఎందుకంటే ఆయన ఆ ధూళిని అలంకారంగానే భావించాడు. మన మనోభావాలనుబట్టే మనముఖం ఉంటుంది. మనం విపరీతమైన ఆనందంతో నవ్వుతుంటేకూడా కళ్లవెంట నీళ్లొస్తాయి. అవి దూరంనుండి చూచేవాళ్లకు కన్నీళ్లలా కనిపించవచ్చు. కానీ మన ఆనందబాష్పాలు మనకు తెలుసు. ఎందుకంటే, ఆ సమయంలో మన మనస్సులో ఉన్నది ఆనందమే కానీ దుఃఖం కాదు. అలాగే గుర్రాలు గిట్టలద్వారా పరమాత్మ నుదుటిమీద దుమ్ము చిమ్ముతుంటే- ఆయన ఆ ధూళిని నవ్వుతూ స్వీకరించాడు. అందుకే అది అలంకారమయింది.


ఎందుకలా స్వీకరించాడని ఆలోచిద్దాం. ఆయన భగవద్గీతలో ఏం చెప్పాడు? "కర్మణ్యేవాధికార స్తే మా ఫలేషు కదాచన" అన్నాడు. అంటే మనం పనిచేస్తూనే ఉండాలి. కానీ, ఆ పనివల్ల వచ్చేఫలం ఏదైనా భగవదర్పణబుద్ధితో ఆ పని మాత్రం తప్పక చెయ్యాలి. సరిగ్గా అశ్వాలు అదే పని చేశాయి. అశ్వాల పని ఏమిటి? సారథి చెప్పినట్లు విని, పరుగుపెట్టాలి. అవి పాండవపక్షంలో ఉన్నా, కౌరవపక్షంలో ఉన్నా వాటిపని పరుగుపెట్టడంమాత్రమే! ఒకవేళ రథికుడు యుద్ధంమధ్యలో వెనక్కి పారిపోదలిస్తే, సారథి అలాగే నడిపిస్తే, అశ్వాలు ఇంటికే పరుగెత్తాలి కాని సారథి అటు లాగితే, అశ్వాలు ఇటు లాగితే ఇక కథ నడిచేదెట్లా? అర్జునుడిఅశ్వాలు శ్రద్ధగా, భక్తిగా పార్థసారథి ఎలా నడిపిస్తే అలా నడిచాయి. అందువల్ల రేగిన దుమ్మును ఆయనకే అర్పించాయి. అంటే కర్మఫలాన్ని భగవంతునికి సమర్పించాయి. కాబట్టే భగవంతుడు దాన్ని అలంకారంగా భావించి, స్వీకరించి వాటిల్ని అనుగ్రహించాడు. అందుకే ఆయన ఫాలభాగం దుమ్ముతో ఉన్నా ప్రకాశించింది. అంటే మనశక్తి కొలది మనం జీవితంలో ధర్మనిర్వహణ చేస్తూ, తత్ఫలాన్ని భగవంతుడికి అర్పిస్తే- ఆయన దాన్ని అలంకారంగా భావించి, స్వీకరించి మనల్ని ఆశీర్వదిస్తాడన్నమాట!


ఇంతకీ అశ్వాలకు ఇంత అవగాహన ఎక్కడిది? అర్జునుడితో పాటు గీతోపదేశసమయంలో అశ్వాలుకూడా అక్కడ ఉన్నాయి. అవీ విన్నాయి. మరి వాటికి గీతాభాష అర్థమవుతుందా? మనభాష అర్థం కాదు. కానీ, భగవంతుడిభాష అన్ని జీవులకూ అర్థం అవుతుంది. అది హృదయాలమధ్య సాగే మౌనమహాప్రవాహం!!

చిత్ర కథ

# అందరికీ మోక్షం!

కథ– డి.శ్రీనివాసదీక్షితులు
చిత్రాలు– కె.ద్వారకనాథ్





ఉపదేశం తర్వాత శ్రీరామానుజులు బాగా ఆలోచించారు. స్వార్థచింతన కంటే లోకశ్రేయస్సే గొప్పదని ఆయన భావించారు.
ఆర్తి కలిగిన వాళ్లందరికీ తిరుమంత్రాన్ని ఉపదేశిస్తాను. అందరికీ మోక్షం రావాలి.
మీ నిర్ణయం అపూర్వం ఆచార్యా!
వెంటనే ఆచార్యులు ఆలయగోపురం ఎక్కి ప్రజలందరినీ పిలిచారు. అష్టాక్షరీమంత్రార్థాన్ని ఉపదేశించారు శ్రీరామానుజులు.
ఓం నమో నారాయణాయ!
ఓం నమో నారాయణాయ!
తర్వాత గోష్ఠీపూర్ణులు రామానుజుల్ని పిలిచి కోపంతో మందలించారు...
యతిరాజా! నా ఆజ్ఞని తిరస్కరించిన నీకు నరకం తప్పదు.. తప్పదు
నాకు నరకం వచ్చినా బాధపడను. అందరికీ మోక్షం లభిస్తే చాలు ఆచార్యా!
శ్రీరామానుజుల మాటల్ని విన్న తర్వాత గోష్ఠీపూర్ణులు...
యతిరాజా! నువ్వు అవతారపురుషుడివి. నీ ఔదార్యం.. త్యాగం.. నిరుపమానమైనవి.
అంతా తమ సౌజన్యమే ఆచార్యా!
గోష్ఠీపూర్ణులు ఆనందంతో శ్రీరామానుజుల్ని కౌగిలించుకున్నారు.
యతిరాజా! నా స్వామీ! నా భాగ్యమా! ఎంబెరుమానార్...
ఆ గురుశిష్యులకు లోకమే ప్రణమిల్లింది.
లోకాః సమస్తాః సుఖినో భవన్తు!
స్వస్తి!

# కదంబం

## సప్తకాండలు
(వాల్మీకి రామాయణం)

1) బాలకాండ
2) అయోధ్యాకాండ
3) అరణ్యకాండ
4) కిష్కింధాకాండ
5) సుందరకాండ
6) యుద్ధకాండ
7) ఉత్తరకాండ.

## పిల్లలూ.. జతచేయండి!!

| | | | |
|---|---|---|---|
| 1) | రాముడు | అ) | దశరథుడు |
| 2) | శ్రీకృష్ణుని భార్యలు | ఆ) | అయిదుగురు |
| 3) | పాండవులు | ఇ) | దమయంతి |
| 4) | నలుడు | ఈ) | సీత |
| 5) | కౌసల్య | ఉ) | ఎనిమిదిమంది |

జవాబులు:
1-(ఈ); 2-(ఉ); 3-(ఆ); 4-(ఇ); 5-(అ)

## మీకు తెలుసా?

1) శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో మొదటివాహనం?
2) తిరుమలలో ఆనందనిలయాన్ని కట్టించిందెవరు?
3) శ్రీవారి బ్రహ్మోత్సవ ధ్వజపటంలో ఎవరుంటారు?
4) పదకవితాపితామహుడు ఎవరు?
5) ఉగాది ఏ తిథినాడు వస్తుంది?

జవాబులు:
1) పెద్దశేషవాహనం
2) తొండమాన్ చక్రవర్తి
3) గరుత్మంతుడు
4) తాళ్ళపాక అన్నమాచార్యులు
5) చైత్ర శుద్ధ పాడ్యమి

## కనుక్కోండి


ఈ అక్షరాలతో ఒక సూక్తి వస్తుంది...

మా వ సే న ధ వ మా సే వే వ

జవాబు:
మానవసేవే మాధవసేవ

## చిత్రలేఖనం

ఈ క్రింది బొమ్మకు రంగులు వేద్దామా...



ఈ పక్కన ఉన్న బొమ్మను క్రింది గడులలో గీయండి...




Edited and published on behalf of T.T.Devasthanams by Prof. K.Rajagopalan, Ph.D., Chief Editor, T.T.D. and printed at T.T.D. Press by Sri P.Ramaraju, M.A., Special Officer (Publications & Press), T.T.D. Press, Tirupati - 517507.



లోకకల్యాణార్థం 28-03-2021న
తి.తి.దే. పరిపాలనాభవనప్రాంగణంలోని
మైదానం (తిరుపతి)లో
తిరుమల తిరుపతి దేవస్థానములు
ఘనంగా నిర్వహించిన
ఫాల్గునలక్ష్మీవైభవం-లక్ష్మీజయంతి
మహోత్సవ వేడుకల దృశ్యమాలిక














TIRUMALA TIRUPATI DEVASTHANAMS